కలెక్టర్‌గా రాజాబాబు
గుంటూరుకు అన్సారియా బదిలీ

ఒంగోలు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నూతన కలెక్టర్‌గా పాలేటి రాజాబాబు నియమితులయ్యారు. రాష్ట్రంలో 12 జిల్లాల కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న తమీమ్ అన్సారియాను గుంటూరు కలెక్టర్‌గా బదిలీ చేసింది. ఆ స్థానంలో ప్రస్తుతం ఏపీ పబ్లిక్ సర్వీసు కమిషన్ సెక్రటరీగా పనిచేస్తున్న పాలేటి రాజాబాబును నియమించింది. తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం వద్దిపర్రు గ్రామానికి చెందిన రాజాబాబు డిగ్రీ వరకు నరసాపురంలో చదివారు. ఆంధ్రా యూనివర్సిటీలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 2000 సంవత్సరంలో గ్రూప్-1 అధికారిగా ఎంపికయ్యారు. కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో సీటీవోగా సర్వీసులో చేరిన ఆయన ఆ శాఖలో డిప్యూటీ కమిషనర్ వరకు హైదరాబాద్, సికింద్రాబాద్, నల్గొండ, విజయనగరం, గుంటూరులలో పనిచేశారు. 2013లో ఐఏఎస్ కేడర్‌కు ఎంపికయ్యారు. గ్రేటర్ విశాఖ కమిషనర్‌గా, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవోగా, సెర్ప్ సీఈవోగా, హౌసింగ్ ఎండీగా పలు పోస్టులలో బాధ్యతలు నిర్వహించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 ఏప్రిల్ వరకు కృష్ణా జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఈ ఏడాదే ఏపీపీఎస్సీ సెక్రటరీగా నియమితులై ప్రస్తుతం అక్కడ పనిచేస్తున్నారు. తాజా బదిలీల్లో ఆయన్ను ప్రభుత్వం జిల్లాకు కలెక్టర్‌గా నియమించింది. ప్రస్తుతం ఇక్కడ కలెక్టర్‌గా పనిచేస్తున్న తమీమ్ అన్సారియా గుంటూరు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి జరిగిన బదిలీల్లో 2024 జూన్ 27న ఇక్కడ కలెక్టర్‌గా అన్సారియా బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ అయినప్పటికీ ఈ 14 నెలల కాలంలో జిల్లాలో బాగా పనిచేశారన్న పేరు అన్నివర్గాల్లోనూ పొందారు. బంగారు బాల్యం, కంగారు వంటి ప్రత్యేక కార్యక్రమాలను ఆమె చేపట్టారు. బంగారు బాల్యం కార్యక్రమానికి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉన్న స్కోచ్ అవార్డు కూడా లభించింది.


కలెక్టర్‌గా నియమితులైన రాజాబాబు

బడాబాబుల భూ మాయ

నకిలీ పట్టాలు సృష్టించి.. భారీ భవంతులు నిర్మించి..!

ఒంగోలు నగర నడిబొడ్డున రూ.కోట్ల విలువ చేసే బండ్లమిట్ట బీటీ రోడ్డు, కార్పొరేషన్‌కు చెందిన ఊరచెరువులో ఆక్రమణలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. గత వైసీపీ పాలనలో నాటి పాలకులు, ఆ పార్టీ ప్రజాప్రతినిధుల అండదండలతో కొందరు బడాబాబులు నకిలీ డీకే పట్టాలు సృష్టించి భారీ భవంతులు నిర్మించారు. అప్పట్లో నగరపాలక సంస్థ అధికారులు మౌనం వహించడం విమర్శలకు తావిచ్చింది. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఆవైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు.

- బండ్లమిట్ట బీటీ రోడ్డు.. ఊరచెరువులో ఆక్రమణలు
- నాటి వైసీపీ పెద్దల అండతో అడ్డగోలుగా నిర్మాణాలు
- అన్నీ తెలిసినా మౌనం వహించిన అధికారులు
- కబ్జాలపై లోకాయుక్తకు ఫిర్యాదు


ఊరచెరువును ఆక్రమించి నిర్మించిన భవనాలు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆపార్టీ పెద్దల సహకారం ఆక్రమణదారులకు కలిసొచ్చింది. ప్రభుత్వ స్థలం కబ్జాచేసి, ప్లాను లేకుండా పన్నులు వేయించుకున్నారు. యథేచ్ఛగా అనుభవించడంతోపాటు, వ్యాపార కేంద్రాలుగా మార్చేశారు. ఇంత జరుగుతున్నా అప్పట్లో అధికారులు చర్యలు తీసుకునేందుకు వెనకడుగు వేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా మిన్నకుండటంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. తాజాగా ఊరచెరువు, బండ్లమిట్ట బీటీ రోడ్డు ఆక్రమణలపై సామాజిక కార్యకర్త ఎం.మాధవరావు లోకాయుక్తను ఆశ్రయించారు. ఊరచెరువు ఆక్రమణలు, అడ్డగోలు నిర్మాణాలు, అందులో భాగస్వాములైన వారి పేర్లను

మిగతా 6వ పేజీలో


బండ్లమిట్ట రోడ్డును ఆక్రమించి నిర్మించిన భారీ భవంతులు



ఒంగోలు గద్దలగుంట రాజాపానగల్ రోడ్డులోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో గణపతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం రూ.25లక్షల కరెన్సీతో వినాయకుడిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తిలకించారు. 35 సంవత్సరాలుగా ఈ ఉత్సవాలను ఘనంగా చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కార్పొరేషన్

డీఎస్సీ సర్టిఫికెట్లపై మరో మలుపు

- పునఃపరిశీలించాలని విద్యాశాఖ నిర్ణయం
- 35 మంది వివాహితులు తండ్రి పేరుతో ఈడబ్ల్యూఎస్ పత్రాలు
- భర్త పేరుతో సమర్పించాలని తాజాగా సూచన

ఒంగోలు విద్య, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన మరో మలుపు తిరిగింది. ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాల విషయంలో కొత్త చిక్కు వచ్చి పడింది. ప్రధానంగా మహిళా అభ్యర్థులకు సంబంధించి ఈ వివాదం నెలకొంది. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల విషయంలో మొదట పాఠశాల విద్యాశాఖ స్పష్టత ఇవ్వలేదు. మహిళా అభ్యర్థుల విద్యార్హతలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అన్నీ తండ్రి పేరుతోనే ఉంటాయి. అందుకే వారు కూడా తండ్రి కుటుంబ ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకొని ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు సమర్పించారు. దీనిపై కొన్ని జిల్లాల నుంచి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. వివాహితులైన మహిళా అభ్యర్థుల్లోని కొందరి భర్తల్లో సంపన్నకుటుంబాలకు చెందిన వారు ఉన్నారు. వారికి భారీగా ఆస్తులు, భూములు, డిపాజిట్లు ఉన్నాయి. ఈనేపథ్యంలో మహిళా అభ్యర్థుల ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లను పునఃపరిశీలించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డీఈవోలను ఆదేశించింది.

మళ్లీ సర్టిఫికెట్ల కోసం ఉరుకులు.. పరుగులు

ఈసారి డీఎస్సీలో జండర్ కాలంలో మహిళలు అయితే వివాహితులా, అవివాహితులా అని స్పష్టంగా అడిగారు. వివాహితులుగా పేర్కొన్న వారికి ఈడబ్ల్యూఎస్ కోటాలో పది శాతం రిజర్వేషన్ కల్పించారు. దీంతో మహిళా

మిగతా 6వ పేజీలో

ఆటోవాలాలకు దసరా ధమాకా

జిల్లాలో 11,200 మంది డ్రైవర్లకు లబ్ధి

విధివిధానాల కోసం ఎదురుచూస్తున్న రవాణా శాఖ



ఒంగోలుక్రైం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆటోవాలాలకు రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుకను ప్రకటించింది. సొంత ఆటో కలిగి ఉన్న డ్రైవర్‌కు ఏడాదికి రూ.15 వేలు అందించనున్నట్లు బుధవారం అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. దీనివలన రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.90లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. జిల్లాలో సుమారు 11,200 మంది డ్రైవర్లకు ఏడాదికి రూ.16.80కోట్లు అందజేయనున్నారు. గత లెక్కల ప్రకారం జిల్లాలో వాహనమిత్ర పథకం ద్వారా 10,741 మంది లబ్ధిదారులుండగా ప్రస్తుతం మరో 5శాతం పెరిగే అవకాశం ఉంది. ఆప్రకారం సుమారు 11,200 మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది ఇంకా ప్రభుత్వం నుంచి విధివిధానాలు విడుదల కాలేదు. అయితే గతంలో ఇచ్చిన లబ్ధిదారుల జాబితాలతో రెవెన్యూ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న జాబితాలో ఇప్పటివరకు ఎవరు అర్హులు అనే కోణంలో పరిశీలన చేస్తున్నారు.



ప్రజా సమస్యలపై చర్చ జరిగేనా?

- అజెండాలో 11 అంశాలు
- జిల్లాలో వర్షాభావం
- ధరలు సరిలేక రైతుల్లో ఆందోళన
- పూర్తిగా ప్రజలకు అండగా ఉండాల్సిన సమయం
- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. ఒకవైపు వర్షాభావం, మరోవైపు ధరలు లేక రైతులు తల్లడిల్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక పాత జడ్పీ సమావేశపు హాలులో చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశంలో 14 అంశాలు అజెండాలో ఉనప్పటికీ ప్రధానమైన శాఖలకు చెందినవి 11 ఉన్నాయి. వీటితోపాటు ఇతర సమస్యలపై కూడా చర్చించి ఉపశమనం కల్పించాలని ప్రజానీకం కోరుతోంది. ఇప్పటివరకు జరిగిన సమావేశాలను పరిశీలిస్తే అజెండాలో పది అంశాలకుపైగా ఉన్నా కేవలం నాలుగైదింటిపై మాత్రమే అరకొరగా

మిగతా 6వ పేజీలో

ఇదేం మార్పు!

జిల్లా సహకారాధికారిగా శ్రీలక్ష్మి

- అదనపు బాధ్యతల నుంచి ఇందిరాదేవి తొలగింపు
- డీసీసీబీపై విచారణ సమయంలో మార్పుతో అనుమానాలు

ఒంగోలు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకారశాఖాధికారి (డీసీవో)గా డి.శ్రీలక్ష్మి నియమితులయ్యారు. ఇప్పటి వరకు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) డీసీవోగా విధులు నిర్వహిస్తున్న ఎస్.ఇందిరాదేవిని ఆ బాధ్యతల నుంచి తప్పించారు. పూర్తిస్థాయి అధికారి నియామకం అవసరమే అయినప్పటికీ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో సెక్షన్ 51 విచారణ ప్రారంభ సమయంలో ఈ మార్పు జరగడం సహకార శాఖలో చర్చకు

మిగతా 6వ పేజీలో


డీసీవో కార్యాలయం


డీఎంహెచ్‌వో కార్యాలయంలో విచారణకు హాజరైన ఏఎన్ఎంలు

ఉద్యోగోన్నతులపై విచారణ

- వైద్యశాఖలో రికార్డులను పరిశీలించిన జేడీ ఆధ్వర్యంలోని బృందం
- ఏఎన్ఎంలు, ఫిర్యాదుదారుడు హాజరు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలో గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు గ్రేడ్-3 ఉద్యోగోన్నతులపై ఫిర్యాదులు రావడంతో వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. నాలుగు నెలల క్రితం సుమారు 200 మందికిపైగా ఏఎన్ఎంలకు ఉద్యోగోన్నతి కల్పించారు. అందులో పలు అవకతవకలు చోటుచేసుకున్నాయని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిళ్లా చెన్నయ్య ఇటీవల వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వారు విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో గురువారం స్థానిక డీఎంహెచ్‌వో

మిగతా 6వ పేజీలో

రేపు జాతీయ లోక్ అదాలత్

- జిల్లాలోని అన్ని కోర్టుల్లో నిర్వహణ
- జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి వెల్లడి



ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారానికి కక్షిదారులంతా సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎ.భారతి కోరారు. శనివారం జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆమేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కేసుల పరిష్కారం కోసం జిల్లాలోని కోర్టుల్లో 25 బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటి ద్వారా సుమారు 9వేల కేసులను గుర్తించామని ఆమె పేర్కొన్నారు. రాజీపడదగిన అన్ని క్రిమినల్, చెక్ బౌన్స్, వివాహ సంబంధమైనవి, అన్ని రకాల సివిల్ కేసులు ఇరువురి ఆమోదంతో పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని పెండింగ్ కేసుల్లో ఉన్నవారు ఉపయోగించుకొని వ్యాజ్యాలను పరిష్కరించుకోవాలని కోరారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసులలో తీర్పు అంతిమమని స్పష్టం చేశారు. కోర్టులలో చెల్లించిన ఫీజును తిరిగి పొందవచ్చని తెలిపారు. పోలీస్, ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని కేసుల పరిష్కారానికి సహకరించాలని భారతి కోరారు.





ఒంగోలులో మానవహారం

బర్లీ పొగాకు సాగు చేయొద్దు

● ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ, మానవహారం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రానున్న రబీ సీజన్‌లో రైతులు నల్లబర్లీ/తెల్లబర్లీ పొగాకు పంటను సాగు చేయొద్దని కోరుతూ జిల్లా కేంద్రమైన ఒంగోలులో గురువారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, గ్రామ సహాయ వ్యవసాయకులు, రైతులతో కలిసి ఈ ర్యాలీ నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్ నుంచి నెల్లూరు బస్టాండు వరకు, అక్కడి నుంచి తిరిగి చర్చిసెంటర్ వరకు నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణీ, డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ వాణీశ్రీ, ఒంగోలు, దర్శి, సింగరాయకొండ సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు బి.రమేష్‌బాబు, బాలాజీనాయక్, నిర్మలాకుమారి ఉన్నారు.

బడాబాబుల భూ మాయ

(5వ పేజీ తరువాయి)

వివరిస్తూ ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు ఆక్రమణలపై ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

నకిలీ పట్టాలతో పాగా.. అందులో భారీ భవనాలు

ఒంగోలు నగర సర్వే నెం.14/1 ఊరచెరువు, బండ్లమిట్ట నుంచి అద్దంకి బస్టాండ్‌కు వెళ్లే బీటీ రోడ్డులో రూ.కోట్ల విలువ చేసే భారీ భవంతులు అడ్డగోలుగా నిర్మించారు. అయితే సామాన్యుడు భవనం కట్టుకోవాలంటే సవాలక్ష నిబంధనలతో అభ్యంతరం చెప్పే కార్పొరేషన్ అధికారులు డీకే పట్టాలలో భవనాలు కట్టినా మౌనం వహించారు. ముఖ్యంగా అక్కడ సృష్టించిన నకిలీ పట్టాలకు అక్కడి సర్వే నంబరు వేయకుండా రాజీవ్‌నగర్‌కు చెందిన సర్వే నంబర్ వేసి మరీ భవనాలకు పన్ను విధించారు. ప్రస్తుతం ఈ భవనాల్లో షాపింగ్ మాల్స్, వ్యాపార సముదాయాలు, నిర్మించారు. అయితే వాటికి కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు లేవు. వాస్తవానికి సర్వే నంబర్ 14/1 ఊరచెరువు కార్పొరేషన్‌కు చెందినది కాగా ప్రస్తుతం ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని హైకోర్టు ఆదేశాలు ఉన్నాయి. అయినప్పటికీ కార్పొరేషన్ అధికారులు కన్నెత్తి చూడలేదు. మరోవైపు ఏడాది క్రితం బండ్లమిట్ట బీటీ రోడ్డు విస్తరణ చేసేందుకు కార్పొరేషన్ అధికారులు మార్కింగ్ చేసి కాస్తంత హడావుడి చేసినా, ఆ తర్వాత పెద్దగా పట్టించుకోకపోవడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

వారంతా వైసీపీ నిరుపేదలంట.

ఊరచెరువు, బండ్లమిట్ట బీటీ రోడ్డులో ఆక్రమణలు చేసిన వారిలో అత్యధిక శాతం మంది వైసీపీకి చెందినవారు ఉన్నారు. వారందరినీ పేదలుగా గుర్తించి డీకే పట్టాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉంది. ముఖ్యంగా డీకే పట్టాలు పొంది, భవనాలు నిర్మించిన వారిలో వైసీపీకి చెందిన ఒడా మాజీ చైర్మన్ భర్త, వారి బంధువుల పేరుతో పట్టాలు ఉన్నాయి. పోలీసు శాఖలో పనిచేసిన ఓ విశ్రాంత ఏఎస్ఐ, క్రికెట్ బెట్టింగ్‌లో పేరు పొందిన మరో వ్యక్తికి కూడా షాపులు ఉన్నాయి. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన భవనాల ద్వారా అద్దెల రూపంలో లక్షలు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే నకిలీ పట్టాలు సృష్టించి భారీ భవంతులు నిర్మించిన వాటికి కార్పొరేషన్ అధికారులు సైతం పన్ను విధించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఆక్రమణలపై లోకాయుక్తలో ఫిర్యాదు

ఊరచెరువులో ఆక్రమణలు, అక్రమ కట్టడాలపై సామాజిక కార్యకర్త ఎం.మాధవరావు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఆధారాలను కూడా ఆయన సమర్పించినట్లు సమాచారం. ముఖ్యంగా నకిలీ డీకే పట్టాలు సృష్టించి వాటికి నకిలీ సర్వే నంబర్లతో పన్ను వేయించడం, ప్లాను లేకుండా షాపులు నిర్మించడం, ఆ భవనాలకు తాగునీటి కోసం కార్పొరేషన్ నుంచి కొళాయిలు కూడా పొందారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆక్రమణల వ్యవహారంలో కీలకదారులంతా వైసీపీలో పేరు ఉన్న వ్యక్తులు కాగా, వారి బంధువుల కూడా ఉన్నట్లు ఆయన ఫిర్యాదులో స్పష్టం చేశారు. దీనిపై కార్పొరేషన్ అధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

డీఎస్సీ సర్టిఫికెట్లపై మరో మలుపు

(5వ పేజీ తరువాయి)

అభ్యర్థులు తమ తండ్రి పేరుతోనే ఆ సర్టిఫికెట్లు సమర్పించారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో మరోసారి పరిశీలించి జిల్లాలో ఎంపిక జోన్‌లో నిలిచిన మహిళా అభ్యర్థుల్లో 35 మంది వివాహితులు ఉన్నట్లు గుర్తించారు. వీరంతా తండ్రి పేరుతోనే ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు సమర్పించారు. ఈ 35 మంది మళ్లీ తమ భర్తల పేరుతో తాజాగా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఇవ్వాలని విద్యాశాఖ అధికారులు కోరారు. ఎంపిక జాబితాలో ఉన్న వీరు ఉరుకులు, పరుగులు మీద మండల రెవెన్యూ అధికారులను సంప్రదించి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు తెచ్చి సమర్పించారు. గురువారం సాయంత్రానికి 35 మందిలో ఇద్దరి సర్టిఫికెట్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం మీద సర్టిఫికెట్ల పరిశీలన రోజుకో మలుపు తిరుగుతుండటంతో అభ్యర్థులు గందరగోళానికి గురవుతున్నారు.

ఉద్యోగోన్నతులపై విచారణ

(5వ పేజీ తరువాయి)

కార్యాలయంలో వైద్యారోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ నాయక్ నేతృత్వంలోని బృందం విచారణ నిర్వహించింది. పలువురు ఏఎన్ఎంలను పిలిచి విచారించింది. ఫిర్యాదుదారుడైన చెన్నయ్యతో కూడా మాట్లాడింది. అంతకు ముందు ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితా, ఇతర రికార్డులను పరిశీలించింది. ఈ సందర్భంగా పలు అనుమానాలకు వైద్యశాఖ అధికారులు నివృత్తి చేసినట్లు సమాచారం. ఫిర్యాదుదారుడు మాత్రం ఏడుగురికి కల్పించిన ఉద్యోగోన్నతుల్లో పలు అక్రమాలు, అవకతవకలు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తూ తన వద్ద ఉన్న ఆధారాలను సమర్పించినట్లు తెలిసింది.

ప్రజా సమస్యలపై చర్చ జరిగేనా?

(5వ పేజీ తరువాయి)

చర్చ చేసి మమ అనిపిస్తున్నారు. ఈసారి కూడా ఒక పూట మాత్రమే సమావేశం జరగనుండటంతో ఆయా అంశాలపై పూర్తిస్థాయిలో చర్చ జరుగుతుందా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో వివిధ సమస్యలపై ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. క్షేత్రస్థాయిలోని ప్రజాప్రతినిధులు ప్రభుత్వంలో కీలకంగా ఉంటున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల దృష్టికి ఆయా సమస్యల పరిష్కారంపై చర్చ జరిగే విధంగా వ్యవహరించాల్సి ఉంది. సమావేశంలో ప్రధానంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణం, రోడ్లు, భవనాలు, విద్యుత్, విద్యాశాఖ, వ్యవసాయ, దాని అనుబంధ శాఖలు, సాంఘిక సంక్షేమం, ప్రజా రవాణా శాఖ కార్యకలాపాలపై సమీక్ష జరగనుంది. ఆయా అంశాలపై పూర్తి స్థాయిలో చర్చ జరిగితే ప్రజలకు కొంతమేరకైనా మేలు చేకూరుతుంది.

అభివృద్ధే.. అజెండా..!

● ట్రంక్‌రోడ్ విస్తరణకు నేడు ఆమోదం
● నగరంలో డ్రెయిన్‌లు.. సీసీ రోడ్‌ల నిర్మాణానికి ప్రాధాన్యం
● నేడు ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర అభివృద్ధే అజెండాగా.. నగరంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి నేడు ఆమోదం లభించనుంది. యిందుకు సంబంధించి ప్రధానంగా నగర రహదారుల విస్తరణకు శ్రీకారం పలకగా, ప్రధానంగా ట్రంక్ రోడ్ విస్తరణే కీలకంగా నిలవనుంది. ఈ మేరకు ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు 64 అజెండా అంశాలను సిద్ధం చేయగా, వాటిలో సీసీ రోడ్‌ల నిర్మాణం, సీసీ డ్రైన్‌లు, పార్కుల అభివృద్ధి, శ్మశాన వాటికల్లో సౌకర్యాలు, మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల ఖాళీ భర్తీతోపాటు, పోతురాజు కాలువల ఆధునికీకరణకు ప్రాధాన్యత ఇచ్చారు. కాగా ఈ అంశాలన్నింటికీ గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగే పాలక వర్గ సమావేశంలో ఆ అంశాలన్నింటికీ ఆమోదం లభించనుంది.

రహదారులు విస్తరణ..

ఒంగోలు నగరానికి కార్పొరేషన్ హోదా లభించి సుమారు 14 ఏళ్ళు పూర్తి కావస్తుండగా, అందుకు అనుగుణంగా అవసరమైన మౌలిక సౌకర్యాలు, రహదారులు లేకపోవడంపై కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు నగర హోదాను దృష్టిలో ఉంచుకుని రహదారుల విస్తరణకు శ్రీకారం పలికారు. ఇప్పటికే కర్నూలు రోడ్, సీవీఎన్ సెంటర్ రోడ్, కొత్తపట్నం బస్టాండ్, గోరంట్ల కాంప్లెక్స్ రోడ్ విస్తరణ పనులు జరుగుతుండగా, కొన్ని నెలలుగా ట్రంక్ రోడ్ విస్తరణ ముడిపడటం లేదు. నరగ మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగులు విస్తరణకు ప్రతిపాదించడంతో వ్యాపారుల నుంచి అభ్యంతరాలు ఎదురయ్యాయి. ఇదే క్రమంలో సుమారు 70 మంది వ్యాపారులు ఇటీవల కోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కార్పొరేషన్‌కు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రహదారి విస్తరణకు పాలకవర్గం ఆమోదం తెలియజేయనుంది. అలాగే బీఎస్‌హాలు రోడ్ విస్తరణ పనులు ఆమోదం తెలపనున్నారు.



రోడ్‌లు.. డ్రైన్‌లు.. పార్కులు.. గ్రీనరీ..

నగరంలోని పలు డివిజన్‌లలో కొత్తగా సీసీ రోడ్‌లు, మురుగునీరు పాదల వ్యవస్థ మెరుగు కోసం కొత్తగా డ్రైన్‌లు, శ్మశాన వాటికల అభివృద్ధికి, పార్కులలో పచ్చదనం కోసం అవసరమైన పనులను అజెండాలో పొందుపరిచారు. వీటితోపాటు, ఒంగోలులో విలీనమైన గ్రామాలలో కూడా రోడ్‌లు, డ్రైన్‌లకు ప్రాధాన్యత కల్పించారు. ఇదిలా ఉండగా, నగరంలోని ప్రాంతాలలో రోడ్ విస్తరణ క్రమంలో సెంటర్ డివైడర్‌లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య నివారణపైనా దృష్టి సారించారు.

మునిసిపల్ షాపుల లీజులు..

కార్పొరేషన్‌కు ఆదాయ వనరులు పెంపు కోసం మునిసిప్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీలలను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టారు. స్థానిక ఊరచెరువులోని దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో ఖాళీ ఉన్నషాపులను వేలంపాట ద్వారా కేటాయించనుండగా, అమరజీవి షాపింగ్ కాంప్లెక్స్ లీజు గడువు ముగిసినందున తిరిగి స్వాధీనం చేసుకుని మరల వేలం నిర్వహించనున్నారు. అలాగే ఊరచెరువులోని నిరుపయోగంగా ఉన్న స్లాటర్ హౌస్ ప్రస్తుతం శిధిలమైపోయి ఉండగా, తిరిగి బాగు చేసి, వినియోగంలోని తీసుకువచ్చేవిధంగా చర్యలు చేపట్టనున్నారు. కాగా పోతురాజు కాలువ పూడికతీత పనులు చేపట్టడంతోపాటు శివారు కాలనీల్లో అవసరమైన సీసీడ్రైన్‌లకు ప్రాధాన్యత ఇచ్చారు.

రైలులో మరిచిపోయిన బ్యాగ్ అప్పగింత

విజయవాడ(రైల్వేస్టేషన్), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ గవర్నమెంట్ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) గురువారం ఒక ప్రయాణికుడు రైలులో మర్చిపోయిన బ్యాగ్‌ను ట్రేస్ చేసి తిరిగి అతనికి అప్పగించారు. గురువారం ఒంగోలుకు చెందిన రావిపాటి లక్ష్మీనారాయణ (68) బిట్రగుంట నుంచి విజయవాడ వచ్చే ప్యాసింజర్ రైలులో వస్తుండగా రైలు కృష్ణాకెనాల్ వద్ద కొంతసేపు ఆగింది. ఈ లోపల లక్ష్మీనారాయణ రైలు దిగి వాష్ రూమ్‌కు వెళ్లాడు. తిరిగి అతను వచ్చే లోగా సిగ్నల్ పడటంతో రైలు కదిలి వెళ్లిపోయింది. అతని బ్యాగ్ రైలులోనే ఉండిపోయింది. బ్యాగ్‌లో భూమికి సంబంధించిన విలువైన డాక్యుమెంట్లు ఉన్నందున ఆ సమాచారాన్ని విజయవాడ రైల్వే పోలీసు సీఐ రమణకు లక్ష్మీనారాయణ తెలియజేశాడు. సీఐ వెంటనే స్పందించి తన సిబ్బందిని రైలులో వెతికించారు. బ్యాగ్‌ను గుర్తించి లక్ష్మీనారాయణకు తిరిగి అప్పగించారు. విలువైన డాక్యుమెంట్లు లభించినందుకు లక్ష్మీనారాయణ జీఆర్‌పీకి కృతజ్ఞతలు తెలిపారు.

పొదిలిలో తాగునీటికి తిప్పలు

పొదిలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పొదిలి ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మండల ప్రజల అవసరాల కోసం 45 ఏళ్ల కిందట దర్శి ఎస్‌పీ స్టోరేజీ ట్యాంక్ నుంచి పైపులైన్ వేశారు. ప్రస్తుతం పెరిగిన ప్రజలకు సరిపడా నీరు అందడం లేదు. రోజుల తరబడి నీటి సరఫరా కూడా బంద్ అవుతుందన్నారు. శివారు కాలనీల్లో నీటి సరఫరా దారుణంగా ఉంది. 15 రోజులుగా నీటి సరఫరా కాక పోవడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులైన్‌లకు మరమ్మతులు చేసి నీటిని సరఫరా చేయడంతో గురువారం ఎస్‌పీ రక్షిత నీటి కోసం కొళాయిల వద్ద పెద్దఎత్తున ప్రజలు బారులుతీరారు.

ఇద్దరు అధికారులు బదిలీ

● మహిళా ఉద్యోగి పట్ల అసభ్య ప్రవర్తనే కారణమా?

తాళ్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహిళా ఉద్యోగితో ఫోన్లో అసభ్య సంభాషణ చేశారన్న ఆరోపణ నేపథ్యంలో ఇద్దరు అధికారులను డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. కలెక్టర్ ఆదేశానుసారం స్థానిక డిప్యూటీ ఎంపీడీవో దారా హనుమంతరావు, తాళ్లూరు పూర్వపు పంచాయతీ కార్యదర్శి ఐ.వి.రమణారెడ్డిలపై డిప్యూటేషన్‌పై బదిలీ వేటు వేస్తూ గురువారం డీపీవో ఎం.వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. తాళ్లూరు మండల పరిషత్ పరిధిలోని సచివాలయ మహిళా ఉద్యోనిని ఫోన్ ద్వారా చాటింగ్ చేస్తూ అసభ్య సంబాషణ చేస్తున్నారని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. దీనిపై గత డీపీవో వెంకటప్పనాయుడును విచారణకు ఆదేశించారు. ప్రాథమిక విచారణ చేసి నివేదిక కలెక్టర్‌కు అందించారు. ఆ నివేదిక ఆధారంగా ఇరువురు ఉద్యోగులను క్షమశిక్షణా చర్యల్లో భాగంగా డిప్యూటీ ఎంపీడీవో హనుమంతరావును పుల్లలచెరువు మండలానికి, పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డిని గిద్దలూరు మండలం నరవ గ్రామ సచివాలయంకు డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇదేం మార్పు!

(5వ పేజీ తరువాయి)

దారితీసింది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో కీలక శాఖల జిల్లా అధికారులు, అలాగే ఆయా శాఖల రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు సమన్వయంతో సాగుతున్నా సహకారశాఖలో మాత్రం ఆ పరిస్థితి లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన వారే ఆ శాఖలో పెత్తనం చెలాయిస్తూ వచ్చారు. వారికి వత్తాసుగా రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు నిలిచారు. పలు సందర్భాలలో జిల్లాకు చెందిన అధికారపార్టీ కీలక ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను వారు పట్టించుకోకపోవడం, చివరకు కలెక్టర్ సిఫార్సులను సైతం పక్కనపెట్టడం జరిగింది. ఈ క్రమంలో ఇక్కడ డీసీవోగా పనిచేసిన శ్రీనివాసరెడ్డిపై వివిధ రూపాలలో ఫిర్యాదులు ప్రభుత్వానికి చేరాయి. అదేక్రమంలో డీసీసీబీలో విచారణ సమయంలో ఆయన తీరు పట్ల అసంతృప్తిగా ఉన్న కలెక్టర్ అన్సారియా మార్చి ఆఖరులో ప్రభుత్వ పెద్దల సూచనలతో శ్రీనివాసరెడ్డిని ప్రభుత్వానికి సరెండర్ చేశారు.

ఇన్‌చార్జి డీసీవోపై స్పందన కరువు

ఆ వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. ఇక్కడి డీసీవోగా ఉన్న శ్రీనివాసరెడ్డిని సరెండర్ చేయడం, డీసీసీబీలో విచారణ, ఇతరత్రా అంశాల్లో జిల్లా యంత్రాంగం, ఇక్కడి ప్రజాప్రతినిధుల వైఖరి నచ్చక వారు అలా వ్యవహరించారన్న విమర్శలు అప్పట్లో వచ్చాయి. కాగా స్థానికంగా పాలనాపరమైన అవసరాల కోసం ఏప్రిల్ రెండో పక్షంలో ఇక్కడి పీడీసీసీ బ్యాంకులో ఓఎస్‌డీగా ఉన్న ఇందిరాదేవిని ఇన్‌చార్జి డీసీవోగా కలెక్టర్ నియమించి ఉన్నతాధికారులకు తెలియజేశారు. అది కూడా నచ్చని వారు దాదాపు మూడు నెలలకుపైగా ఆ నియామకాన్ని ధ్రువీకరించకపోవడంతో చివరకు జిల్లా సహకారశాఖ కార్యాలయ ఉద్యోగులకు జీతాలు కూడా ఇందిరాదేవి ఇవ్వలేకపోయారు. ఈ పరిస్థితులపై పలుమార్లు 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు రావడం, చివరకు జీతాల కోసం ఉద్యోగులు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసనలకు దిగడం, ఇతరత్రా పరిణామాలతో మంత్రి డాక్టర్ స్వామి జోక్యంతో ప్రభుత్వ పెద్దలు స్పందించారు. ఇక చేసేదేమీ లేక ఇందిరాదేవికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించడం ద్వారా ఉద్యోగుల జీతాల సమస్య ను పరిష్కరించారు.

అంటీముట్టనట్లు విచారణ

ఇందిరాదేవికి అదనపు బాధ్యతలు అప్పగించే సమయంలోనే ఇక్కడ రెగ్యులర్ డీసీవోని నియమించే అవకాశం ఉన్నా ఉన్నతాధికారులు అలా చేయలేదు. ప్రస్తుతం డీసీసీబీలో సెక్షన్ 51 విచారణ ప్రారంభమవుతున్న తరుణంలో మార్పు చేయడంపై సహకారశాఖ వర్గాల్లో చర్చ సాగుతోంది. తొలుత డీసీసీబీలో సెక్షన్ 51 విచారణ అంశాన్ని ఉన్నతాధికారులు పెద్ద సీరియస్‌గా తీసుకోలేదని తెలుస్తోంది. అయితే ఈ తరహాలో రాష్ట్రంలో వివిధ బ్యాంకులలో కూడా పలు ఆరోపణలు రాగా వాటిపై గత అసెంబ్లీ సమావేశాలలో చర్చ విస్తృతంగా సాగి సభాసంఘం నియామకం జరిగింది. మళ్లీ ఈ నెలలో అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. దీంతో ఇప్పటికైనా డీసీసీబీలో విచారణ చేపట్టకపోతే ప్రభుత్వ పెద్దల నుంచి ఇబ్బంది వస్తుందని భావించి సెక్షన్ 51 విచారణను ప్రాథమికంగా చేపట్టే చర్యలు తీసుకున్నారు. అందుకు విచారణాధికారిగా నియమితులైన గౌరీశంకర్ మంగళ, బుధ వారాల్లో అంటీముట్టనట్లుగా విచారణ సాగించి వెళ్లిపోయారు. కాగా ఈ తరహా విచారణల సమయంలో జిల్లా స్థాయిలో సహకారశాఖ హెడ్‌గా ఉండే డీసీవో పాత్ర కీలకం.

కీలక సమయంలో మార్పు

ఇలాంటి సమయంలో ముక్కుసూటి అధికారిణి, అందులోనూ ప్రస్తుతం బ్యాంకులో పెత్తనం చెలాయిస్తున్న, అలాగే రాష్ట్ర స్థాయిలో వారికి ఆశీస్సులు అందిస్తున్న ఉన్నతాధికారులతో సఖ్యత లేని అధికారి ఉంటే సమస్యగా ఉంటుందని సహకార శాఖలోని ఒక వర్గం ఉద్యోగులు, అధికారులు చక్రం తిప్పినట్లు ప్రచారం నడుస్తోంది. ఇందుకు ఇటు కీలక ప్రజాప్రతినిధులు, అటు ఉన్నతాధికారులపైనా ఒత్తిళ్లు తెచ్చినట్లు సమాచారం. మొత్తం మీద ప్రస్తుతం డీసీవోగా ఎఫ్ఏసీ బాధ్యతలలో ఉన్న ఇందిరాదేవిని తప్పించి రెగ్యులర్ పోస్టు అయిన డీసీసీబీలోని ఓఎస్‌డీగా పంపించి ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న డి.శ్రీలక్ష్మిని ఇక్కడ డీసీవోగా నియమించారు. ఆ మేరకు గురువారం ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి, ఈ మొత్తం వ్యవహారంలో గత వైసీపీ పాలనలో ఐదేళ్లు ఇక్కడ సహకార శాఖలోని ఒక విభాగం జిల్లా అధికారిగా పనిచేసి ఇటీవల పొరుగు జిల్లాకు బదిలీ అయిన ఒక అధికారి, అలాగే అదే ప్రభుత్వంలో ఆధిపత్య సామాజికవర్గానికి చెంది ఇటీవల పదోన్నతి పొంది పొరుగు జిల్లాకు వెళ్లిన మరొక అధికారి కీలకంగా వ్యవహరించారన్న చర్చ సాగుతోంది.




భయం.. భయంగా..




జిల్లా పరిపాలన భవన్ (కలెక్టరేట్)లో పెచ్చులు ఊడిపడుతుండటంతో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రతిరోజూ ఏదో ఒకచోట శ్లాబు పెచ్చులూడి తమపై పడుతుందోనన్న భయంతో నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ ప్రాంతంలో అనేకసార్లు మరమ్మతులు చేసినా ఏదో ఒకచోట పడుతూనే ఉంది. పైభాగం నుంచి పడిపోయిన పెచ్చులు కిందనే ఉంటుండటంతో ఆ దారిన నడిచేవారు భయంగా వెళ్లాల్సి పరిస్థితి ఏర్పడింది. వైద్యశాఖ సమీపంలోనే ఇరిగేషన్‌శాఖ కార్యాలయం కూడా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. - ఒంగోలు కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి)



ఖాజీపురంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

బడిని తరలించొద్దు

● ఖాజీపురంలో విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన

బేస్తవారపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపురం గ్రామంలో ఎస్సీ కాలనీలోని ఎంపీపీ స్కూల్‌ను మోడల్ స్కూల్‌లో కలపవద్దని విద్యార్థులు, తల్లిదండ్రులు గురువారం ధర్నా నిర్వహించారు. ఇక్కడే పాఠశాలను ఉంచి 1 నుంచి 5వ తరగతి వరకు కొనసాగించాలని కోరారు. మోడల్ స్కూల్ దూరంగా ఉందని, పిల్లల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. స్కూల్ వద్దకు వెళ్లి 'మండల పరిషత్ స్కూల్ ముద్దు, మోడల్ స్కూల్ వద్దు' అంటూ నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్, ఎంఈవోలకు వినతిపత్రాలను పంపారు.

17 ఎయిడెడ్ పాఠశాలలకు సంజాయిషీ నోటీసులు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 17 ఎయిడెడ్ పాఠశాలలకు సంజాయిషీ నోటీసులు జారీ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న వారంలోపు తమ పాఠశాలల కరస్పాండెంట్లు సంజాయిషీ ఇవ్వాలని ఆ నోటీసుల్లో ఆదేశించారు. ఈ పాఠశాలల్లో మూడు సంవత్సరాలుగా విద్యార్థుల నమోదు తిరోగమనంలో ఉంది. పాఠశాలల్లో జీరో నుంచి 40 మందిలోపు మాత్రమే విద్యార్థులు ఉండటంతో పాఠశాల విద్యాడైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ పాఠశాలల కరస్పాండెంట్లకు నోటీసులు జారీ చేశారు. ఒంగోలు యూసీఎల్ఐ, తిమ్మసముద్రం, ఉప్పుగుండూరు, అమ్మనబ్రోలు యూసీఎల్ఈ స్కూలు, ఒంగోలు, బసవన్నపాలెం, కనిగిరి, మార్కాపురం, పెద్దారవీడు, పెళ్ళూరు, ఆర్‌కే హెచ్ఎన్ కొప్పోలు, గిద్దలూరు, గిద్దలూరు పాండురంగారెడ్డి నగర్, మాచవరం, గుడిపాటిపల్లి, ఒంగోలు హెచ్‌సీఎం, కనిగిరి రవీందర్, చీమకుర్తి రాజుపాలెం ఎయిడెడ్ పాఠశాలలకు నోటీసులు ఇచ్చారు. ఈ పాఠశాలల్లో విద్యార్థుల నమోదులో పురోగతి లేనందున వీటికి గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ను ఉపసంహరించి ప్రభుత్వ గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలన్నారు. నిర్దేశిత సమయంలోపు వివరణ ఇవ్వకపోతే చర్యలకు ఉపక్రమిస్తామని డీఈవో ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించారు. ఎయిడెడ్ పాఠశాలల కరస్పాండెంట్లకు ఈ సంజాయిషీ నోటీసులు జారీ చేయాలని సంబంధిత మండల విద్యాధికారులను ఆయన ఆదేశించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● వైద్య ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించిన కమిషనర్



వైద్యశాఖ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జాయింట్ డైరెక్టర్, డీఎంహెచ్‌వో, ఇతర అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశించారు. గురువారం జిల్లావైద్య ఆరోగ్యశాఖాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో దోమకాటు వల్ల వచ్చే వ్యాధులు, నీటి కాలుష్యం వల్ల వచ్చే వ్యాధులను సకాలంలో నియంత్రించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధులు సంక్రమించిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో గృహ సందర్శనలు చేసి జ్వరంతో బాధపడుతున్నవారిని గుర్తించి వారికి వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.




అట్టహాసంగా కళాఉత్సవ్ పోటీలు ప్రారంభం

సంతనూతలపాడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైనంపాడు డైట్ కళాశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాఉత్సవ్-2025 పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తొలుత కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఏ.కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఒంగోలు, పర్చూరు డివిజన్‌ల నుంచి 39 ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల నుంచి 311 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇంతమంది విద్యార్థులు పాల్గొని పోటీల్లో పాలుపంచుకోవడంతో డైట్ కళాశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమానికి డైట్ ప్రిన్సిపాల్ సోమా సుబ్బారావు అధ్యక్షత వహించారు. డీఈవో కిరణ్‌కుమార్ మాట్లాడారు. శుక్రవారం కందుకూరు, మార్కాపురం డివిజన్‌లకు కళాఉత్సవ్ పోటీలు జరుగుతాయని, ఉత్సవ్ నిబంధనలకు అనుగుణంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ఈ పోటీలకు తీసుకురావాలని సూచించారు.

కారును రివర్స్ చేస్తుండగా వాగులోకి..

● మాజీ ఎంపీపీ సోదరుడు మృతి

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కారును రివర్స్ చేస్తుండగా అదుపుతప్పి వాగులోకి వెళ్లడంతో మాజీ ఎంపీపీ సోదరుడు అయిన చింతలపాలెం గ్రామానికి చెందిన బెల్లం చెంచురామానాయుడు (50) మృతి చెందారు. ఈ ఘటన ఆయన స్వగ్రామానికి సమీపంలో చోటుచేసుకుంది. చెంచురామానాయుడు వ్యవసాయం, వ్యాపారాలు చేస్తుంటారు. ఆయన బుధవారం తాను వ్యాపారం చేసే దుకాణం వద్దకు వెళ్లారు. ఇంటికి వచ్చేందుకు కారును రివర్స్ చేస్తుండగా అదుపుతప్పి వాగులోకి వెళ్లింది. దీంతో రామానాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. జరుగుమల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా చెంచురామానాయుడు జరుగుమల్లి మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణకు సోదరుడు. విషయం తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు గురువారం గ్రామానికి చేరుకుని చెంచురామానాయుడు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసిన జేసీ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ ఎదురుగా ఉన్న అన్న క్యాంటిన్‌ను జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్న క్యాంటిన్‌లోని భోజనాలను తనిఖీ చేయడమే కాకుండా అక్కడ కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. పేదవారు భోజనంచేసే అన్న క్యాంటీన్ పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ప్రజలతో మాట్లాడారు. భోజనం ఎలా ఉంది? మీరు ఏమి చేస్తారు? తదితర అంశాలపై జేసీ ఆరా తీశారు. పారిశుధ్యం, ప్లేట్లలను వేడినీళ్లతో శుభ్రం చేయడం, ఆహారం నాణ్యతుండేలా చూసుకోవడంతో పాటు ఎటువంటి ఫిర్యాదులకు అవకాశం లేకుండా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు సంబంధించి అన్న క్యాంటీన్ పక్కన ఉన్న ప్రదేశాన్ని జేసీ పరిశీలించారు. జేసీ వెంట ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, కమిషనర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మధుసూదనరావు తదితరులు ఉన్నారు.



మార్కాపురం సర్వజన ఆసుపత్రిలో నిలిచి ఉన్న మురుగు నీరు

కంపుకొడుతున్న పెద్దాసుపత్రి

పశ్చిమ ప్రకాశంలోని సర్వజన వైద్యశాల (పెద్దాసుపత్రి) పారిశుధ్యం లోపించి అధ్వానంగా మారింది. ఈ ఆసుపత్రికి మార్కాపురం వాసులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి రోజూ అనారోగ్య సమస్యలతో వస్తుంటారు. ఇంత రద్దీగా ఉండే ఆసుపత్రిలో పారిశుధ్యం క్షీణించింది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, మురుగుతో కంపుకొడుతోంది. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయని ఊరూరా చెప్తున్న వైద్యాధికారులు పెద్దాసుపత్రిలో తీవ్రమైన కంపు కొడుతున్నా, పారిశుధ్యం అధ్వానంగా ఉన్నా పట్టించుకోకపోవడం గమనార్హం.

- మార్కాపురం రూరల్, (ఆంధ్రజ్యోతి)

'ముప్పాళ్ల' కేసు కొట్టివేత

● నాలుగున్నరేళ్లుగా కోర్టులో కొనసాగిన వ్యాజ్యం

● పిటిషనర్ వాదనలలో పసలేదని తోసిపుచ్చిన కోర్టు

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గత పంచాయతీ ఎన్నికలు జరిగి ఆ పాలక వర్గాల గడువు ముగిసే సమయం వస్తున్న తరుణంలో ఎం.ముప్పాళ్ల సర్పంచ్ ఎన్నికలు సక్రమంగా జరగలేదని నాలుగున్నరేళ్లుగా జిల్లా కోర్టులో దాఖలైన వ్యాజ్యంలో సుదీర్ఘ వాదనల అనంతరం జిల్లా న్యాయమూర్తి ఎ.భారతి ఆ కేసును డిస్మిస్ చేస్తు గురువారం తీర్పునిచ్చారు. 2021 ఫిబ్రవరి 9న జరిగిన ఎం.ముప్పాళ్ల సర్పంచ్ ఎన్నికల్లో వైకుంఠ పద్మశ్రీ రెండు ఓట్లతో విజయం సాధించినట్లు అప్పటి ఎన్నికల అధికారి ప్రకటించారు. ఆ ఎన్నిక సక్రమంగా జరగలేదని ప్రత్యర్థి వర్గం జిల్లా కోర్టును ఆశ్రయించింది. గత నాలుగున్నరేళ్లుగా సదరు వ్యాజ్యం కొనసాగుతున్న క్రమంలో గురువారం ఒంగోలు పీడీఎం కోర్టులో పిటిషనర్ తరపున నాగేంద్రమ్మ, సర్పంచ్ పద్మశ్రీ తరఫున హైకోర్టు సీనియర్ కౌన్సిల్ న్యాయవాది పద్మనాభం, జిల్లా కోర్టు అడ్వకేట్ పంగులూరి గోవిందయ్య తమ వాదనలను వినిపించారు. దాంతో పిటిషనర్ వాదనలో ఎలాంటి పసలేదని కేసును కొట్టివేస్తూ జిల్లా న్యాయాధికారి ఎం.భారతి తీర్పునిచ్చారు. ఆ తీర్పు నేపథ్యంలో ఎం.ముప్పాళ్లలో సర్పంచ్ వైకుంఠ పద్మశ్రీ వర్గీయులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకొన్నారు.



వినాయక భక్తులకు అన్నదానం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజపానగల్ రోడ్‌లో గల టీం గణేశా వినాయక విగ్రహం వద్ద బుధవారం విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, ఒంగోలు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ షేక్ రియాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు, మాజి మునిసిపల్ ఛైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, సింగరాజు రాంబబు, తూము సుబ్బారావు, తూము రాజేష్, కుర్రా ప్రసాద్, పలువురు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.



లాభాల పూబంతి

తక్కువ పెట్టుబడితో మేలైన దిగుబడి

త్రిపురాంతకం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం పంటల సాగులో రైతులు ఎప్పటికప్పుడు నూతన సాగుకు ఆసక్తి చూపుతున్నారు. కొందరు రైతులు అతి తక్కువ పెట్టుబడితో పూల మొక్కలను పెంచి రాబడిని సాధించటంపై దృష్టి సారించారు. అటువంటి వారిలో త్రిపురాంతకం మండలం మేడపి, టి.చర్లోపల్లి గ్రామాల రైతులు బంతి తోటలను పెంచుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. బంతి పూల మొక్కల పెంపకం ద్వారా ఖర్చు అంతగా ఉండదని చెప్తున్నారు. ఎకరా బంతి పూల సాగు చేయాలంటే దాదాపు 6వేల మొక్కలను నారు రూపంలో కొనుగోలు చేశారు. ఒక్కో మొక్క ఖరీదు దాదాపు 5 నుంచి 6 రూపాయల చొప్పున దొరుకుతుంది. అంటే ఎకరా మొక్కలు నాటుకునేందుకు అయ్యే ఖర్చు రూ.30 నుంచి రూ.36వేలు అవుతుంది. పొలం సిద్ధం చేసుకునేందుకు, నీటి తడులు ఇతర ఖర్చులు కలిపి మరో రూ.20వేలు అంటే ఎకరాకు రూ.50వేలు లేదా రూ.60వేలకు మించి ఖర్చు కాదని అంటున్నారు. దిగుబడి విషయానికి వస్తే ఎకరాకు బంతిపూలు 50 నుంచి 60 క్వింటాళ్ల వరకు వస్తాయి. పండుగలు, శుభకార్యాల సమయంలో ధర ఎక్కువగా ఉంటే ఈ ఏడాది కిలో రూ.100 అమ్మామని, కానీ ఇప్పుడు కేవలం రూ.20 నుంచి రూ.30కి అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఆశించిన మేర పూల దిగుబడి వచ్చి ఎకరాకు కనీసం 50 క్వింటాళ్లు పండినా ఇప్పుడు ఉన్న మార్కెట్ ప్రకారం సరాసరి కిలో రూ.30కి అమ్మినా లక్షా 50వేల రూపాయల వరకు వస్తాయి. అందులో ఖర్చు రూ.60వేలు తీసేసినా దాదాపు రూ.90వేల వరకు ఆదాయం వస్తుందని అంచనా. ఇంకా తక్కువ ధరకు అమ్మినప్పటికీ బంతిపూల వల్ల నష్టం మాత్రం వచ్చే అవకాశం చాలా తక్కువ అని చెప్తున్నారు. పూలు కాయకపోతే నష్టపోవాల్సిందే కానీ నీటి తడులు అందిస్తూ పూలను కాసేలా జాగ్రత్తలు తీసుకుంటే బంతి లాభాల పూదోట అని ఇక్కడి రైతులు అంటున్నారు.



ప్రత్యేక వాహనంలో తరలిస్తున్న ఈవేస్ట్

రీసైక్లింగ్‌కు ఈవ్యర్థాల తరలింపు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్తకూరగాయల మార్కెట్ ఎదురుగల కార్పొరేషన్ ఈ వేస్ట్ సెంటర్‌లో నిల్వ ఉంచిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను రీసైక్లింగ్‌కి తరలించినట్లు కమిషనరు కే. వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఈ వేస్ట్ సెంటర్‌ను సందర్శించిన కమిషనరు ఏప్రిల్ 18వ తేదీన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, సీడీలు, మానిటర్లు, ప్రింటర్స్ కీ బోర్డులు, మౌస్‌లు, మొబైల్ ఫోన్‌లు, చార్జర్‌లను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ వారి ఆదేశాల మేరకు రీ సైక్లింగ్ కోసం రెల్డన్ రీఫైనింగ్ ప్రయివేటు లిమిటెడ్‌కు ప్రత్యేక ఆహ్వానం పంపినట్లు తెలిపారు. నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్‌లను విద్యాసంస్థలు, కంప్యూటర్ సెంటర్‌లు, ఇంజనీరింగ్ కాలేజీలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల వారు మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన ట్రిపుల్‌ఆర్ సెంటర్‌కు తరలించాలని సూచించారు. ఇందుకు సంబంధించిన సమాచారం తెలియజేయడానికి శానిటరీ సూపర్ వైజర్లు షేక్ బాబ్జి, ఎన్. పిచ్చయ్యలకు తెలియజేయాలన్నారు.



సీపీఎం పతాకాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలు

కొండపి, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికులు హక్కుల కోసం సమరశీల ఉద్యమాలు చేపట్టాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘ మండల మహాసభ గురువారం పెరిదేపిలోని ముప్పరాజు శేషయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పోరాటాల ఫలితంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రక్షణ చట్టాలు చేశాయన్నారు. మహాసభకు ముందు సీనియర్ నాయకుడు గడ్డం పిచ్చయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు నెరసుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు కేజీ మస్తాన్, మండల కార్యదర్శి పారాబత్తిన శ్రీనివాసరావు, నాయకులు లక్కెపోగు సుధాకర్, ఎల్.దావీదు, సూరిబాబు, అంగలకుర్తి బ్రహ్మయ్య, మల్లెల సంపూర్ణ పాల్గొన్నారు.



అంతర్జాతీయ విశ్వకర్మ మహాసభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

17న అమరావతిలో విశ్వకర్మ మహాసభ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో ఈనెల 17వతేదీన జరగనున్న అంతర్జాతీయ విశ్వకర్మ మహాసభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసులుకోరారు. స్థానిక కార్యాలయంలో గురువారం మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తానికొండ సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంకల్పంతో ఈమహాసభల్లో భాగంగా విశ్వకర్మ వారి చరిత్రప్రదర్శన, ఉత్పత్తుల ప్రదర్శన, చరిత్రకారుల స్మరణ, విశ్వకర్మ సభ,శోభాయాత్ర వంటి విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, పీవీ కృష్ణారెడ్డి, దండు శ్రీనివాసరావు, అమర్‌సింహ, కాటా రాధాకృష్ణ, జిల్లెళ్ళమూడి రమాదేవి, సాయి, కేసతీష్, తిరుమల సుధాకర్, చలపతిరావు తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలో ప్రభుత్వమెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసే విధానాలను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శిశాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో గురువారం జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే పేదలకు వైద్య సేవలు అందే పరిస్థితి లేదన్నారు. అందువల్ల ఈ విధానాలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, పార్టీ నాయకులు కేవీ రమణారెడ్డి, వై. వెంకటేశ్వరరావు, పోసం మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రకాశం పంతులు మ్యూజియం ఏర్పాటు చేయిస్తా

ఉప్పుసత్యాగ్రహ విజయస్థూప ప్రాంతాన్ని టూరిజం కేంద్రంగా మారుస్తా

అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరణలో ఎంఎల్‌ఏ దామచర్ల

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): ఉప్పసత్యాగ్రహ విజయస్థూపం దగ్గర ప్రకాశంపంతులు మ్యూజియం ఏర్పాటు చేయిస్తా.., టూరిజం కేంద్రంగా ఉప్పసత్యాగ్రహ ప్రాంతాన్ని అభివృద్ధి చేయిస్తానని స్థానిక ఎంఎల్‌ఏ దామచర్ల జనార్దనరావు అన్నారు. ఒంగోలు మండలం దేవరంపాడు ఉప్పసత్యాగ్రహ విజయస్థూపం వద్ద వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఎంఎల్‌ఏ దామచర్ల జనార్దనరావు గురువారం సాయంత్రం శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ఉప్పసత్యాగ్రహ విజయస్థూప ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. రూ. 75 లక్షలతో దేవరంపాడు గ్రామంనుంచి శిబిరం వరకు మెటల్ రోడ్డు , రూ.10లక్షలతో పల్లెవనం పథకం కింద ఉద్యానవనం (పార్క్) అభివృద్ధి పరుస్తామన్నారు. విజయస్థూపం వద్ద నుంచి గుండ్లకమ్మనదిలో గుండాయపాలెం వరకు బోట్‌పై యాత్రకు ఏర్పాటు చేయిస్తానహామీ ఇచ్చారు. అలాగే విజయస్థూపం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తానన్నారు. జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. విజయస్థూపం ప్రాంగణం చుట్టూ ఫెన్సింగ్‌కు రూ.10 లక్షల నిధులు ఏర్పాటు చేయిస్తానన్నారు. ఈకార్యక్రమానికి గ్రామసర్పంచ్ నన్నపనేని వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా ఇన్‌చార్జి డీపీవో ఎం.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ జోస్ఎకుమార్, ఎంపీడీవో కె .రాజశేఖరరావు, డిప్యూటీ ఎంపీడీవో ఎ.బాలచెన్నయ్య, తహసీల్దార్ నాయబ్ రసూల్, పీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, జనసేన నాయకులు రియాజ్, టీడీపీ నాయకులు శ్రీనివాసరావు, పోలవరపు వెంకట్రామయ్య, వై.నరసింహారావు, ఆర్. వెంకటక్రావు, ముప్పవరపు శ్రీనివాసరావు, చుంచు రామాంజనేయులు, చుంచు శింగయ్య, నన్నపనేని వెంటరావు, చప్పిడి శేషయ్య గ్రామస్థులు పాల్గొన్నారు.





అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, జేసీ గోపాలకృష్ణ, ఇతర ప్రజాప్రతినిధులు (ఇన్‌సెట్లో) సభలో మాట్లాడుతున్న జనార్దన్

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధులను నివారించుకోవాలని జిల్లాపంచాయతీ అధికారి ఎం .వెంకటేశ్వరరావు అన్నారు. ఒంగోలు మండలం యరజర్ల గ్రామంలో గురువారం ఉదయం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ సైడు కాలువలలో చెత్తాచెదారం వేయరాదని తెలిపారు. చేతిపంపులు దగ్గర నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె .రాజశేఖరరావు, డిప్యూటీ ఎంపీడీవో ఎ.బాలచెన్నయ్య, ఎంపటీసీ జి.శ్రీనివాసులు, గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు. అనంతరం పరిశుభ్రతపై గ్రామస్థులకు కరపత్రాలను పంపిణీ చేశారు.



పారిశుధ్యంపై కరప్రతాలను పంపిణీ చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు

పంచాయతీల అభివృద్ధికి కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలి

గ్రామపంచాయతీల అభివృద్ధికి కార్యదర్శులు బాధ్యత తీసుకొని పనిచేయాలని డిప్యూటీ ఎంపీడీవో మాకినేని మురళి అన్నారు. ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉమ్మడి ప్రకాశంజిల్లా పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీలకు సొంతనిధులు సమకూర్చటంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మురళి మాట్లాడుతూ గ్రామాలలో గ్రామపంచాయతీలకు పన్నులువిధించే అధికారం ఉన్నదనితెలిపారు. అయితే ప్రజలకు భారంగా ఉండేపన్నులు వేయకూడదన్నారు. వసూలు చేసిన పన్నులు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. వసూలు చేసిన పన్నులను గ్రామ అభివృద్ధికి ఉపయోగించాలన్నారు. ఈకార్యక్రమంలో మరో డిప్యూటీ ఎంపీడీవో కె.వేణుగోపాల్ రెడ్డి, 56 మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు అమలు చేయాలి

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కార్మికులకు సంక్షేమ బోర్డు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు నలతోటి రామారావు, అమర్ డిమాండ్ చేశారు.కార్మికులకు సంక్షేమ బోర్డు అమలు చేయాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15 న విజయవాడలోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమ వాల్ పోస్టర్లను ఉప్పుగుండూరులో సీఐటీయూ నాయకులు గురువారం ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు.



కమిషనర్ కార్యాలయ ముట్టడి వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు



డిగ్రీ ఫలితాల్లో శ్రీ హర్షిణీ విద్యార్థుల విజయకేతనం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలో జరిగిన డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక శ్రీ హర్షిణీడిగ్రీ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. బీఎస్సీ(లెక్కలు)విభాగంలో మూలే మందిరారెడ్డి10కి 9.13పర్సంటైల్‌తో కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచారు. కావలి స్నేహిత, ధర్నాసి అఖిలలు ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు. బీసీఏ విభాగంలో జే సమీనా 9.07, టి. లక్ష్మీ 8.99, ఎస్ శ్రీలక్ష్మీ 8.84 పర్సంటైల్‌తో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానంలో, బీకాంవిభాగంలో దేవరంపాటి దివ్య 8.99, దాసరి వైష్ణవి 8.71, తూము కృష్ణకాంతి 8.64 పర్సంటైల్‌తో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు. బీఎస్సీ(కంప్యూటర్) విభాగంలో శ్రీమంతుల లక్ష్మీవర్షిత 8.98, జి.పవన్‌కుమార్ 8.96, డి. ఉదయ్ కౌశిక్ 8.83, బిఎస్సీ(జువాలజి) విభాగంలో పులిచెర్ల శ్రీలక్ష్మి 8.81, వేల్పుల విశాలక్షి 8.77, షేక్ తాసీన్ ఫాతిమా 8.64, బీఎస్సీ(కెమిస్ట్రీ) విభాగంలో గుడిసెల లేఖన 8.73, నిత్య 8.20, ఆంధ్ర వెంకట జ్యోతి7.97/10తో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు. బీఎస్సీ (బాట్ని) విభాగంలో ఎం.కృప 8.41, ఆర్. లక్ష్మీగంగోత్రి 8.17, సింగంశెట్టి నందిని 7.94, బీఎస్సీ(ఆక్వా కల్చర్) విభాగంలో కోడూరి లావణ్య 8.45, నక్క నాగమణి 8.40, కే చరితశ్రీ 8.18, బీఏ విభాగంలో బి.అబిషేక్ 8.56, టి. చంద్రశేఖర్ 8.47, కే ఇందు 8.43, బీబీఏ విభాగంలో ఎర్రగుంట్ల స్పందన 7.85, శ్రీకాంత్, నాగజాహ్నవి 7.66, కొండవీటి వెంకటలక్ష్మి 7.39/10ప్రథమ, ద్వితీయ. తృతీయ స్థానంలో నిలిచారు. బీఎస్సీ (ఫిజిక్స్) విభాగంలో ఆర్. సుష్మ 7.25/10 సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్ అభినందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ప్రారంభించిన నాటి నుంచి డిగ్రీతో పాటు విద్యార్థులకు ప్రాంగణ ఎంపికకు కావాల్సిన కోచింగ్‌ను కూడా ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది నుంచి ఇంజనీరింగ్, ఎంసీఏ, ఎంబీఏ మహిళాక్యాంపస్‌ను కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరి అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, కళాశాల ప్రిన్సిపాల్ దాది ఆంజనేయులు, క్యాంపస్ ఇన్‌చార్జీలు స్వర్ణప్రతాప్, నాదెండ్ల గిరీష్, శంకర్ తదితరులు ఉన్నారు.

మడనూరు ఆరోగ్య ఉపకేంద్రం పరిశీలన

ప్రజలకు అందుతున్న సేవలపై ప్రపంచ బ్యాంకు బృందం ఆరా

కొత్తపట్నం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడనూరు ఆరోగ్య ఉపకేంద్రాన్ని గురువారం ప్రపంచ బ్యాంకు బృందం పరిశీలించింది. ప్రధానంగా ఆయుష్మాన్ భారత్ కింద హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ కేంద్రంగా ఎలాంటి సేవలు ప్రజలకు అందుతున్నాయనే దిశగా ఈ బృందం పరిశీలన చేసింది. కేంద్రం పరిధిలోని ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయా, ఇంకా ఏమైనా సేవలు అవసరమా అనే దిశగా పరిశీలన చేశారు. ఈ బృందానికి డాక్టర్ వర్ష నాయకత్వం వహించగా మరో ఇద్దరు ఈ బృందంలో ఉన్నారు. ఆ యుష్మాన్ భారత్ కేంద్రం నిర్వహణ రికార్డులను వారు ఈ సందర్భంగా పరిశీలించారు. రోగులకు ఉన్న రోగాలకు సంబంధించిన వి వరాలు, అసంక్రమిత వ్యాధులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది తగిన అవగాహన ఉందా లేదా అనే దిశగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీరికి కేంద్రంలో అందుతున్న సేవల గురించి ఈతముక్కల ప్రాథమిక ఆ రోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవ్య, డాక్టర్ సాయి శ్రీనాథ్,మెడికల్ ఆఫీసర్ హకీం తదితరులు ఉన్నారు.

ఫ్లెక్స్ ప్రింటర్స్‌కు పోలీసుల హెచ్చరిక

● విద్వేషపూరిత వ్యాఖ్యలు ముద్రిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీలు, ప్లకార్డుల రూపంలో విద్వేశపూరిత వ్యాఖ్యలు ముద్రిస్తే ఫ్లెక్సీ ప్రింటర్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్.దామోదర్ హెచ్చరించారు. ఇటీవల జిల్లాలో ఫ్లెక్సీపోస్టర్స్‌పై ముద్రించిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారి వర్గ విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని అన్నారు. ఫ్లెక్సీలు ముంద్రించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఇతరుల గౌరవాన్ని కించ పరిచే విధంగా ఫ్లెక్సీలు ఉంటే అందుకు సంబంధించిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. విచక్షణ లేకుండా ఫ్లెక్సీలు ముద్రిస్తే ప్రింటర్స్ దుకాణాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలుతప్పవని ఎస్పీ హెచ్చరించారు.

మంత్రి లోకేష్ కృషి అభినందనీయం

సంతనూతలపాడు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నేపాల్ దేశంలో జరుగుతున్న అల్లర్లలో చిక్కుకున్న తెలుగువారిని క్షేమంగా రాష్ట్రానికి రప్పించడానికి మంత్రి లోకేష్ చేసిన కృషి అభినందనీయమని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ గురువారం ఓప్రకటనలో తెలిపారు. అనంతపురం పర్యటనను రద్దుచేసుకుని సచివాలయానికి చేరుకుని భద్రతా చర్యలను వేగవంతం చేసి 215 మంది తెలుగువారిని రాష్ట్రానికి క్షేమంగా తీసుకురావడంలో మంత్రి నారాలోకేష్ అభినందనీయుడన్నారు. ప్రపంచంలో ఎక్కడైనా తెలుగువారు ఆపదలో ఉంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటారని తెలిపారు.

30న దళిత కవులు, రచయితల సాహిత్య మహోత్సవం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలుగు దళిత ప్రజల సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో ఏపీ దళిత రచయితలు, కవులు, సాంస్కృతిక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు ఎల్లుట్ల వరుణ్ తేజ్ తెలిపారు. బుధవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ మాట్లాడుతూ దళిత సాహిత్యాన్ని ప్రపంచ నలుమూలలకు చాటి చెప్పిన కవులను సన్మానిస్తామని తెలిపారు.

21నుంచి దసరా సెలవులు ప్రకటించాలి

ఒంగోలు విద్య, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలకు ఈనెల 21నుంచి దసరా సెలవులు ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి. శేషిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 21న మహాలయ అమవాస్య, 22నుంచి దేవీనవరాత్రులు ప్రారంభమవుతున్నాయన్నారు. గతంలో ఎప్పటి నుంచో పాఠశాలలకు దసరా సెలవులను మహాలయ అమవాస్య నుంచి ప్రకటించడం ఆనవాయితీగా ఉందన్నారు. ఆ ఆనవాయితీని కొనసాగిస్తూ ఈనెల 21నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని ఆయన కోరారు.

21న అర్హత పరీక్ష

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం నిర్వహిస్తున్న ఎంబీఏ, ఎంసీఏ అర్హత పరీక్ష ఈనెల 21న స్థానిక గీతం డిగ్రీకాలేజీలో జరుగుతుందని కరస్పాండెంట్ నరసింహారావు తెలిపారు. ఈ పరీక్ష మధ్యాహ్నం 2నుంచి 4 గంటల వరకు జరుగుతుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

బాలికల భవిత కోసం కిశోర వికాసం

పొన్నలూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాలికల భవితకు కిశోర వికాసం దోహదంచేస్తుందని సీడీపీవో సుశీలాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కిశోర వికాసం కింద విద్య, నైపుణ్యం, ఎదుగుదల, పోటీతత్వం, వ్యక్తిగత పరిశుభ్రత వంటి 12 అంశాలపై బాలికలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. బాలల రక్షణ అధికారి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ విక్టోరియా,ఎంఎల్ఎచ్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైం సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యుడు కొత్తపల్లి ప్రదీప్, ఎస్సై మహేంద్ర

సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

సింగరాయకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యుడు కొత్తపల్లి ప్రదీప్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, అంబేడ్కర్ గురుకుల పాఠశాల, మలినేని ఇంజనీరింగ్ కళాశాలల్లో గురువారం సైబర్ నేరాలపై ఎస్సై బి.మహేంద్రతో కలిసి ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ ప్రజల బలహీనతలను ఆసరా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారని తెలిపారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి ఓటీపీ నంబర్ తెలుసుకుని ఖాతాలోని నగదును ఖాళీ చేస్తున్నారన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షల్లో నగదు ఆఫర్ చేసి మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉన్నప్పుడే నిరోధించడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఎస్సై బి.మహేంద్ర మాట్లాడుతూ సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

సంతనూతలపాడు : సంతనూతలపాడు జడ్పీహైస్కూల్లో విద్యార్థులకు గురువారం సినార్డ్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, మత్తుపదార్థాలపై అవగాహన కల్పించారు. సినార్డ్ సంస్థ ప్రతినిధులు ప్రసన్న, శేఖర్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ ఎలా వ్యాపిస్తోందో, దానిపై ఉన్న అపోహల గురించి విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రమోద, ఉపాధ్యాయులు, సినార్డ్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ సిబ్బంది, సచివాలయ సెక్రటరీలతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

కొళాయిలన్నీ పన్ను పరిధిలోకి తీసుకురావాలి : కమిషనర్

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలోని తాగునీటి కొళాయిలన్నీ పన్ను పరిధిలోకి తీసుకురావాలని నగర కమిషనరు కే. వెంకటేశ్వరరావు ఇంజనీరింగ్ సిబ్బంది. సచివాలయ ఎమినిటీ సెక్రటరీలను ఆదేశించారు. గురువారం వారితో కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశం అయిన కమిషనరు మాట్లాడుతూ నగరంలో అనధికార కొళాయిలను గుర్తించి పన్ను విధించాలని తెలిపారు. అలాగే నగరపాలక సంస్థలో విలీనం అయిన గ్రామాలలో అనధికార కొళాయిలు అధికంగా ఉన్నాయని, వాటిని అన్నింటిని రెగ్యులైజ్ చేసి, పన్ను పరిధిలోకి తీసుకురావాలని తెలిపారు. దాంతోపాటుగా నగరంలోని మీటర్ పరిధిలో ఉన్న కొళాయిలు. నాన్ మీటర్ పరిధిలో ఉన్న కొళాయిలు బకాయిలు వెంటనే వసూలు చేయాలని తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలన్నారు. అలాగే ఆస్తి పన్ను వసూళ్ళలో ఒంగోలు కార్పొరేషన్ వెనుబడి ఉందని, పెండింగ్ లేకుండా పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంఈ ఐసయ్య, అసిస్టెంట్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, పలువురు ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.330

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): ఒంగోలు పొగాకు వేలం కేంద్రం రెండులో గురువారం జరిగిన వేలంలో పొగాకు కిలో గరిష్ఠ ధర 330రూపాయలకు వ్యాపారసంస్థల ప్రతినిధులు కొనుగోలు చేశారు. కనిష్ఠ ధర కిలో పొగాకు 110 రూపాయలకు వ్యాపారసంస్థల ప్రతినిధులు కొనుగోలు చేశారు. మంచి నాణ్యమైన పొగాకు రోజురోజుకు ఎగబాగటంతో రైతులు మంచి పొగాకును ముందుగా అమ్ముకోవటంతో నష్టపోయామని రైతులు వాపోతున్నారు. మొత్తం 1,085 బేళ్లు బోర్డుకు అమ్మకాని రాగా 714 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 276 బేళ్లు నోబిడ్ అయ్యాయి.

మహిళ మెడలో బంగారం గొలుసు లాక్కెళ్లిన దుండగులు

● స్కూటీపై ఇరువురు పరారీ

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారం గొలుసు లాక్కెళ్లారు గుర్తుతెలియిన దుండగులు. ఈ ఘటన గురువారం రాత్రి స్థానిక నిర్మల్‌నగర్ రెండో లైన్‌లో జరిగింది. నిర్మల్‌నగర్‌లో నివాసం ఉండే దేవరపల్లి విజయదుర్గ పంచముఖ ఆంజనేయస్వామి గుడికి వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా వెనుక నుంచి స్కూటీ పై ఇరువురు దుండగులు వచ్చి విజయదుర్గ మెడలో ఉన్న 3 సవర్ల బంగారం గొలుసును లాగారు. అయితే అమె అప్రమత్తం అయి గొలుసును గట్టిగా పట్టుకోవడంతో కొంత భాగం బంగారం గొలుసును లాక్కొని గుర్తు తెలియని దుండగులు స్కూటీ పై పరారీ అయ్యారు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఒంగోలు తాలుకా సీఐ విజయకృష్ణ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిసరాలలో సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించారు.

ఎక్సైజ్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఏసీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ

సింగరాయకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణను త్వరితగతిన పూర్తిచేయాలని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ సూచించారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. లోక్ అదాలత్ కేసులను పరిష్కరించాలని ఎక్సైజ్ సీఐ మేడికొండ శివకుమారిని ఆదేశించారు.

14 న జూనియర్ బాల, బాలికల కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని డాక్టర్ ఆనంద్ స్టేడియంలో ఈనెల 14న మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లా జూనియర్ కబడ్డీ బాలబాలికల టీమ్‌ల ఎంపిక జరుగుతాయని జిల్లాకబడ్డీ అసోషియోషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి1 తేదీ 2006 తరువాత జన్మించి ఉన్న బాలురు 75 కిలోల లోపు బరువు, బాలికలు 65 కిలోల లోపు బరువు ఉండాలన్నారు.



22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

కంభం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 3 వరకు అమ్మవారు వివిధ రూపాలలో భక్తులకు ద ర్శనమిస్తారని ఆలయ కమిటీ వారు గురువారం ప్రకటనలో తెలిపారు. 22 సోమవా రం కోటా సత్యమాంబ దేవీ అలంకరణలో, 23న అంబా భవానిగా, 24న భువనేశ్వరిగా, 25న గజ లక్ష్మీగా, 26న రాజరాజేశ్వరిగా, 27న మీనాక్షిగా, 28న బాలాత్రిపుర సుందరిగా, 29న సరస్వతిగా, 30న మహిషాసురమర్దినిగా, అక్టోబర్ 1న బాలహృదయేశ్వరిగా, 2న మోహినిగా, 3న అన్నపూర్ణ దేవి అలంకరణలో అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ప్రతిరోజు అన్నదానం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమా లు ఉంటాయని తెలిపారు.


ఎంపీడీవో కార్యాలయంలో వాన కష్టాలు

- చినుకు పడితే కూర్చునే పరిస్థితి లేదు
- ఊడిపోయిన కప్పులు, తిరగని ఫ్యాన్‌లు
- రికార్డులు, కంప్యూటర్లు కాపాడేందుకు అవస్థలు

ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి వాన కష్టాలు తప్పడం లేదు. ఎక్కడ కూర్చోవాలి, ఎలా విధులు చేపట్టాలి, ఫైల్స్‌ను ఎలా కాపాడుకోవాలో తెలియక తలలుపట్టుకుంటున్నారు. ఎప్పుడో బ్రిటీష్ కాలంలో కట్టిన భవనం కావడంతో పైన ఉన్న కప్పులు పగిలిపోయాయి. దీంతో ఫ్లేవుడ్‌తో మరమ్మతులు చేశారు అప్పటి అధికారులు. ప్రస్తుతం అవి పగిలిపోయి, ఊడిపోతున్నాయి. ఈ క్రమంలో చిన్న పాటి వర్షం కురిస్తే కారిపోతుంది. దీంతో ఇటు సిబ్బంది, పనులు నిమిత్తం వచ్చే ప్రజలు కార్యాలయంలో కూర్చునే పరిస్థితి లేదు. అదే రూంలో కంప్యూటర్, రికార్డులు ఉన్నాయి. వర్షం పడిన ప్రతిసారీ ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఒక వేళ విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగితే పెను ప్రమాదం తప్పదని ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో వాన నీటితో ఉన్న గది



తిరగని ఫ్యాన్

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని సన్మానించిన సొసైటీ బ్యాంక్ ఛైర్మన్లు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట మండలంలోని బేస్తవారపేట, గలిజేరుగుళ్ల సొసైటీ బ్యాంక్ ఛైర్మన్లుగా నియమితులైన వెంకటరమణారెడ్డి, నరసింహయాదవ్ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో బేస్తవారపేట సొసైటీ బ్యాంక్ ఛైర్మన్‌గా నియమితులైన పూసలపాడుకు చెందిన దుంపా వెంకట రమణారెడ్డి, గలిజేరుగుళ్ల సొసైటీ బ్యాంక్ ఛైర్మన్‌గా నియమితులైన మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గుంటక నరసింహయాదవ్‌లు నియమితులయ్యారు. వారు అనుచరులతో కలిసి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపి పూలమాలలు, శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, దూదేకుల సైదులు ఉన్నారు.



ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న సొసైటీ బ్యాంక్ ఛైర్మన్

జనసేన పార్టీ కార్యకర్తకు ఆర్థిక సాయం

బేస్తవారపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ కార్యకర్త పప్పుల చిన్నచెన్నయ్యకు పార్టీ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని పిటికాయగుళ్ల గ్రామ పంచాయతీ వంగపాడు గ్రామానికి చెందిన చిన్న చెన్నయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న రాచర్ల జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పుట్టా బాలకృష్ణ, పారపల్లి శ్రీనివాసులు, రమేష్, బేస్తవారపేట మండల నాయకుడు చందు పరామర్శించి, రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు.



అమరవీరులకు నివాళులరిస్తున్న అటవీశాఖాధికారులు

అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

టైగర్ ప్రాజెక్టు డీడీ సందీప్ కృపాకర్

మార్కాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని టైగర్ ప్రాజెక్టు, మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కృపాకర్ అన్నారు. డివిజనల్ అటవీశాఖ కార్యాలయంలో గురువారం జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా అమరవీరుల స్థూపం వద్ద సందీప్ కృపాకర్ సహచర అధికారులు, సిబ్బందితో కలిసి అమరులైన అటవీ సిబ్బందికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సందీప్ కృపాకర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంత పనిచేసి స్మగ్లర్ల చేతిలో అటవీ సిబ్బంది అమరులయ్యారన్నారు. అమరవీరుల సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సమస్యలున్నప్పుడు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒంటరిగా కాకుండా గ్రూప్‌గా వెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. ప్రణాళికతో వ్యవహరించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. తొందరపాటు చర్యలతో ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో ఎస్.పిచ్చిరెడ్డి, డీఆర్‌వోలు జి.నాగరాజు, ఎం.ప్రసాదరెడ్డి, రేంజ్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.ఫొటో(11జిడిఎల్ 01): విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందచేస్తున్న శానిటేషన్ కార్మికులు

రాజకీయ వేధింపులు ఆపాలి

గిద్దలూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉయ్యాలవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజకీయ కారణాలతో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించకుండానే శానిటేషన్ వర్కర్ సమీరాను తొలగించాలని హెచ్‌ఎం చేస్తున్న ప్రయత్నాలు ఆపాలని ఎంఈవో పి.నాగభూషన్‌రెడ్డికి సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆయాను తొలగించే ప్రయత్నాలను ఆపాలని డిమాండ్ చే శారు. కార్యక్రమంలో సీఐటీయూ కన్వీనర్ నరసింహులు, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మేరికుమారి, బైరాబి, సమీరా పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నియంత్రణపై అవగాహన

గిద్దలూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే కాలనీలోని సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఐవీ నియంత్రణ, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఐవీకి చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమని, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపట్ల వివక్ష చూపవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ప్రాజెక్టు ప్రతినిధులతోపాటు పాఠశాల హెచ్‌ఎం తిమోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై ఫిర్యాదు



సీఐకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి మోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీపై చర్యలు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు సీఐ సురేష్‌కు ఫిర్యాదు చేశారు. రాహుల్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జేవీ నారాయణ, మాజీ ఉపాధ్యక్షులు బీవీ రామాంజనేయులు, నాయకులు పుల్లయ్య, రాముడు, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలయాల్లో కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ పూజలు

త్రిపురాంతకం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకేశ్వర స్వామి, బాలాత్రిపురసుందరీదేవి ఆలయాల్లో గురువారం కమ్మకార్పొరేషన్ ఛైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి పూజలు చేశారు. రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఉన్న ఆయన ఎర్రగొండపాలెం నియోజకవర్గ పరిశీలకులుగా ఉన్నారు. కార్పొరేషన్ ఛైర్మన్ పదవి పొందిన తరువాత తొలిసారి ఆయన త్రిపురాంతకంలోని ఉభయ దేవాలయాల్లో పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.



అమ్మవారి ఆలయం వద్ద నాయకులతో బ్రహ్మం చౌదరి

అధిక ఫీజుల వసూళ్లపై ఫిర్యాదు

మార్కాపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఆర్ గౌతమ్ కాలేజీ యాజమాన్యం అధిక ఫీజులు వసూలు చేస్తోందని విద్యార్థులు గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవో రవీందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. యూనివర్సిటీ నిర్దేశాల మేరకు కాకుండా కాలేజీ యాజమాన్యం ఇష్టం వచ్చినట్లు పరీక్ష, కాలేజీ ఫీజులు వసూలు చేస్తోందని తెలిపారు. అంతేగాక 3, 5 సెమిస్టర్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం నుంచి రాలేదని విద్యార్థుల నుంచే వసూలు చేస్తున్నారని తెలిపారు. 3వ సెమిస్టర్‌కు సంబంధించి రీయింబర్స్‌మెంట్ వచ్చినా యాజమాన్యం బుకాయించి ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పి.నాగరాజు, ఎస్కే సిద్ధిఖ్, మాధవ్, ఖాశింవలి, బి.రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఏవో రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

సైనిక కాలనీకి స్థలం కేటాయించాలి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలో సైనిక కాలనీ ఏర్పాటు కోసం ప్రభుత్వం స్థలం కేటాయించాలని రిటైర్డ్ ఆర్మీ కోచింగ్ బోర్డు వెల్ఫేర్ సొసైటీ కమిటీ అధ్యక్షుడు మొర్రిబోయిన చిన్నయ్య కోరారు. స్థానిక జై జవాన్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో చిన్నయ్య మాట్లాడుతూ.. మాజీ సైనికుల కోసం కాలనీ ఏర్పాటుకు సొసైటీని ఏర్పాటు చేశామని, ఈనెల 13న జై జవాన్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగే మాజీ సైనికుల సమావేశానికి మాజీ సైనికులకు హౌసింగ్, వసతుల గురించి చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జై జవాన్ అధ్యక్షుడు హరినారాయణరెడ్డి, కార్యదర్శి శేషసాయి, హౌసింగ్ బోర్డు వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి నారాయణరెడ్డి, కోశాధికారి నక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జైజవాన్ అసోసియేషన్ నాయకులు

అంగన్‌వాడీకి కుర్చీల బహూకరణ

బేస్తవారపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బేస్తవారపేట ఇస్లాంపేట అంగన్‌వాడీ కేంద్రానికి కేంద్రంలోని పిల్లల తల్లులు కేంద్రానికి టేబుల్, కుర్చీలు మరికొన్ని వస్తువులను బహూకరించారు. గురువారం జరిగిన సమావేశానికి సీడీపీవో కె.కుమారి, సూపర్‌వైజర్ సలోమి పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్యకర్త షంషాబీ, కేంద్రంలోని పిల్లల తల్లులు పాల్గొన్నారు.

పాఠశాలలకు స్వచ్ఛ పరికరాల పంపిణీ

కంభం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్లస్టర్ పరిధిలోని అన్ని పాఠశాలలకు గురువారం క్లీనింగ్ టూల్స్‌ను పంపిణీ చేశారు. స్వచ్ఛత, పరిశుభ్రత లక్ష్యంగా డస్ట్‌బిన్లు, ప్లాస్టిక్ బకెట్లు, మగ్గులు, బ్రష్‌లు, హ్యాండ్ గ్లౌజులు తదితర వస్తువులను పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం వీరనారాయణ తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు శైలజ, మురళీమోహన్ పాల్గొన్నారు.

అదుపులో నకిలీ విలేకరి

పొదిలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఒక ప్రైవేటు వైద్యుడిని విలేకరులమంటూ నగదు ఇవ్వాలని డిమాండ్ చేసిన నకిలీ విలేకరిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూట్యూబ్ చానల్ విలేకరులమని చెప్పి ప్రైవేటు వైద్యుడు బిశ్వాస్‌ను బెదిరించి నగదు డిమాండ్ చేసినట్లు ఎస్ఐ వేమన తెలిపారు. ఆసుపత్రి నడిపేందుకు మీకు ఉన్న అర్హతలు ఏంటని, లేకపోతే నగదు ఇవ్వాలని బెదిరించినట్లు చెప్పారు. ఆరు నెలల కిందట కూడా వారు వచ్చి హడావుడి చేస్తే నగదు ఇచ్చినట్లు వైద్యుడు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. మరలా ఇప్పుడు వచ్చి నగదు డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చిన వైద్యుడు సహచరులతో కలిసి గురవయ్య అనే వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించారని, మరో ఇద్దరు సంతోష్, బాలు పరారైనట్లు తెలిసింది. కాగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా మధిరకు చెందినవారని, వైద్యుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజలు తిరస్కరించినా..

వైసీపీ నేతలకు బుద్ధిరాలేదు!

▸▸ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మీ పాలన వద్దని ప్రజలు తిరస్కరించినా వైసీపీ నేతలకు బుద్ధిరాలేదని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. యూరియాపై అసత్య ప్రచారం చేస్తుందన్నారు. ఈప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం అధికారులు, దుకాణాల యజమానులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులను అందించాలన్నారు. ఇటీవల యూరియాపై జరిగిన అసత్య ప్రచారాలతో రైతులకు అపోహలకు పోయి అవసరానికి మించి కొనేందుకు యత్నిస్తున్నారని ఎరువుల డీలర్లు ఎమెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా తమ ఇబ్బందులను వివరించారు. ఎరువుల డీలర్ల ఇబ్బందులను కూడా జడ్పీ సమావేశంలో చర్చించి తగిన న్యాయం చేస్తా మని చెప్పారు.

ప్రజాక్షేమం కోసం పరితపించటం అంటే మంత్రి నారా లోకేష్‌ను చూసి జగన్ నేర్చుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర అన్నారు. నేపాల్‌లో చిక్కుఉన్న తెలుగువారిని క్షేమంగా తీసుకొచ్చేందుకు సచివాలయంలో ఉండి చర్యలు తీసుకున్నారన్నారు. ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వారితో వీడియోలో మాట్లాడి ధైర్యం చెప్పారన్నారు. డిల్లీలోని ఏపీ భవన్‌లో అత్యవసర హెల్ప్‌లైన్ ఏర్పాటుచేసి వారితో మాట్లాడుతూ ధైర్యం చెప్పారన్నారు. కేంద్రం అండతో వారిని సమన్వయ పరుచుకుంటూ నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా స్వస్థలాలకు రప్పించే ఏర్పాట్లు చేశారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారికి ఎలాంటి ఆపద వచ్చినా నిలబడి పరిష్కరించే చంద్రబాబు తనయుడిగా మంచిపేరు తెచ్చుకుంటున్న లోకేష్‌ను చూసి జగన్ నేర్చుకోవాలన్నారు. అసత్య ప్రచారాలు మానుకుని మసులుకుంటే మంచిదన్నారు. సమావేశంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, ఏడీఏ జైనులాబ్దిన్, తహసీల్దార్ రవిశంకర్, టీడీపీ నేతలు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), కొండా కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

కనిగిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం మరింత తోడ్పాటు నిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని గురువాజీపేట హైస్కూల్‌లో నూతనంగా భోజనశాల భవన నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల శాతాన్ని పెంచేలా కృషి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ముచ్చుమూరి చెంచిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో అన్నివసతులు

కనిగిరి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన కూరగాయలను మధ్య దళారీలు లేకుండా నేరుగా వారే అమ్ముకునే వెసులుబాటు కల్పించేందుకు రైతుబజార్‌ను ఏర్పాటుచేసినట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని తీగెలగొందిలో ఏర్పాటు చేసిన రైతుబజార్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రైతుబజార్‌లో అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. త్వరలో ముఖ్యనేతలతో ప్రారంభించినున్నట్టు చెప్పారు. తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న వ్యవసాయశాఖ గిడ్డంగిని పరిశీలించారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, ఏడీఏ జైనులాబ్దిన్, తహసీల్దార్ రవిశంకర్, టీడీపీ మండల అధ్యక్షుడు కొండాకృష్ణారెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపె అప్రమత్తంగా ఉండాలి

▸▸ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి


దర్శి ఆసుపత్రిలో వైద్యులకు సూచనలుచేస్తున్న డాక్టర్ లక్ష్మి

దర్శి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో సీజనల్ వ్యాధులు సోకుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ప్రాథమిక దశలోనే వైద్యం చేయించుకోవాలని సూచించారు. స్థానిక దర్శి ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. అక్కడ అందుతున్న వైద్యం తీరును రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, సీఐ వై.రామారావు, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మెన్ దారం నాగవేణి, సుబ్బారావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూరిమెట్ల గ్రామంలో గత కొన్ని రోజుల నుంచి విష జ్వరాలు, గున్యాతో బాధపడుతున్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం ఆమె పూరిమెట్ల గ్రామాన్ని సందర్శించి రోగులను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలను వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్వర పీడితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇవి సీజనల్ వ్యాధులని వివరించారు. అనంతరం వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లతో మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్ళి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో ప్రధాన వీధిలో మురుగు కాలువను చూసి పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రెయినేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం వల్లే వ్యాధులు వచ్చాయన్నారు. వెంటనే వీధులన్నీ శుభ్రం చేసి మురుగును తొలగించాలన్నారు. బ్లీచింగ్, ఎబేట్, దోమల నివారణ మందు ఫాగింగ్ చేయాలని కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, దర్శి మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ కోడెగ మస్తాన్‌రావు, ఎంపీటీసీ చింతలపల్లి వెంకటేశ్వరరావు, చొప్పరపు నాగేశ్వరరావు, ఏడుకొండలు, నిడిగంటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

మండలంలోని మోదేపల్లి మేజరులో చివరి భూముల రైతులను ఆదుకోవాలని డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. ఉమా మహేశ్వర అగ్రహారం వద్ద కాలువను పరిశీలించారు. పూర్తిగా నీరు నిలిచిపోవటంతో వెంటనే జలవనరుల శాఖ ఎస్‌ఈ వరలక్ష్మితో ఫోన్‌లో మాట్లాడారు. ఆయకట్టు పరిధిలో వరి నారుమడులు, మొక్కజొన్న, కంది, పత్తి, మిరప పైర్లు సాగు చేస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నీరు పూర్తిగా నిలుపుదల చేయటం వల్ల రైతులు ఇబ్బందులు పడతారన్నారు. ఆమె వెంట టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పారిశుధ్యం పనులు వేగవంతం

దర్శి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): దర్శి మున్సిపాలిటీలో పారిశుధ్యం పనులు వేగవంతం చేశారు. మురుగునీరు నిల్వ ఉండే లోతట్టు ప్రాంతాల నుంచి నీటిని బయటకు పంపేందుకు ఎక్స్‌కవేటర్ ద్వారా కాలువలు తీశారు. పలుచోట్ల నీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తిచెంది ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. ఈవిషయాన్ని గుర్తించిన అధికారులు మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నారు. కమిషనర్ మహేశ్వరరావు పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మురుగునీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ చల్లుతున్నట్టు చెప్పారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించాలి

దర్శి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించాలని ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం దర్శిలో అధికారులు, సిబ్బందితో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలన్నారు. ఎక్కడైనా అక్రమ విద్యుత్ వాడకం జరిగితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈ పి.శ్రీనివాసులు, డీఈఈ రవికుమార్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి రుణాలు మంజూరుచేయాలి

పామూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు బ్యాంకర్లు సహకరించాలని జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ డి.రమేష్ కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో డీపీఎం అంబేద్కర్, సీఎస్‌పురం కెనరా బ్యాంక్ చీఫ్‌మేనేజర్ సంజయ్, పామూరు, సీఎస్‌పురం పశువైద్యాధికారులు ఆర్.హనుమాన్, షేక్ మునీర్, ఏపీఎం విద్యాసాగర్, మండల సమాఖ్య కార్యదర్శి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

దక్షిణామూర్తి దేవస్థానంలో పూజలు

పామూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరగళదిన్నె గ్రామంలో వెలసిఉన్న దక్షిణమూర్తిస్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యకమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, పామూరు మేజర్ పంచాయతి కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి, తదితరలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారికి స్వామివార్ల చిత్రపటాలను అర్చకులు, నిర్వాహకులు అందజేశారు.

మానం సుబ్బారత్నంకు నివాళి


సుబ్బారత్నం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, తాటికొండ శ్రీనివాసరావు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు

తాళ్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి మానం రమేష్ బాబు సతీమణి సుబ్బారత్నం మానవతా మూర్తిగా ప్రజల హృదయాల్లో నిలిచారని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మండలంలోని విఠలాపురం గ్రామంలో సుబ్బారత్నం సంస్మరణ సభ కార్యక్రమం గురువారం జరిగింది. ఈసందర్భంగా సుబ్బారత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ మానం రమేష్, నవులూరి సురేంద్రలు రాజకీయ కీయంగా ఉండటంతో ఇంటికి వెళ్లేవారిని ఎంతగానో ఆప్యాయంగా పలకరించే వారన్నారు. నివాళులర్పించినవారిలో మాజీ ఎమ్మెల్యేలు గరటయ్య, పాపారావు, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, పమిడి రమేష్, నారపుశెట్టి పిచ్చయ్య ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, బి.ఓబులేరెడ్డి, శిద్దా సుధీర్‌బాబు, రమణారెడ్డి, సురేంద్రమోహన్, గొల్లపూడి వేణుబాబు, కాలేషావలి, రాచకొండ వెంకట్రావు, పిన్నిక రమేష్, ఐ.శ్రీనివాసరెడ్డి, శివనాగిరెడ్డి, నవులూరి విద్యాసాగర్, తదితరులు ఉన్నారు.

కాగా, టీడీపీ సీనియర్ నేత శాగం కొండారెడ్డిని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి గురువారం పరామర్శించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇంటి వద్దనే ఆయనను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు.అయ్యలపాలెం గ్రామంలో ఇటీవల వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన ఘర్షణలో గాయపడ్డ టీడీపీ కార్యకర్తలను పరామర్శించారు.

భూగర్భ జలాలను పెంపొందించాలి

పీసీపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సోక్‌పిట్స్ నిర్మించడంతో భూగర్భ జలాలు పెరుగుతాయని ఎంపీడీవో హనుమంతరావు, ఏపీవో కొండయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై టీఏలు, ఎఫ్ఏలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సోక్‌పిట్స్ నిర్మాణంతో వర్షపునీరు వృధా కాకుండా భూగర్భానికి చేరి జలమట్టం పెరుగుతుందని తెలిపారు. ఉపాధి పనుల్లో అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా పనులు చేయించాలన్నారు. సమావేశంలో ఈసీ జహంగీర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం యునియన్ ఇచ్చిన పిలుపులో భాగంగా సీఎస్‌పురం మండలంలో తొలిరోజు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమాల్లో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, ఆనంద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: ఏపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో పలు పాఠశాలల వద్ద ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే తమ హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు.

వ్యక్తిపై దాడి

ముండ్లమూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు ఎస్సీ కాలనీకి చెందిన వరగాని యోహాన్‌పై శుక్రవారం రాత్రి దాడి చేయడంతో గాయపడ్డాడు. తన బంధువుల ఊరైన నాయుడుపాలెం వెళ్ళి తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో బాయిల్డ్ రైస్ మిల్లు ఎదురుగా పసుపుగల్లుకు చెందిన సూరబోయిన శేషయ్య ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడంతో కిందపడి గాయపడ్డాడు.

గాయపడిన యోహాన్‌ను చికిత్స నిమిత్తం దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని ముండ్లమూరు పోలీసులు పరిశీలించారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం

తాళ్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కేంద్ర బృందం సభ్యులు అజిత్, కిరణ్, భూషణ్‌లు గురువారం పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు కిల్కారి కార్యక్రమం ద్వారా అందజేస్తున్న సేవలను వైద్యులు ప్రవీణకుమార్, రాజేష్‌యాదవ్‌లు బృందానికి వివరించారు. మాధవరం, తాళ్లూరు గ్రామాల్లో కిల్కారీ బృందం పర్యటించారు. గర్భిణులకు అందుతున్న సేవలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీఎం రాజేశ్వరి, కిల్కారి పీవో రాజు, సీహెచ్ఏ వి.రమణమ్మ, పీహెచ్ఎన్ వై.విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన విజిలెన్స్ సీఐ

ముండ్లమూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం ఎస్సీ కాలనీకి చెందిన నంబూరి పెద జక్రయ్య తన ఇంటి ఆవరణలో ఉన్న మోటారును ఆన్ చేసేందుకు వెళ్లి షాక్‌కు గురై మృతి చెందారు. అతని మృతికి జూనియర్ లైన్‌మన్ కారణమని బంధువులు ఆరోపించటంతో ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ బీటీ నాయక్ గురువారం కుటుంబసభ్యులను విచారించారు. తన తండ్రి మృతికి విద్యుత్ శాఖ సిబ్బందే కారణమని జక్రయ్య కుమారుడు లిఖితపూర్వకంగా తెలియజేవారు. ఎస్ఈతో పాటు ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని నాయక్ తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్ఐ అంకమ్మ, లైన్‌ఇన్‌స్పెక్టర్ ఎస్.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు మంజూరు చేయాలి

పామూరు, సెప్టెంబరు 8 ఆంధ్రజ్యోతి): మూడు నెలలపాటు ఉచిత తీసుకున్న వారందరికి కుట్టు మిషన్లను మంజూరు చేయాలని మహిళలు కోరారు. ఇందుకుసంబంధించి గరువారం ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్యతో శిక్షకురాలు ఖాజాబీ మాట్లాడారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 170 మంది మహిళలకు శిక్షణ ఇచ్చినట్టు ఆమె తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకొని రెండు నెలలు గడిచిన ఇంతవరకు మిషన్లు మంజూరు చేయలేదన్నారు శిక్షకురాలికి వేతనం కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 20 రోజుల్లో మిషన్లు మంజూరు చేస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.



మూడు జిల్లాలకు నూతన కలెక్టర్లు



డాక్టర్ వినోద్‌కుమార్ కలెక్టర్, బాపట్ల జిల్లా | కృతికా శుక్లా కలెక్టర్, పల్నాడు జిల్లా | తమీమ్ అన్సారియా కలెక్టర్, గుంటూరు జిల్లా

1 గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్ల బదిలీ 1 నాగలక్ష్మి స్థానంలో తమీమ్ అన్సారియా 1 వెంకటమురళిని మార్చి వినోద్‌కుమార్‌కు పోస్టింగ్ 1 అరుణ్‌బాబును బదిలీ చేసి కృతికాశుక్లా నియామకం 1 మానవీయ కోణంలో పనిచేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం 1 ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఆశలు నెరవేర్చాలన్న చంద్రబాబు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్లు ఒకే సారి బదిలీ అయ్యారు. సుదీర్ఘ కసరత్తు అనంతరం గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు చీఫ్ సెక్రటరి విజయానంద్ కలెక్టర్ల బదిలీలకి సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రకారం గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్థానంలో తమీమ్అన్సారియా నియమితులయ్యారు. బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళిని మార్చి డాక్టర్ వినోద్‌కు మార్‌కు పోస్టింగ్ ఇచ్చారు. పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును బదిలీ చేసి కృతికాశుక్లా నియమించారు. నాగలక్ష్మి, వెంకటమురళి, అరుణ్‌బాబులకు ప్రభుత్వం పోస్టింగ్ చేయలేదు. నూతన కలెక్టర్లు త్వరలో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు కలెక్టరేట్ వర్గాల సమాచారం. కాగా నూతన కలెక్టర్ల పోస్టింగ్ అనంతరం సీఎం చంద్రబాబు తన క్యాంపు కార్యాలయంలో గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాతో (మిగతా 6లో)

స్త్రీశక్తి పథకం సూపర్ హిట్ అయింది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసే మహిళల సంఖ్య భారీగా పెరిగింది. ఇదే సమయంలో ఎంతో కొంత ఆటోల నిర్వాహకులు నష్టపోతున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆటో డ్రైవర్లకు ఆర్థిక చేయూత అందించేందుకు ఆటో మిత్ర పథకం అమలు చేయబోతోంది. ఆటోవాలాకు ఏడాదికి రూ.15 వేలు చెల్లిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. దసరా నుంచి పథకం అమలు అవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభలో చేసిన ప్రకటనతో ఆటో వాలాలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రూ.10 వేలు అరకొరగా చెల్లించింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో దాదాపు 28 వేల ఆటోలు ఉంటాయని రవాణా శాఖ అంచనా. వేలాది మంది ఆటో డ్రైవర్లకు సుమారు రూ.42 కోట్ల లబ్ధి చేకూరనుంది.



ఆటోవాలా.. ఆనంద హేల

'ఆటో మిత్ర'తో ఆటో డ్రైవర్లకు చేయూత



1 దసరా నుంచి అమలుకు కసరత్తు
1 ఏటా రూ.15,000 ఇస్తామంటూ ప్రభుత్వం వెల్లడి
1 28 వేల మందికిపైగా.. రూ.42 కోట్ల లబ్ధి

(చీరాల, ఆంధ్రజ్యోతి)

ఆటో మిత్ర పథకం అమలుకు జిల్లాలో రవాణా శాఖ కసరత్తు ప్రారంభించింది. గతంలో ఆటో, మాక్సీ, మ్యాజిక్ క్యాబ్‌లకు వాహన మిత్ర పథకం అమలు చేశారు. ఈ సారి అచ్చంగా ఆటోలు నడిపే వారికేనా లేక క్యాబ్‌లకు కూడా ఈ పథకం అమలు చేస్తారా అన్న అంశం ప్రభుత్వ మార్గదర్శకాల్లో తేల నుంది. కొన్ని పట్టణాల్లో ఆర్టీసీ సిటీ సర్వీసులు లేవు. దీనివల్ల పట్టణాల్లో ఆటో వాలలకు నష్టం నామ మాత్రమే. అయితే గ్రామాల నుంచి మహిళలు ఆ టోల్లోనే ప్రయాణించే వారు. ఉచిత ప్రయాణంతో వీ రందరూ ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. దీంతో గ్రామీణ ఆటోడ్రైవర్లు నష్టపోతున్నట్లు చెబుతున్నారు.

ఆటో డ్రైవర్లకే ఆర్థిక సాయం ఇవ్వండి

హరిత పన్ను తగ్గింపుతో.. ప్రభుత్వం ఆటో వాలలకు ఆర్థిక భారం తగ్గించిన విషయం తెలిసిందే. మేలో హరిత పన్ను విధానం అమలు చేసిన ప్రభుత్వం.. దసరాకు ఆటో మిత్ర పథకం అమలు చేస్తూ ఆటో వాలాలకు డబుల్ ధమాకా అందిస్తోంది. అయితే రోజూ ఆటో నడిపే డ్రైవర్లకు పథకం వర్తింపజేయాలని డ్రైవర్లు కోరుతున్నారు. రోజు వారీ అద్దెకు ఆటోలు నడుపుతుంటామని అయితే ఆటో ఓనర్లకు కాకుండా డ్రైవర్లకు ఆటో మిత్ర అమలు చేయాలంటున్నారు. ఆటో మిత్ర పథకం ప్రకటనపై కూటమి ప్రభుత్వంకు కృతజ్ఞతలు చెబుతున్నారు.

ఆటోవాలాలకు ఎంతో మేలు



ఆటో మిత్ర పథకం ప్రకటించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో.. రోజు వారి ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య 20 నుంచి 30 శాతం తగ్గింది. అంతకు ముందు రోజూ రూ.700 నుంచి రూ.1000 బాడిగ తోలేవాళ్లం. ఇప్పుడు రూ.500 నుంచి రూ.700కు ఆదాయం తగ్గింది. -ఏడుకొండలు, ఆటో డ్రైవర్, నరసరావుపేట

ఆటో మిత్ర ఆదుకుంటుంది



మహిళలకు ఉచిత ప్రయాణంతో కొంత మేర ఆదాయం కోల్పోయాం. ప్రభుత్వం దసరా నుంచి ఆటో మిత్ర ద్వారా ఏడాదికి రూ.15 వేలు చెల్లిస్తే.. ఆర్థికంగా మేలు చేసినట్లే. ఆటో డ్రైవర్లకు చేయూత నందిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

-చౌడయ్య, డ్రైవర్, రూపెనగుంట్ల

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

చెట్లతోపాటు జంతువులను కాపాడుకోవాలి

అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి కాంతిలాల్‌దండే



అమరుల కుటుంబాలను సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి కాంతిలాల్‌దండే, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి కాంతిలాల్‌దండే తెలిపారు. అటవీశాఖా ఆధ్వర్యంలో గురువారం జాతీయ అటవిశాఖ అమరవీరుల సంస్మరణ దినం స్థానిక సూర్యలంకతీరంలోని నగరవనంలో జరిగింది. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి, అటవీశాఖ సలహాదారులు మల్లికార్జున తదితరులతో కలిసి కాంతిలాల్‌దండే నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో కాంతిలాల్ దండే మాట్లాడుతూ చెట్లతోపాటు జంతువులను కాపాడుకోవాలని సూచించారు. అటవీభూముల ప్రాధాన్యతను గుర్తించి రక్షించాలని చెప్పారు. విధి నిర్వాహణలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు అటవీశాఖ అండగా ఉండాలన్నారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తాను తెలంగాణలో ఐపీఎస్ అధికారిగా పనిచేస్తున్న సమయంలో తన మిత్రుడు అటవీశాఖ ఉద్యోగం చేస్తూ నక్సల్స్ చేతిలో మరణించాడని తెలిపారు. ఇలాంటి వారి సేవలను, ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు బాధిత కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ కొందరు అజ్ఞానంతో చెట్లను నరికివేయడంతో పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. వరదలతో పాటు కరువు కాటకాలు కూడా సంభవిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో చెట్టు సంరక్షనతో పాటు అడువులను కాపాడటాన్ని ప్రతీఒక్కరూ తమ జీవనంలో ఓ భాగం చేసుకో వాలని తెలిపారు. అటవీశాఖలో విధులు నిర్వహిస్తూ మరణించిన 8 కుటుంబాలకు చెందిన సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖాధికారులు పీడీ చలపతి, రాహుల్‌పాండే, శాంతిప్రియపాండే, శరవణన్, ఐకేవీ రాజు, చైతన్యకుమార్‌రెడ్డి, కె.వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



సూర్యలంక సముద్రతీరంలో బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

సంబరాలను విజయవంతం చేయాలి

1 బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్ల పరిశీలనలో ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సూర్యలంక సముద్ర తీరంలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించే బీచ్‌ఫెస్టివల్ సంబరాలను సమన్వయంతో విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధికారులకు తెలిపారు. బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లను గురువారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. బీచ్ వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. తీరంలో రాళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రహదారికి ఇరువైపులా చిల్లచెట్లను తొలగించాలన్నారు. ఎమ్మెల్యే వెంట అడవిగ్రామపంచాయతీ స్పెషలాఫీసర్, తహసీల్దార్ షేక్.సలీమా, సర్వేయర్ లక్ష్మీనారాయణ, మార్కెట్‌యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

బస్సులో 5 కిలోలు గంజాయి స్వాధీనం

1 ఒకర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు 1 బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద ఘటన

మార్టూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మండల పరిధిలోని బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద ఆర్టీసీ బస్సులో 5 కిలోలు గంజాయిని గురువారం తెల్లవారుజామున ఎస్‌టీఎఫ్ ఎన్ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒడిషాకి చెందిన సురేష్ మహాపాత్ర అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఒడిషా నుంచి చెన్నైకు గంజాయి తరలిస్తున్నట్లు అధికారుల విచారణలో తేలింది. ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ ఆదేశాలు మేరకు ప్రకాశం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విజయ పర్యవేక్షణలో టోల్‌ప్లాజా వద్ద గుంటూరు వైపు నుండి ఒంగోలు వైపు వెళ్లే వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో విశాఖ నుంచి తిరుపతి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నఅనుమానితుడిగా కనిపించిన సురేష్‌మహాపాత్రను తనిఖీ చేయగా బ్యాగ్‌లో 5 కిలోలు గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.ఒడిషాలోని సమీప బంధువు విశాల్‌బుట్కీ దగ్గర కిలో రూ.3వేలు వంతున 5కిలోలు గంజాయిని కొనుగోలు చేసి చెన్నైలో కిలో 10వేలకు విక్రయిస్తున్నట్లు అధికారుల విచారణలో సురేష్ చెప్పినట్లు సమాచారం. ఇతడిపై చెన్నైలో గతంలో రెండు కేసులు ఉండగా జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఈఎస్ మధుబాబు, ఏఈ ఎస్ జనార్థన్, సీఐలు నరహరిరావు,రామారావు, ఎస్ఐ శ్రీధర్,ఎస్‌టీఎఫ్ సీఐ బాలనరసింహ పాల్గొన్నారు.



బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద 5 కిలోల గంజాయి సహా నిందితుడ్ని అదుపులోకి తీసుకున్న అధికారులు

గడువు.. మూడు రోజులే

u బార్ల దరఖాస్తులకు స్పందన అంతంతే
u మూడు జిల్లాల్లో 112 బార్లకు 15 దరఖాస్తులు
u 14 వరకే అవకాశం.. శని, ఆదివారాలు బ్యాంకులకు సెలవు
u అధికారులు వేడుకుంటున్నా ముందుకురాని మద్యం వ్యాపారులు
u ఎక్సైజ్ అధికారుల గుండెల్లో రైళ్లు.. అన్ని మార్గాల్లో ప్రయత్నాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యం బార్ల నిర్వహణకు వ్యాపారులు ముందుకు రావడంలేదు. తొలివిడతలో రెండు సార్లు అవకాశం ఇవ్వగా దరఖాస్తులు స్పందన కానరాలేదు. దీంతో రెండో విడతలో ఈ నెల 3న గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో 112 బార్లకు రీ నోటిఫికేషన్ ఇచ్చింది. వీటికి ఆదివారం వరకు గడువు ఇచ్చింది. రీనోటిఫికేషన్ గడువు ఇక మూడు రోజులు మాత్రమే ఉంది. ఇందులో శనివారం, ఆదివారం బ్యాంకులకు సెలవు. అయితే ఇంతవరకు దరఖాస్తులు వేసేందుకు వ్యాపా రులు ముందుకు రాలేదు. బాపట్ల జిల్లాలో 15 బార్లకు రీ నోటిఫికేషన్ ఇవ్వగా గురువారానికి కేవలం ఐదు దరఖాస్తులే వచ్చినట్లు సమాచారం. కేవలం మూడు రోజులు మాత్రమే మలివిడత నోటిఫికేషన్‌లో గడువు మిగిలి ఉన్నా వ్యాపారులు దరఖాస్తు చేసేందుకు ఆసక్తి చూపకపోవడంపై అధికారులు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు జిల్లాలో 67 బార్లకు నోటిఫికేషన్ ఇవ్వగా ఎనిమిది, పల్నాడు (మిగతా 6లో)



గేదెల కొనుగోళ్లపై భిన్న ఆదేశాలు

u సెర్ప్ సీఈవో ప్రకటనకు భిన్నంగా స్థానిక అధికారులు
u ఆందోళనలో పొదుపు మహిళలు.. మంత్రి దృష్టికి సమస్య

బల్లికురవ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గేదెల యూనిట్లపై సెర్ప్ అధికారులు విభిన్నంగా ఆదేశాలు ఇస్తున్నారు. లబ్ధిదారులైన మహిళల అభీష్టం మేరకు స్థానికంగానే కొనుగోలుకు సెర్ప్ సీఈవో ఆమోదించగా అందుకు పూర్తి భిన్నంగా తాము చెప్పిన దగ్గరే కొనుగోలు చేయాలని జిల్లా అధికారులు చెప్తున్నారు. తమ ఇబ్బందులను జిల్లా అధికారులు పట్టించుకోవడంలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర జిల్లాల గేదెలను మాత్రమే కొనుగోలు చేయాలని అధికారుల మెలికతో పొదుపు సంఘాల మహిళలు ఆందోళనలో ఉన్నారు. ఈ క్రమంలో గురువారం రాష్ట్ర సెర్ప్ సీఈవో వాకాటి కరుణ పొదుపు సంఘాల గ్రామ సంఘాల అధ్యక్షులతో ఆన్‌లైన్‌లో నిర్వహించిన సమావేశంలో గేదెల ప్రస్తావన రాగా స్థానికంగా కొనుగోలుకు ఆమె ఆమోదించారు. బ్యాంకు రుణం ద్వారానే గేదెలు కొనుగోలు చేయిస్తున్నాం.. ఇందులో ఎలాంటి సబ్సిడీ లేదు.. వారు ఎక్కడ ఇష్టపడితే అక్కడే కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. తాము గేదెలు ఎక్కడైన కొనుగోలు చేసుకోవచ్చని మహిళలు ఆనందపడ్డారు. సమావేశం అనంతరం జిల్లా అధికారులు మళ్లీ సమావేశమై కృష్ణ జిల్లాలోని ఫారాల్లోని గేదెలను మాత్రమే కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో పొదుపు సంఘాల మహిళలు రాష్ట్ర స్థాయి అధికారులు కరుణించినా జిల్లా అధికారులు తమ బాధను అర్థం చేసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర జిల్లాల గేదెలు వాతావరణం ప్రభావంతో ఇక్కడకు తీసుకు రాగానే పాలు ఇవ్వడం లేదని మహిళలు అంటున్నారు. ఈ విషయమై మంత్రి రవికుమార్‌ను కలిసి సమస్యను విన్నవించేందుకు పొదుపు సంఘాల మహిళలు సిద్ధమవుతున్నారు.

14న బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపిక

బాపట్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ఆవరణంలో ఈనెల 14వ తేదిన జూనియర్ బాలబాలికల కబడ్డీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పీడీ కత్తిశ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఎంపికలకు 2005 డిసెంబరు 31వ తేదీ తర్వాత పుట్టినవారై ఉండాలన్నారు. బాలురు 75 కిలోలు, బాలికలు 65కిలోలలోపు ఉండాలన్నారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు ఒరిజినల్ తీసుకురావాలన్నారు. మధ్యాహ్నం 3గంటలు నుంచి ఎంపికలు జరుగుతాయని అసోసియేసన్ కార్యదర్శి మంతెన సుబ్బరాజు తెలిపారు. వివరాలకు 9346258841లో సంప్రదించాలన్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

కొల్లూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆరు ఇసుక ట్రాక్టర్లను ప్రొహిబిషన్ ఎస్ఐ శ్రీనివాస్ స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు.. గురువారం మండలంలోని పెసర్లంక అరవింద వారధి వద్ద కృష్ణానదిలో ఇసుకను అక్రమంగా తవ్వి రావాణా చేస్తున్న ఆరు ట్రాక్టర్లను తనిఖీ చేయగా వారి వద్ద ఎటువంటి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. అక్రమ రవాణా చేస్తున్న వాహనదారులను తహసీల్దార్ ఎదుట హాజరుపరచనున్నట్లు తెలిపారు.



బర్లీ పొగాకు సాగు చేయొద్దు

● ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ, మానవహారం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రానున్న రబీ సీజన్‌లో రైతులు నల్లబర్లీ/తెల్లబర్లీ పొగాకు పంటను సాగు చేయొద్దని కోరుతూ జిల్లా కేంద్రమైన ఒంగోలులో గురువారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, గ్రామ సహాయ వ్యవసాయకులు, రైతులతో కలిసి ఈ ర్యాలీ నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్ నుంచి నెల్లూరు బస్టాండు వరకు, అక్కడి నుంచి తిరిగి చర్చిసెంటర్ వరకు నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణీ, డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ వాణిశ్రీ, ఒంగోలు, దర్శి, సింగరాయకొండ సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు బి.రమేష్‌బాబు, బాలాజీనాయక్, నిర్మలాకుమారి ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న మంత్రి రవికుమార్

అద్దంకి, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు వైద్యంభారం కాకుడదన్న ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకొంటోందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి నియోజకవర్గంలో వివిధ గ్రామాలకు చెంది అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకున్న 61 మందికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం చిలకలూరిపేటలో మంత్రి రవికుమార్ అందజేశారు. ఆయా గ్రామాల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

అద్దంకి : విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించనున్నారు. సాయంత్రం 3.30 గంటల నుంచి అక్కడే ప్రజల నుంచి వివిధ సమస్య లపై అర్జీలు స్వీకరించనున్నారు. ఉదయం 9.30 గంటలకు పంగులూరు మండలం బూదవాడ హైస్కూల్‌లో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, 11 గంటలకు ఒంగోలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం లలో పాల్గొననున్నారు.

మంత్రిని కలిసిన నూతన కమిటీ

పంగులూరు : టీడీపీ మండల అధ్యక్షుడు రావూరిరమేష్‌తో పాటు నూతన కమిటీ సభ్యులు గురువారం మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను చిలకలూరిపేటలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన ఎన్నికకు రెండవసారి కృషి చేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని నాయకులందరి సహకారంతో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, గుర్రంఆదిశేఖర్, పూనాటి రామాంజనేయులు, అశోక్, ఆదిరెడ్డి, నారాయణస్వామి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జనకవరంలో తీరిన మురుగునీటి సమస్య

● రూ.30 లక్షల నిధులతో పూర్తయిన ప్రధాన డ్రెయిన్ నిర్మాణం

● నిధులు మంజూరు చేయించిన మంత్రి రవికుమార్

పంగులూరు, సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని జనకవరం గ్రామంలో రూ.30 లక్షల ప్రభుత్వ నిధులతో చేపట్టిన ప్రధాన సీసీ డ్రైనేజీ నిర్మాణం పూర్తయ్యింది. గ్రామంలో డ్రైనేజ్‌సరిగా లేకపోవడంతో మురుగు నీరు ముందుకు కదలక ప్రజలు ఇబ్బంది పడేవారు. అధిక వర్షాలు పడిన సందర్భంలో కొండమూరు, పరిసర పొలాలలోని వర్షపు నీరు గ్రామంవైపు చేరుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలను ముచెత్తేది. దీంతో సమస్యను గ్రామ టీడీపీ నాయకులు గుర్రంశేఖర్, మరి కొందరు నేతలు సమస్యను మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసు కెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి రూ.20లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పాటు రూ.10లక్షల డీఎంఎఫ్ నిధులు మంజూరు చేయించారు. రూ.30 లక్షల ప్రభుత్వ నిధులతో మురుగునీరు ఊరి వెంబడి ఉన్న వాగులోనికి వెళ్లేలా సిమెంట్ డ్రైన్ నిర్మించారు. పక్కాడ్రైన్ నిర్మాణంతో మురుగు నీటి సమస్య తీర్చిన మంత్రి గొట్టిపాటికి జనకవరం గ్రామ స్థులు కృతజ్ఞతలు తెలిపారు.



గ్రామంలో పూర్తయిన ప్రధాన మురుగు కాలువ

ఇద్దరు అధికారుల బదిలీ

● మహిళా ఉద్యోగి పట్ల అసభ్య ప్రవర్తనే కారణమా?

తాళ్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహిళా ఉద్యోగితో ఫోన్లో అసభ్య సంభాషణ చేశారన్న ఆరోపణ నేపథ్యంలో ఇద్దరు అధికారులను డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. కలెక్టర్ ఆదేశానుసారం స్థానిక డిప్యూటీ ఎంపీడీవో దారా హనుమంతరావు, తాళ్లూరు పూర్వపు పంచాయతీ కార్యదర్శి ఐ.వి.రమణారెడ్డిలపై డిప్యూటేషన్‌పై బదిలీ వేటు వేస్తూ గురువారం డీపీవో ఎం.వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. తాళ్లూరు మండల పరిషత్ పరిధిలోని సచివాలయ మహిళా ఉద్యోనిని ఫోన్ ద్వారా చాటింగ్ చేస్తూ అసభ్య సంభాషణ చేస్తున్నారని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. దీనిపై గత డీపీవో వెంకటప్పనాయుడును విచారణకు ఆదేశించారు. ప్రాథమిక విచారణ చేసి నివేదిక కలెక్టర్‌కు అందించారు. ఆ నివేదిక ఆధారంగా ఇరువురు ఉద్యోగులను క్రమశిక్షణా చర్యల్లో భాగంగా డిప్యూటీ ఎంపీడీవో హనుమంతరావును పుల్లలచెరువు మండలానికి, పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డిని గిద్దలూరు మండలం నరవ గ్రామ సచివాలయంకు డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నూతన కలెక్టర్లు

(5వ పేజీ తరువాయి)

పాటు ఇతర జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడారు. అన్నింటికీ నిబంధనలు అని పోకుండా మానవీయ కోణంలో పనిచేయాలని చంద్రబాబు సూచించారు. ఫేక్ ప్రచారాలు పెనుసవాల్‌గా మారాయని, వాటిపై రియల్‌టైంలో స్పందించాలని తెలిపారు. సీఎం అంటే కామన్ మ్యాన్ అని తాను చెబుతున్నానని, కలెక్టర్లు కూడా అదే పాటించాలన్నారు. తన ఆలోచనలు, అంచనాలను అందుకుని ఉత్తమ పనితీరు చూపాలన్నారు. ప్రభుత్వ విజయాల్లో కలెక్టర్లదే కీలకపాత్ర అని స్పష్టం చేశారు. 360 డిగ్రీల్లో మీ పని తీరు పరిశీలించిన తర్వాతనే కలెక్టర్‌గా అవకాశం కల్పించామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నిత్యం వారితోనే మమేకం కావాలన్నారు. ప్రజలు తమ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వాటిని నెరవేర్చాల్సిన బాధ్యత కలెక్టర్లదేనన్నారు. ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకురావడానికి ఇదొక మంచి అవకాశమని తెలిపారు. కింది స్థాయి అధికారుల్లో కూడా స్ఫూర్తిని నింపాలని సూచించారు. ఎమ్మెల్యేలకు తగిన గౌరవం ఇచ్చి వారు చెప్పే పనుల్లో మంచి, చెడు చూసి ప్రజలకు ఉపయోగపడేవి చేయాలన్నారు.

గడువు.. మూడు రోజులే

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో 30 బార్లకు రెం డు దరఖాస్తులు వచ్చాయి. అంటే ఇప్ప టి వరకు మూడు జిల్లాల పరిధిలో బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన రీ నోటిఫికేషన్‌కు స్పందన తీసికట్టుగా నే ఉన్నట్లు అర్థమవుతోంది. బాపట్ల జిల్లాలో 19 బార్లలో తొలి విడతలో నాలుగు బార్లకు లాటరీ నిర్వహించారు. మిగిలిన 15 బార్లకు రీ నోటిఫికేషన్ జారీ చేయగా నిబంధనల ప్రకారం 60 దరఖాస్తులు రావాల్సి ఉండగా ఐదు మాత్రమే రావడంపై ఎక్సైజ్ అధికారులు విస్తుపోతున్నారు. గుంటూరు జిల్లాలో 110 బార్లకు 43 బార్లకు లాటరీ నిర్వహించగా మిగిలిన 67 బార్లకు రీ నోటిఫికేషన్ ఇచ్చారు. కాగా ఇప్పటి వరకు మంగళగిరి, పొన్నూరులో ఒక్కొక్క బార్‌కు నాలుగేసి చొప్పున మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. పల్నాడు జిల్లాలో 49 బార్లకు తొలివిడతలో 19 బార్లను లాటరీ ద్వారా కేటాయించారు. మిగిలిన 30 బార్లకు దరఖాస్తులు ఆహ్వానించగా పిడుగురాళ్లలో రెండు బార్లకు ఒక్కొక్క దరఖాస్తు మాత్రమే వచ్చాయి. కాగా రీ నోటిఫికేషన్ గడువు ప్రకారం శుక్రవారం వచ్చే దరఖాస్తులపైనే ఎక్సైజ్ అధికారులు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా ఆశావహులతో సమావేశమైన అధికారులు దరఖాస్తు చేయాల్సిందిగా కోరారు. ఓ వైపు వ్యాపారుల నుంచి స్పందన లేకపోవడం, మరోవైపు ముంచుకొస్తున్న గడువు, ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో నేపథ్యంలో ఏమిచేయాలో పాలుపోక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అయితే ఉన్నతాధికారులు మాత్రం సగం బార్లకు అయినా దరఖాస్తులు రావాలని, లేనిపక్షంలో వైఫల్యంగా భావించి చర్యలు తప్పవనే సంకేతాలను ఇప్పటికే అధికారులకు పంపారు. దీంతో ముందునుయ్యి వెనక గొయ్యిలాగా ఎక్సైజ్ అధికారుల పరిస్థితి మారింది. చివరి ప్రయత్నంగా గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారితో పాటు, బార్ల వ్యాపారంలో అనుభవం ఉన్న వారితో శుక్రవారం మరోమారు సంప్రదింపులు జరపడానికి ఎక్సైజ్ విభాగం సిద్ధమవుతోంది. బార్ల వ్యాపారం లాభసాటిగా ఉంటుందని దరఖాస్తులు చేయాలని అటు అసోసియేషన్ నాయకులతో పాటు ఈ రంగంలో అనుభవజ్ఞులను అధికారులు కోరుతున్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం

తాళ్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృందం సభ్యులు అజిత్, కిరణ్, భూషణ్‌లు గురువారం పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు కిల్కారి కార్యక్రమం ద్వారా అందజేస్తున్న సేవలను వైద్యులు ప్రవీణకుమార్, రాజేష్‌యాదవ్‌లు బృందానికి వివరించారు. మాధవరం, తాళ్లూరు గ్రామాల్లో కిల్కారీ బృందం పర్యటించారు. గర్భిణులకు అందుతున్న సేవలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీఎం రాజేశ్వరి, కిల్కారి పీవో రాజు, సీహెచ్‌ఓ వి.రమణమ్మ, పీహెచ్‌ఎన్ వై.విజయమ్మ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ముండ్లమూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం ఎస్సీ కాలనీకి చెందిన నంబూరి పెద జక్రయ్య తన ఇంటి ఆవరణలో ఉన్న మోటారును ఆన్ చేసేందుకు వెళ్లి షాక్‌కు గురై మృతి చెందారు. అతని మృతికి జూనియర్ లైన్‌మన్ కారణమని బంధువులు ఆరోపించటంతో ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ బీటీ నాయక్ గురువారం కుటుంబసభ్యులను విచారించారు. తన తండ్రి మృతికి విద్యుత్ శాఖ సిబ్బందే కారణమని జక్రయ్య కుమారుడు లిఖితపూర్వకంగా తెలియజేవారు. ఎస్‌ఈతో పాటు ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని నాయక్ తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్‌ఐ అంకమ్మ, లైన్‌ఇన్‌స్పెక్టర్ ఎస్.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించాలి

దర్శి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించాలని ఎస్ ఈ కె.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం దర్శిలో అధికారులు, సిబ్బందితో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలన్నారు. ఎక్కడైనా అక్రమ విద్యుత్ వాడకం జరిగితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈ పి.శ్రీనివాసులు, డీఈఈ రవికుమార్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి రుణాలు మంజూరుచేయాలి

పామూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు బ్యాంకర్లు సహకరించాలని జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ డి.రమేష్ కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో డీపీఎం అంబేడ్కర్, సీఎస్‌పురం కెనరా బ్యాంక్ చీఫ్‌మేనేజర్ సంజయ్, పామూరు, సీఎస్‌పురం పశువైద్యాధికారులు ఆర్.హనుమాన్, షేక్ మునీర్, ఏపీఎం విద్యాసాగర్, మండల సమాఖ్య కార్యదర్శి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

దక్షిణామూర్తి దేవస్థానంలో పూజలు

పామూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరగళదిన్నె గ్రామంలో వెలసిఉన్న దక్షిణమూర్తిస్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యకమంలో ఏఎంసీ వైస్‌ఛైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, పామూరు మేజర్ పంచాయతి కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి, తదితరలు పాల్గొన్నారు.

అభివృద్ధే.. అజెండా..!

● ట్రంక్‌రోడ్ విస్తరణకు నేడు ఆమోదం

● నగరంలో డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం

● నేడు ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం



ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర అభివృద్ధే అజెండాగా.. నగరంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి నేడు ఆమోదం లభించనుంది. యిందుకు సంబంధించి ప్రధానంగా నగర రహదారుల విస్తరణకు శ్రీకారం పలకగా, ప్రధానంగా ట్రంక్ రోడ్ విస్తరణే కీలకంగా నిలవనుంది. ఈ మేరకు ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు 64 అజెండా అంశాలను సిద్ధం చేయగా, వాటిలో సీసీ రోడ్‌ల నిర్మాణం, సీసీ డ్రైన్‌లు, పార్కుల అభివృద్ధి, శ్మశాన వాటికల్లో సౌకర్యాలు, మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల ఖాళీ భర్తీతోపాటు, పోతురాజు కాలువల ఆధునికీకరణకు ప్రాధాన్యత ఇచ్చారు. కాగా ఈ అంశాలన్నింటికీ గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగే పాలక వర్గ సమావేశంలో ఆ అంశాలన్నింటికీ ఆమోదం లభించనుంది.

రహదారులు విస్తరణ..

ఒంగోలు నగరానికి కార్పొరేషన్ హోదా లభించి సుమారు 14 ఏళ్ళు పూర్తి కావస్తుండగా, అందుకు అనుగుణంగా అవసరమైన మౌలిక సౌకర్యాలు, రహదారులు లేకపోవడంపై కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు నగర హోదాను దృష్టిలో ఉంచుకుని రహదారుల విస్తరణకు శ్రీకారం పలికారు. ఇప్పటికే కర్నూలు రోడ్, సీవీఎన్ సెంటర్ రోడ్, కొత్తపట్నం బస్టాండ్, గోరంట్ల కాంప్లెక్స్ రోడ్ విస్తరణ పనులు జరుగుతుండగా, కొన్ని నెలలుగా ట్రంక్ రోడ్ విస్తరణ ముడిపడటం లేదు. నగర మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగులు విస్తరణకు ప్రతిపాదించడంతో వ్యాపారుల నుంచి అభ్యంతరాలు ఎదురయ్యాయి. ఇదే క్రమంలో సుమారు 70 మంది వ్యాపారులు ఇటీవల కోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కార్పొరేషన్‌కు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రహదారి విస్తరణకు పాలకవర్గం ఆమోదం తెలియజేయనుంది. అలాగే బీఎస్‌హాలు రోడ్ విస్తరణ పనులు ఆమోదం తెలపనున్నారు.

రోడ్‌లు.. డ్రైన్‌లు.. పార్కులు.. గ్రీనరీ..

నగరంలోని పలు డివిజన్‌లలో కొత్తగా సీసీ రోడ్‌లు, మురుగునీరు పాదల వ్యవస్థ మెరుగు కోసం కొత్తగా డ్రైన్‌లు, శ్మశాన వాటికల అభివృద్ధికి, పార్కులలో పచ్చదనం కోసం అవసరమైన పనులను అజెండాలో పొందుపరిచారు. వీటితోపాటు, ఒంగోలులో విలీనమైన గ్రామాలలో కూడా రోడ్‌లు, డ్రైన్‌లకు ప్రాధాన్యత కల్పించారు. ఇదిలా ఉండగా, నగరంలోని ప్రాంతాలలో రోడ్ విస్తరణ క్రమంలో సెంటర్ డివైడర్‌లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య నివారణపైనా దృష్టి సారించారు.

మునిసిపల్ షాపుల లీజులు..

కార్పొరేషన్‌కు ఆదాయ వనరులు పెంపు కోసం మునిసిప్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీలలను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టారు. స్థానిక ఊరచెరువులోని దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో ఖాళీ ఉన్నషాపులను వేలంపాట ద్వారా కేటాయించనుండగా, అమరజీవి షాపింగ్ కాంప్లెక్స్ లీజు గడువు ముగిసినందున తిరిగి స్వాధీనం చేసుకుని మరల వేలం నిర్వహించనున్నారు. అలాగే ఊరచెరువులోని నిరుపయోగంగా ఉన్న స్లాటర్ హౌస్ ప్రస్తుతం శిధిలమైపోయి ఉండగా, తిరిగి బాగు చేసి, వినియోగంలోని తీసుకువచ్చేవిధంగా చర్యలు చేపట్టనున్నారు. కాగా పోతురాజు కాలువ పూడికతీత పనులు చేపట్టడంతోపాటు శివారు కాలనీల్లో అవసరమైన సీసీడ్రైన్‌లకు ప్రాధాన్యత ఇచ్చారు.

రైలులో మరిచిపోయిన బ్యాగ్ అప్పగింత

విజయవాడ(రైల్వేస్టేషన్), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ గవర్నమెంట్ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) గురువారం ఒక ప్రయాణికుడు రైలులో మర్చిపోయిన బ్యాగ్‌ను ట్రేస్ చేసి తిరిగి అతనికి అప్పగించారు. గురువారం ఒంగోలుకు చెందిన రావిపాటి లక్ష్మీనారాయణ (68) బిట్రగుంట నుంచి విజయవాడ వచ్చే ప్యాసింజర్ రైలులో వస్తుండగా రైలు కృష్ణాకెనాల్ వద్ద కొంతసేపు ఆగింది. ఈ లోపల లక్ష్మీనారాయణ రైలు దిగి వాష్ రూమ్‌కు వెళ్లాడు. తిరిగి అతను వచ్చే లోగా సిగ్నల్ పడటంతో రైలు కదిలి వెళ్లిపోయింది. అతని బ్యాగ్ రైలులోనే ఉండిపోయింది. బ్యాగ్‌లో భూమికి సంబంధించిన విలువైన డాక్యుమెంట్లు ఉన్నందున ఆ సమాచారాన్ని విజయవాడ రైల్వే పోలీసు సీఐ రమణకు లక్ష్మీనారాయణ తెలియజేశాడు. సీఐ వెంటనే స్పందించి తన సిబ్బందిని రైలులో వెతికించారు. బ్యాగ్‌ను గుర్తించి లక్ష్మీనారాయణకు తిరిగి అప్పగించారు. విలువైన డాక్యుమెంట్లు లభించినందుకు లక్ష్మీనారాయణ జీఆర్‌పీకి కృతజ్ఞతలు తెలిపారు.

పొదిలిలో తాగునీటికి తిప్పలు

పొదిలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పొదిలి ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మండల ప్రజల అవసరాల కోసం 45 ఏళ్ల కిందట దర్శి ఎన్‌పీ స్టోరేజీ ట్యాంక్ నుంచి పైపులైన్ వేశారు. ప్రస్తుతం పెరిగిన ప్రజలకు సరిపడా నీరు అందడం లేదు. రోజుల తరబడి నీటి సరఫరా కూడా బంద్ అవుతుందన్నారు. శివారు కాలనీల్లో నీటి సరఫరా దారుణంగా ఉంది. 15 రోజులుగా నీటి సరఫరా కాక పోవడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులైన్‌లకు మరమ్మతులు చేసి నీటిని సరఫరా చేయడంతో గురువారం ఎన్‌ఏపీ రక్షిత నీటి కోసం కొళాయిల వద్ద పెద్దఎత్తున ప్రజలు బారులుతీరారు.

మాతృభూమిపై మమకారమే.. మృత్యుపాశమై

● నిత్యం సైకిల్‌పై 10 కి.మీ ప్రయాణించి కాలువలో స్నానం

● విధివక్రించి కొమ్మమూరులో మునిగి మృతి

● కారంచేడు గ్రామంలో విషాదం



హరిప్రసాద్ (ఫైల్)

కారంచేడు (పర్చూరు), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సమీప పట్టణంలో నివసిస్తున్నా.. ఆ వృద్ధుడికి చిన్నతనం నుంచి పుట్టిపెరిగిన ఊరిపై మమకారం తగ్గలేదు. దీంతో నిత్యం 10 కిలోమీటర్లు సైకిల్ తొక్కుకుంటూ స్వగ్రామం వచ్చి ఊరిలోని కొమ్మమూరి కాలువలో స్నానం చేసి వెల్లడం ఆయన దినచర్యలో భాగమైంది. ఇలానే నిత్యం వస్తున్న ఆయన ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రం కారంచేడులో చోటుచేసుకొంది.

గ్రామానికి చెందిన దగ్గుబాటి హరిప్రసాద్ (69) కొంతకాలంగా భార్యతో కలిసి చీరాలలో నివాసం ఉంటున్నారు. ప్రతిరోజూ సైకిల్‌పై 10 కిలోమీటర్లు చీరాల నుంచి కారంచేడు వచ్చేవాడు. కొమ్మమూరు కాలువలో స్నానంచేసి, గ్రామస్తులతో కొంతసేపు ముచ్చటించి తిరిగి చీరాల వెళ్లేవాడు. ఈ క్రమంలోనే గురువారం ఉదయం చీరాల నుంచి కారంచేడు వచ్చాడు. రోజూ మాదిరిగానే కొమ్మమూరు కాలువలో స్నానానికి దిగాడు. అయితే ప్రమాదవశాత్తు నీటి ప్రవాహానికి కాలువలో కొట్టుకుపోయాడు. సమీపంలో ఉన్న వారు గుర్తించి విషయాన్ని గ్రామస్థుల ద్వారా పోలీసులు, రెవెన్యూ సిబ్బందికి తెలియజేశారు. సమాచారం అందుకున్న ఎస్సై షేక్.ఖాదర్‌బాషా, తహసీల్దార్ జి.నాగరాజు హుటాహుటినా సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొన్నారు. స్థానికంగా ఉన్న గజ ఈతగాళ్లతో గాలిచారు. మృతదేహం లభ్యం కాకపోవడంతో చీరాల ఫైర్ సిబ్బందిని ద్వారా కొమ్మమూరు కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు మృతదేహం లభించింది. దీంతో కుటుంబ సభ్యుల సమక్షంలో పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆయన భార్య చీరాల్లో ఉంటుండగా, కుమార్తె, కుమారుడు ఉద్యోగ రీత్యా విదేశాల్లో ఉంటున్నారు. గ్రామానికి చెందిన వృద్ధుడు ఇలా కొమ్మమూరు కాలువలో కొట్టుకుపోయి మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామానికి నిత్యం వస్తూ తమను పలకరించే హరిప్రసాద్ మృతి చెందడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

21న అర్హత పరీక్ష

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం నిర్వహిస్తున్న ఎంబీఏ, ఎంసీఏ అర్హత పరీక్ష ఈనెల 21న స్థానిక గీతం డిగ్రీకాలేజీలో జరుగుతుందని కరస్పాండెంట్ నరసింహారావు తెలిపారు. ఈ పరీక్ష మధ్యాహ్నం 2నుంచి 4 గంటల వరకు జరుగుతుందన్నారు.

ప్రజలు తిరస్కరించినా.. వైసీపీ నేతలకు బుద్ధిరాలేదు!

▸▸ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మీ పాలన వద్దని ప్రజలు తిరస్కరించినా వైసీపీ నేతలకు బుద్ధిరాలేదని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. యూరియాపై అసత్య ప్రచారం చేస్తుందన్నారు. ఈప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం అధికారులు, దుకాణాల యజమానులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులను అందించాలన్నారు. ఇటీవల యూరియాపై జరిగిన అసత్య ప్రచారాలతో రైతులకు అపోహలకు పోయి అవసరానికి మించి కొనేందుకు యత్నిస్తున్నారని ఎరువుల డీలర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా తమ ఇబ్బందులను వివరించారు. ఎరువుల డీలర్ల ఇబ్బందులను కూడా జడ్పీ సమావేశంలో చర్చించి తగిన న్యాయం చేస్తా మని చెప్పారు.

ప్రజాక్షేమం కోసం పరితపించటం అంటే మంత్రి నారా లోకేష్‌ను చూసి జగన్ నేర్చుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర అన్నారు. నేపాల్‌లో చిక్కుఉన్న తెలుగువారిని క్షేమంగా తీసుకొచ్చేందుకు సచివాలయంలో ఉండి చర్యలు తీసుకున్నారన్నారు. ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వారితో వీడియోలో మాట్లాడి ధైర్యం చెప్పారన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో అత్యవసర హెల్ప్‌లైన్ ఏర్పాటుచేసి వారితో మాట్లాడుతూ ధైర్యం చెప్పారన్నారు. కేంద్రం అండతో వారిని సమన్వయ పరుచుకుంటూ నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా స్వస్థలాలకు రప్పించే ఏర్పాట్లు చేశారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారికి ఎలాంటి ఆపద వచ్చినా నిలబడి పరిష్కరించే చంద్రబాబు తనయుడిగా మంచిపేరు తెచ్చుకుంటున్న లోకేష్‌ను చూసి జగన్ నేర్చుకోవాలన్నారు. అసత్య ప్రచారాలు మానుకుని మసులుకుంటే మంచిదన్నారు. సమావేశంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, ఏడీఏ జైనులాబ్దిన్, తహసీల్దార్ రవిశంకర్, టీడీపీ నేతలు సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), కొండా కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

కనిగిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం మరింత తోడ్పాటునిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని గురువాజీపేట హైస్కూల్‌లో నూతనంగా భోజనశాల భవన నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల శాతాన్ని పెంచేలా కృషి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ముచ్చుమూరి చెంచిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో అన్నివసతులు

కనిగిరి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన కూరగాయలను మధ్య దళారీలు లేకుండా నేరుగా వారే అమ్ముకునే వెసులుబాటు కల్పించేందుకు రైతుబజార్‌ను ఏర్పాటుచేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని తీగెలగొందిలో ఏర్పాటు చేసిన రైతుబజార్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రైతుబజార్‌లో అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. త్వరలో ముఖ్యనేతలతో ప్రారంభించినున్నట్లు చెప్పారు. తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న వ్యవసాయశాఖ గిడ్డంగిని పరిశీలించారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, ఏడీఏ జైనులాబ్దిన్, తహసీల్దార్ రవిశంకర్, టీడీపీ మండల అధ్యక్షుడు కొండాకృష్ణారెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

● డీఎస్సీ -2003 ఫోరం డిమాండ్



ఆర్ఐ శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

అద్దంకి, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2003 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డీఎస్సీ -2003 ఫోరం రాష్ట్ర కన్వీనర్ ఎంవీ సుబ్బారెడ్డి కోరారు. రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు తాలూకా కేంద్రమైన అద్దంకిలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్ఐ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడు లేవి ప్రసాద్, ఐతా శ్రీనివాసరావు, ఈమని రజిత పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● డివిజనల్ నూతన అధ్యక్షుడు గోపీకృష్ణ



ఘన సత్కారం అందుకున్న నూతన కమిటీ

చీరాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని నూతన యూనిట్ కమిటీ అధ్యక్షులు గోపీకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఏపీఆర్ఎస్ఏ(ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్) డివిజన్ యూనిట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా అధ్యక్షులుగా చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ, సహాధ్యక్షులుగా వీవీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు వీవీ రాఘవరావు, శివశ్రీను, నారాయణమ్మ, కార్యదర్శిగా సురేష్‌బాబు, జాయింట్ సెక్రటరీగా భాగ్యరాజు, రమేష్, కృష్ణతేజ, కోశాధికారిగా శ్రీనివాసులు, ఈసీ మెంబర్స్‌గా సుజాత, జగదీష్, నిస్సీ దీవెన, డీసీ కౌన్సిల్ ప్రతినిధులుగా ఆదినారాయణ, సాయిరాం ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా శివరామకృష్ణ, ఓంకార్‌లు వ్యవహరించారు. నూతన కమిటీ ప్రతినిధులను ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళ్లు

మార్టూరు, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు ఉద్యమ నేత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం మార్టూరులో సీపీఎం నాయకులు ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కందిమళ్ల రామకోటేశ్వరరావు, ఎనికపాటి రాంబాబు, బోడెంపూడి సూరిబాబు, వీరవల్లి కృష్ణమూర్తి, ఎస్కే ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

'నామ్'కేవాస్తే డ్రైనేజీ

● సైడ్ డ్రైన్లలో నిలుస్తున్న మురుగు ● దుర్వాసనతో దుకాణాలు మూసేస్తున్న వ్యాపారులు





అద్దంకి భవానిసెంటర్‌లో నామ్‌రోడ్డు వెంబడి నిలిచిన మురుగు, రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

అద్దంకి, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో నామ్ రోడ్డు వెంబడి నిర్మించిన సైడ్‌డ్రైన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీంతో మురుగు నీరు ప్రవహించే వీలు లేక దుర్వాసన వస్తోంది. నామ్ రోడ్డు నిర్మాణ సమయంలో వర్షపు నీరు ప్రవహించే విధంగా మాత్రమే సైడ్‌డ్రైన్లు నిర్మించారు. అయితే మున్సిపాలిటీ అధికారులు ఆయా ప్రాంతాలలో ప్రత్యేకంగా సైడ్‌డ్రైన్లు నిర్మించకుండా నామ్ రోడ్డు వెంబడి ఉన్న కాలువల్లోనికే ఆయా ప్రాంతాల నుండి వచ్చే మురుగు నీరు కలిసే విధంగా చేశారు. అయితే నామ్ రోడ్డు వెంబడి ఉన్న సైడ్‌డ్రైన్‌లు అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగు నీరు ప్రవహించడం లేదు. దీంతో రోడ్డు పైకి చేరుతుంది. ప్రధానంగా భవానిసెంటర్‌లో పలుదుకాణాలు, హోటళ్ల నుంచి వచ్చే మురుగు ముందుకు ప్రవహించ కుండా నిలచిపోతోంది. దీంతో దుర్వాసన తట్టుకోలేక ఆ ప్రాంతంలోని పలువురు షాపుల యజమానులు నాలుగురోజులుగా మూసేశారు. అసలే విషజ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో మురుగు నిలిచి ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో వ్యవహరించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రైతుబృందానికి డ్రోన్ పంపిణీ



రైతులకు డ్రోనును అందజేస్తున్న నాయకులు

పంగులూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమంజులూరు గ్రామంలో శ్రీఆంజనేయడ్రోన్‌గ్రూపు రైతులకు గురువారం 80 శాతం రాయితీపై కిసాన్‌డ్రోన్ పంపిణీ చేశారు. ఈ డ్రోన్ పూర్తిఖరీదు రూ. 9.80లక్షలు కాగా రూ.7.80లక్షల రాయితీతో గ్రూపు సభ్యులైన రావుల సాంబశివరావు, రావుల రవిబాబు, ఏసోబు, అజయ్‌బాబు, వెంకటేశ్వర్లుకు వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు చింతలసహదేవుడు డ్రోన్‌ను అందజేశారు. డ్రోన్ వినియోగంతో పంటసాగులో పురుగుమందు ఆదా అవుతుందన్నారు. తక్కువనీటి వినియోగంతో తక్కువ సమయంతో పైరుపై సరైన మోతాదులో పురుగు మందు పిచికారి చేయవచ్చన్నారు. తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్‌తో పాటు కంపెనీ డ్రోగో డ్రోన్ కంపెనీ ప్రతినిధి లీలా, నాయకులు రావుల వెంకటేశ్వర్లు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వర్షబీభత్సం

బల్లికురవ, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో బుధవారం రాత్రి ఈదురు గాలులు భారీ వర్షం కురిసింది. కొమ్మినేనివారిపాలెం గ్రామ కూడలిలోని బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ పక్కనే ఉన్న విద్యుత్ వైర్లపై పడిపోయింది. ఆ సమయంలో ప్రజలు ఎవరు బయట లేక పోవడంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్ తీగలు ఉండడం వలన టవర్ నేలపై పడిపోకుండా అలానే ఉండిపోయింది. విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. గురువారం పడిపోయిన టవర్‌ను బయటకు తీసి విద్యుత్ సరఫరాను ఇచ్చారు. అలానే పలు గ్రామాలో వరినారుమడుల సాగుకు సిద్ధమైన రైతులకు వర్షం వలన జాప్యం జరిగింది. ముక్తేశ్వరం గ్రామంలో వరి నారుమడుల్లోని విత్తనాలను వర్షంతో కుప్పకుప్పలుగా ఒక చోటికి చేరాయి. దీంతో మరోసారి నారు మడులు పెట్టాల్సిందే అని రైతులు అంటున్నారు. ఉక్కపోత ఎండలతో విలవిలలాడుతున్న ప్రజలకు భారీ వర్షం కొంత ఉపశమనం కలిగించింది. సుబాబుల్, పత్తి, పంటలకు వర్షం కొంతమేర ఉపయోగం అని రైతులు పేర్కొంటున్నారు.



ముక్తేశ్వరంలో దెబ్బతిన్న నారుమడులు



విద్యుత్ తీగలపై పడిన టవర్

స్వగ్రామానికి చేరిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి లోకేష్ మృతదేహం

ఈ నెల 4న అమెరికాలో ప్రమాదవశాత్తు మృతి

మార్టూరు, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): అమెరికాలో ప్రమాదవశాత్తు స్విమ్మింగ్‌ఫూల్‌లో పడి మృతిచెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పాటిబండ్ల లోకేష్ (28) మృతదేహం గురువారం ఉదయం మార్టూరుకు చేరింది. ఈ నెల 4న అమెరికాలో లోకేష్ మృతి చెందగా, తానా వారి సహకారంతో విమానంలో హైదరాబాదుకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులు వెళ్లి ప్రత్యేక అంబులెన్స్‌లో మార్టూరు చౌదరికాలనీలోని ఇంటికి తీసుకొచ్చారు. ఉన్నత చదువు కోసం మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లిన లోకేష్ మూడునెలల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించాడు. అయితే న్యూయార్క్ సమీపంలోని బోస్టన్ రాష్ట్రంలో నివసిస్తున్న ప్లాట్ సమీపంలోని ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి మృతిచెందాడు. .లోకేష్ మృతదేహం కోసం స్నేహితులు, కుటుంబసభ్యులు వారం రోజులు ఎదురు చూశారు. గురువారం మృతదేహం రాగానే అందరూ కన్నీటితో విషాదవదనంతో లోకేష్‌కు నివాళి అర్పించారు. అనంతరం పడమర బజారు సమీపంలో ఉన్న శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు.



లోకేష్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

హరిహర గోశాలకు వరిగడ్డి, దాణా వితరణ

అద్దంకిటౌన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో అద్దంకిలోని హరిహర గోశాలకు గురువారం దాతల సహకారంతో వరిగడ్డి, పశువుల దాణాకు నగదు అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు తెలిపారు. పసుమర్తిపాలేనికి చెందిన పసుమర్తి రామారావు మనుమరాలు బారసాల సందర్భంగా, చుండూరి మురళి సుధాకరరావు మిత్రులు, పలువురు రోటరీ క్లబ్ సభ్యుల సహకారంతో రూ.20 వేలతో గోశాలకు వరిగడ్డి, దాణాను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ ఆళహరి హరిప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, చప్పిడి వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.



హైస్కూల్స్‌లో ఇంట్రాక్ట్ క్లబ్‌లు ఏర్పాటు

రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని తిమ్మాయపాలెం, చక్రాయపాలెం జెడ్పీహెచ్ఎస్‌లు కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల జడ్పీహెచ్ఎస్‌లో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులతో ఇంట్రాక్ట్ క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు తెలిపారు. ప్రేమ, స్నేహం, సేవ, సమాజసేవలో భాగం పంచుకోవడానికి, విద్యా కార్యక్రమంలో భాగంగా ఇంట్రాక్ట్ క్లబ్‌లు పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

చినగంజాం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి ఆటల పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు గెలుపు ఓటములు సహజమన్నారు. మండల స్థాయి ఆటలపోటీలలో మండల పరిధిలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాలలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా తదితర పోటీలను నిర్వహించారు. ఆటలలో ప్రతిభ సాటిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు పర్చూరు నియోజకవర్గ స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ గంటా అంకమ్మ తెలిపారు. ఆటలపోటీలు శుక్రవారం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ ముంగర సురేష్‌బాబు, ఆయా పాఠశాలల పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న హెచ్.ఎం.శ్రీనివాసరెడ్డి

బల్లికురవ : మండలంలోని అన్ని పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులతో గురువారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు పలు రకాల ఆటలపోటీలు నిర్వహించనున్నటు వారు తెలిపారు. 12వ తేదీన ముక్తేశ్వరం ఉన్నత పాఠశాలలో అండర్-14, 17 ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. 15వ తేదీన కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో వాలీబాల్, కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఈ సమావేశంలో ఎంఈవోలు కే.శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భోజనశాల నిర్మాణాన్ని వేగవంతం చేయండి

● మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు సూచన



నిర్మాణంలో ఉన్న భోజనశాల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న చైర్మన్

చీరాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలోని భోజనశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. గురువారం కేజీఎం బాలికోన్నత పాఠశాలను చైర్మన్ పరిశీలించారు. చిన్నారులకు భోజనవసతి, తాగునీరు, మరుగుదొడ్లు, తదితరాలపై ఆరా తీశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మధ్యాహ్నం భోజనం వడ్డించి విద్యార్థులను ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఏఈ రవికుమార్, కౌన్సిలర్ రాములు పాల్గొన్నారు.

ఆడపిల్లను ఆనందంగా ఎదగనిద్దాం

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా ఆడపిల్లలను ఆనందంగా ఎదగనిద్దామని అసమానతలు లేని సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరం కృషి చేయాలని సీడీపీవో ఝాన్సీ పేర్కొన్నారు. గురువారం వేటపాలెం ప్రాజెక్టు కార్యాలయంలో 'మిషన్ శక్తి సంకల్పం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, లింగ వివక్షత తదితర అంశాలపై అవగాహన నిర్వహించారు. పీసీపీ ఎన్‌డీటీ చట్టం ప్రయోజనాలను వివరించారు. అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు తాత్కాలిక అంతరాయం

పందిళ్లపల్లి(చీరాల), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ తీగల మరమ్మతుల నేపథ్యంలో మండల పరిధిలో పందిళ్లపల్లి ఆక్వాసాగు, కొత్తరెడ్డిపాలెం, రామచంద్రపురం ప్రాంతాల్లో సరఫరాకు తాత్కాలిక అంతరాయం ఉంటుందని అధికారులు ఒక ప్రకనటలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కోత ఉంటుందన్నారు. పనులు అనంతరం యథావిధిగా సేవలు అందుతాయన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్‌కు గాయాలు

బల్లికురవ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మల్లాయపాలెం సమీపంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మోటార్ బైకుపై వెళ్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. మల్లాయపాలెం గ్రామానికి చెందిన నాగరాజు కూలీ పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో బైకుతో సహా రోడ్డు మార్జిన్‌లో పడిపోయాడు. అటుగా వెళ్తున్నవారు గమనించి 108కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ప్రథమ చికిత్స అనంతరం నర్సరావుపేట ఆసుపత్రికి తరలించారు. నాగరాజు కాలుకు తీవ్రగాయమైంది.

మందుబాబులకు జరిమానా

యద్దనపూడి,(మార్టూరు)సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులకు పర్చూరు న్యాయస్థానం రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఎస్సై టి.రత్నకుమారి తెలిపారు. బుధవారం రాత్రి నిందితులను అరెస్టు చేసి గురువారం కోర్టులో హాజరు పరిచామన్నారు.

చట్టరీత్యా బాల్యవివాహాలు నేరం



బాలికలకు సూచనలు ఇస్తున్న చైల్డ్ ప్రొటెక్షన్ కన్వీనర్ రేణుక

పర్చూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చట్టరీత్య నేరమని బాపట్ల జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కన్వీనర్ బి.రేణుక అన్నారు. గురువారం మండల కేంద్రమైన పర్చూరులోని శ్రీ శాతవాహనా హైస్కూల్‌లో 'బేటీ బచావో, బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా బాలలపరిరక్షణ కమిటీ, అంగన్‌వాడీ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యంలోనే వివాహం చేయడం ద్వారా తల్లి, పుట్టబోయే బిడ్డలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. అనంతరం అంగన్‌వాడీ సూపర్ వైజర్ దీప్తీరాణి కిశోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈకార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలకు బీరువా బహూకరణ

పంగులూరు ,సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ మంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థానిక పీఏసీఎస్ అధ్యక్షులు బత్తుల వెంకటరావు బీరువాను బహూకరించారు. పాఠశాల అవసరాల నిమిత్తం 12వేల విలువైన ఇనుప బీరువాను బత్తుల వెంకట్రావు గురువారం ఉన్నత పాఠశాల హెచ్ఎం ఐ.అనితకు అందజేశారు. తమ పాఠశాల అవసరాలను గుర్తించి విలువైన బీరువాను బహూకరించిన బత్తుల వెంకటరావుకు హెచ్ఎం అనిత, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బీరువాను అందజేస్తున్న వెంకట్రావు

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

మార్టూరు, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను విడుద చేయాలని కోరుతూ ఏపీటీఎఫ్ నిరసనవారం కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ద్రోణాదుల జెడ్పీ హైస్కూల్‌లోని పలువురు ఉపాధ్యాయులు గురువారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు.

ఉన్నత పాఠశాల పీడీకి నేతల ప్రశంసలు



పీడీని సన్మానిస్తున్న గ్రామస్థులు

పంగులూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు యోగాలో ఉత్తమ శిక్షణ ఇస్తూ, రాష్ట్ర, జాతీయ స్థాయిలో చందలూరుకు గుర్తింపు తెచ్చిన ఉన్నత పాఠశాల పీడీ కొండా ప్రతిమను స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు. యోగాపోటీలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ద్వారా గ్రామానికి, విద్యార్థులకు గుర్తింపు తెచ్చారన్నారు. ఈనెల 5 నుండి 7వ తేదీ వరకు ద్వారకా తిరుమలలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీలలో పాఠశాలకు చెందిన లిఖిత, శృతి ప్రథమస్థానంలో నిలిచారు. తద్వారా జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. విశాఖలోప్రపంచ యోగాదినోత్సవంలో పాల్గొనే అవకాశం పాఠశాలకు లభించడంతో ఆమెను వారు ప్రశంసించారు. జిల్లాస్థాయిలో ఉత్తమ పీడీగా గుర్తింపు పొందడాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో హెచ్ఎం గిరిజ, రామలింగస్వామి, వడ్లవల్లి వీరనారాయణ, అడ్డగడ సుబ్బయ్య, మురకొండ సుబ్బారావు, తాతయ్య, సతీష్, రామాంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా

అనంతపురానికి ఆనంద్ బదిలీ



నెల్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నూతన కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా నియమితులయ్యారు. 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన ప్రస్తుతం ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 12 ఏళ్ల సర్వీసులో పలు పోస్టుల్లో పనిచేసిన శుక్లాకు మంచి పరిపాలన అధికారిగా పేరుంది. తొలుత విశాఖ జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా శిక్షణ పొందారు. అనంతరం తిరుపతి సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. తదుపరి గుంటూరు, పశ్చిమ గోదావరి జేసీగా, టూరిజం డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అలానే కోనసీమ జిల్లా కలెక్టర్‌గా కూడా హిమాన్షు శుక్లా పని చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు కలెక్టర్లను గురువారం రాత్రి ప్రభుత్వం బదిలీ చేయగా నెల్లూరు కలెక్టర్‌గా శుక్లా నియమితులయ్యారు. కాగా ప్రస్తుత కలెక్టర్ ఓ ఆనంద్ అనంతపురం కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. గతేడాది జూలైలో జిల్లాకు వచ్చిన ఆనంద్ 14 నెలలపాటు కలెక్టర్‌గా పనిచేశారు. సౌమ్యుడిగా గుర్తింపు తెచ్చుకుని, ఎక్కడా వివాదాలకు తావివ్వలేదు. మంచితనంతో సిబ్బంది చేత పనులు చేయించారు. పీజీఆర్ఎస్ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి, రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ అర్జీలపై ఆడిట్ నిర్వహించిన కలెక్టర్‌గా ఆనంద్ గుర్తింపు తెచ్చుకున్నారు. అలానే రెవెన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు రికార్డులన్నింటినీ డిజిటలైజ్ చేయించి ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను కూడా రూపొందిస్తున్నారు. ఇక 20 ఏళ్లగా భూములు దక్కక కాళ్లరిగేలా తిరుగుతున్న మాజీ సైనికులకు ఉపశమనం కల్పించారు. ఒకేసారి 180 ఎకరాలను స్వాతంత్ర్య దినోత్సవం రోజున మాజీ సైనిక కుటుంబాలకు పంపిణీ చేసి మన్ననలు పొందారు.

ఏపీఎఫ్‌డీసీ ఆర్ఎంగా వివేక్



నెల్లూరు (వెంకటేశ్వరపురం) : ఏపీఎఫ్‌డీసీ ఆర్ఎం (రీజనల్ మేనేజర్)గా ఐఎఫ్ఎస్ అధికారి వివేక్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురు వారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రసుత్తం ఈయన తిరుపతి డీఎఫ్‌వోగా విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని నెలలుగా ఖాళీగా ఉన్న ఆర్ఎం స్థానంలో ప్రభుత్వం ఐఎఫ్ఎస్ అధికారిని నియమించింది.

9,314 గృహాలు ప్రవేశాలకు సిద్ధం

● పూర్తికావస్తున్న ఇళ్లనిర్మాణాలు ● నెరవేరనున్న పేదల కల 7 లో..

సంగం బ్యారేజీ నుంచి నీటి విడుదల

పెన్నాలోకి 3,800 క్యూసెక్కుల నీరు ● పరివాహక ప్రాంతాల్లో అప్రమత్తం

సీజనల్ హాస్టళ్లకు దరఖాస్తుల ఆహ్వానం 8 లో..



జన జాతర

● పోలేరమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తజనం ● విరూపోత్సవంతో ముగిసిన వేడుక

వెంకటగిరి/వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 11: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర జన సంద్రాన్ని తలపించింది. గురువారం ఉదయం 4 గంటలకే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. బుధవారం రాత్రి చాకలింటి నుంచి ఊరేగింపుగా వచ్చిన అమ్మవారిని.. గురువారం వేకువ జామున ఆలయం వద్ద వేపమండలతో వేసిన పందిరిలో కొలువు దీర్చారు. అప్పట్నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. వేయికళ్ల దుత్తల్లో బియ్యపు పిండితో చేసిన ప్రమిదలలో నూనె దీపాలు వెలిగించి భక్తులు నెత్తిన పెట్టుకు వచ్చి నాలుగు కూడల్లో బద్దలు కొట్టారు. మడిచీరలపై ఆసాదుల తప్పెట్ల నడుమ మరికొందరు. నవధాన్య మొలకలను అమ్మవారికి సమర్పించారు. రాజాల ప్యాలస్ నుంచి ఆభరణాలైన బంగారు శూలం, సరుదును రాజా అనుచరుల ఆధ్వర్యంలో అమ్మవారికి అలంకరించి తీసుకెళ్లారు. నగరి సారెలైన సరవళ్లను రాజా అనుచరులు అమ్మవారికి 12గంటలకు సమర్పించారు. దీంతో వెట్టివారు కుండలో వెలిగించిన గండర దీపాన్ని అమ్మవారికి చూపించి దీపం ఆరకుండా ఊరి పొలిమేరల్లోకి తీసుకెళ్లారు. అక్కడ అమ్మవారి బలి దున్నపోతును బలిచ్చి ఆ రక్తంతో పొలికుండల్లోని అన్నంతో కలిపి ఊరి పొలిమేరల్లో పొలి..పొలి అని అరుస్తూ చల్లారు. అనంతరం దీపాన్ని విరూప మండపానికి తీసుకెళ్లారు. దున్నపోతు రక్తంతో తడిచిన కత్తిని అమ్మవారికి చూపాక.. రాజాల ప్యాలెస్‌లో పూలతో అలంకరించిన ట్రక్కులో అమ్మవారి ప్రతిమను సాయంత్రం 4 గంటలకు భక్త జనసందోహం నడుమ ఊరేగించారు. శివాలయం వద్దకు ఊరేగింపు చేరుకోగా, అమ్మవారికి అలంకరించిన ఆభరణాలను తీసేశారు. అనంతరం కైవల్యానది మీదుగా మల్లయ్య తోట వద్ద ఏర్పాటు చేసిన విరూప మండపానికి అమ్మవారు చేరుకోగా, 7.35 గంటలకు ప్రతిమను విరూపం చేసే కార్యక్రమం ముగిసింది. అప్పటి వరకు గండర దీపం ఆరిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అమ్మవారి ప్రతిమ మట్టిని ఇంట ఉంచుకుంటే అష్టైశ్వర్యాలు కలుగుతాయని, తింటే రోగాలు దూరమవుతాయన్నది భక్తుల నమ్మకం. అందుకని మట్టి కోసం భక్తులు పోటీపడటంతో విరూప మండపం వద్ద కొంత ఉద్రిక్తత నెలకొంది. పోలేరమ్మ జాతర రాష్ట్ర పండుగ కావడంతో, ప్రభుత్వం తరపున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి ఆనం, పక్కన ఎమ్మెల్యే కురుగొండ్ల



ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దంపతులు



జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



డీసీఎంఎస్ చైర్మన్ గంగోటి నాగేశ్వరరావు



జమ్మలపాలెంలోని ఎంఐజీ లేఅవుట్

● జమ్మలపాలెం ఎంఐజీ లేఅవుట్ అభివృద్ధిలో లొసుగులు
● ఇటీవల జరిగిన పనులను పరిశీలించిన జేసీ కార్తీక్
● జరిగిన వ్యవహారంపై ఉన్నతాధికారులకు నివేదిక
● కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని, తదుపరి పనులు నుడాకు అప్పగించాలని సిఫారసు

పనులు చేయలేదు.. బిల్లులు మాత్రం బొక్కేశారు!

జలదంకి మండలం జమ్మలపాలెం వద్ద ఉన్న ఎంఐజీ లే అవుట్ ఇది. ఇక్కడ రూ.27.58 కోట్ల పనులు జరిగాయని అంటే ఎవరైనా నమ్ముతారా!?. నిజమండి.. అన్ని కోట్ల పనులు ఇక్కడ పూర్తయి రూ.26.19 కోట్ల బిల్లులు కాంట్రాక్టర్ తీసుకున్నారట. అధికారులు కూడా కళ్లుండి కబోదిలా వ్యవహరించడంతో అక్కడ జరిగిన అవినీతి వెలుగులోకి రాలేదు. కానీ ప్లాట్లు కొనుగోలు చేసిన వారు మాత్రం అధికారులకు ఫిర్యాదు చేయడం, వెనువెంటనే జేసీ కార్తీక్ అధికార యంత్రాంగాన్ని వెంటబెట్టుకుని లే అవుట్‌లో తనిఖీలు చేయడంతో అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది.

కావలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కావలికి సమీపంలోని జమ్మలపాలెం (జలదంకి మండలం) వద్ద ఏర్పాటు చేసిన ఎంఐజీ లేవుట్‌లో సక్రమంగా పనులు జరగలేదని జరిగిన పనుల్లోనూ అక్రమాలు జరిగాయని సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలంటూ నుడా వైస్‌చైర్మన్, జేసీ కార్తీక్ ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారులకు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. గతంలో జగనన్నస్మార్ట్ టౌన్‌షిప్ (ప్రస్తుతం ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్) కోసం జమ్మలపాలెంలో 97.16 ఎకరాలను కేటాయించారు. ఆ లేఅవుట్ డెవలప్‌మెంట్ కోసం రూ.48.58 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఇందులో రూ.33,07,50,730లను పనులకు కేటాయించారు. 2022, సెప్టెంబరు 30వ తేదీ కల్లా పనులు పూర్తి కావాల్సి ఉండగా ఒప్పందాలను పొడిగిస్తూ వచ్చినా ఇప్పటికి 70 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయి. వీటి విలువ రూ.27.58 కోట్లు ఉండగా ఇప్పటికే రూ.26.19 కోట్ల బిల్లులు తీసుకున్నారు. బిల్లు చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగకపోయినా పనులు నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

● ప్లాట్ల యజమానుల ఫిర్యాదుతో..

ఎంఐజీ లేఅవుట్‌లో చెప్పిన ప్రకారం అభివృద్ధి పనులు చేయలేదని కొందరు ప్లాట్ల యజమానులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ పనులను పర్యవేక్షిస్తున్న పబ్లిక్‌హెల్త్ అధికారులతో నుడా అధికారులు సమీక్షించినా మార్పు రాలేదు. దీంతో ఇటీవల నుడా వైస్‌చైర్మన్‌గా ఉన్న జాయింట్ కలెక్టర్ కార్తీక్ కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణతో కలిసి జమ్మలపాలెంలోని ఎంఐజీ లేఅవుట్‌ను పరిశీలించారు. అక్కడ రోడ్లు, డ్రైన్లు, కల్వర్ట్‌లు, ఫుట్‌పాత్, నీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ, సెంట్రల్ డివైండింగ్,లైటింగ్ తదితర పనులు పూర్తికాలేదని వెల్లడైంది. కొన్ని పనులు అసంపూర్తిగా జరగ్గా మరికొన్ని పనులు అసలు ప్రారంభమే కాలేదని నిర్ధారించారు. పనులు నిర్లక్ష్యంగా సాగడం వల్ల కాంట్రాక్టర్ మురళీమోహన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని, మిగిలిన పనులను నుడా ద్వారా పూర్తి చేయాలని నుడా వైస్‌చైర్మన్ ఉన్నతాధికారులకు సిఫారసు చేశారు.



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్ తదితరులు(ఫైల్)

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ ఎక్కడ!?

శ్రీలంకలోనా... బెంగళూరులోనా!? ● కావలిలో విస్తృత చర్చ

కావలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కావలి ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డిపై హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆచూకీ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. జలదంకి పోలీస్‌స్టేషన్‌లో ప్రతాప్‌తోపాటు మరో నలుగురిపై కేసు నమోదయ్యింది. వీరిలో ముగ్గురు అరెస్టయి రిమాండ్‌లో ఉండగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మరో నిందితుడు రాజేష్ పరారీలో ఉన్నారు. ప్రతాప్‌రెడ్డిని అరెస్ట్ చేసేందుకు పోలీస్‌లు రెండు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా గాలిస్తున్నారు. అయితే, ఆయన శ్రీలంకకు వెళ్లి ఉంటారని పోలీసులు కోర్టులో తెలిపినట్లు సమాచారం. వాస్తవంగా ప్రతాప్‌రెడ్డి ఎక్కడ ఉన్నారనేది కావలిలో పెద్ద చర్చనీయాంశమైంది. బెంగళూరులో ప్రతాప్‌కు రాజకీయ పలుకుబడి ఉండటంతో అక్కడే ఉండవచ్చని అనుచరుల్లో చర్చ నడుస్తోంది. మరోవైపు ప్రతాప్ మొబైల్ స్విచ్ఛాఫ్ ఉండటంతో ఎక్కడ ఉన్నాడో గుర్తించలేక పోతున్నామని పోలీసులు అంటున్నారు.

రెండో విడతలోనూ నిరాశే!

● 32 బార్లకు ఐదింటికే దరఖాస్తులు

నెల్లూరు (క్రైం) : నూతన బార్ పాలసీ ప్రభావం వ్యాపారులపై కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మొదటి విడత లో 55 బార్లకు గెజిట్ విడుదలవగా, 17 బార్లకు మాత్రమే దరఖాస్తులు అందాయి. మిగిలిన 32 బార్లు మూతపడ్డాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మరోమారు నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండో విడతలోనూ 5బార్లకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. 27 బార్లకు దరఖాస్తులు అందలేదు. ఈ నెల 14న దర ఖాస్తులకు గడువు ముగియనుండగా, 15న లాటరీ విధానంలో యజమానులకు బార్‌లు కేటాయించనున్నారు. ఇప్పటివరకు అయితే ఎక్సైజ్ అధికారులు చివరిరోజు అంటే ఆదివారంపైనే ఆశలు పెట్టుకుని ఉన్నారు.



వెల్లంటిలో వరి పొలంలో వర్షపు నీరు

అల్పపీడన ప్రభావంతో బుధవారం కురిసిన వర్షం కారణంగా కోతకు సిద్ధమైన వరిపైరు ఆందోళనకరంగా మారింది. నెల్లూరురూరల్ మండలం సౌత్ మోపూరు, కొత్తవెల్లంటి, పాతవెల్లంటి, సజ్జాపురం ప్రాంతాలలో కేఎన్ఎం 1638, ఎంటీయూ 1010 రకం వరి కోతకు సిద్ధమైంది. ఆశించిన మేర దిగుబడులు చేతికందుతాయనుకున్న అన్నదాత ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. కురిసిన వర్షానికి పైరు నేలవాలగా, ధాన్యం గింజలు తడవడంతో అన్నదాత ఆందోళనకు గురవుతున్నాడు. - నెల్లూరు రూరల్

ఇటు కోతలు.. అటు వానలు

అన్నదాతను భయపెడుతున్న వరుణుడు

నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి) : ఓ పక్క వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న సమయంలో అన్నదాతను వరుణుడు భయపెడుతున్నాడు. ఖరీఫ్ సీజనుకు సంబంధించి విడవలూరు, కొడవలూరు, బుచ్చి, ఇందుకూరుపేట, బోగోలు, అల్లూరు మండలాల్లో కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అధికశాతం రైతులు వరికోత యంత్రాలతో కోయడం వల్ల ధాన్యాన్ని ట్రాక్టర్లతో తీసుకెళ్లి రోడ్లపై ఆరబెట్టుకుంటున్నారు. కొంతమంది రైతులు మాత్రం వచ్చిన ధరకు దళారులను ఆశ్రయిస్తున్నారు. కొంతమేర అవసరాన్ని బట్టి ప్లాస్టిక్ పట్టలను ముందు జాగ్రత్తగా ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే పంట కోతకు వచ్చిన రైతుల్లో మాత్రం తీవ్ర ఆందోళనలు నెలకొంటున్నాయి. ఎప్పుడు వర్షం కురుస్తుందో తెలియని పరిస్థితులు నెలకొనడంతో పంట కోయాలా!? వద్దా అనే సందిగ్ధం నెలకొంది. కొద్దిపాటి వర్షం పడితే పర్వాలేదు కానీ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిస్తే మాత్రం గింజలు బాగా తడిచిపోయి పైరు వాలిపోయే పరిస్థితి ఉంటుంది. ఒకవేళ పంట కోస్తే నిల్వ చేసుకునే సౌకర్యాలు కూడా అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఒత్తిడితో అన్నదాతలు ఉంటున్నారు. మరికొంత మంది రైతులు మాత్రం దళారులను ఆశ్రయించి, అందిన ధరకు విక్రయించేస్తున్నారు. జిల్లాలో బుధవారం కురిసిన వర్షం కారణంగా ఎక్కడా ఎలాంటి పంట నష్టం జరగలేదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఒక పూట వర్షం పడినప్పటికి మరుసటి రోజు ఎండ రావడం వల్ల పంటకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, కోసిన ధాన్యం మాత్రం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అయితే, సాయంత్రం నుంచి మేఘావృత్తం కావడం, చల్లటి గాలులు వీయడంతో ఏంచేయాలో తెలియక కోసిన ధాన్యాన్ని దళారులకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	242
స్కిన్‌లెస్	266
కోడిగుడ్ల ధర (100):	550

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ

ఉలవపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉలవపాడులోని శాఖ గ్రంథాల యాన్ని ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జీవీ శివారెడ్డి గురు వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాలనా సంబంధమైన రికార్డులు, పుస్తక సంప ద, చిన్నారులకు ఆకర్షణీయమైన పుస్తకాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్త కాలను పరిశీంచి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాయలాభివృద్ధిలో భాగంగా ఎంపిక చేసిన ప్రతి కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. సెస్ కూడా సకాలంలో వసూలయ్యేలా చూడాలని గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావుకు సూచించారు.





రాళ్లపాడు ప్రాజెక్టు కట్టకు ఇరువైపులా

చిల్లచెట్ల తొలగింపు ప్రారంభం

లింగసముద్రం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు కట్టకు ఇరువైపులా దట్టంగా ఉన్న చిల్లచెట్లను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. వారం రోజులుగా సుమారు 3 కి.మీ పొడవున కట్టకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను కూలీలు తొలగించారు. ప్రభుత్వం గతంలో ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువ కట్టల రోడ్డు, ప్రాజెక్టు కట్టకు ఉన్న చిల్లచెట్ల తొలగింపునకు రూ.75 లక్షలు మంజూరు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ నిధులలో రూ.72.30 లక్షలు రోడ్ల వెడల్పుకు కేటాయించగా, రూ.2.70 లక్షలు చిల్లచెట్ల తొలగింపునకు కేటాయించారు. ప్రాజెక్టు డీఈ ఎం వేంటకేశ్వర్లు ఆధ్వర్యంలో గుత్తేదారు ఈ పనులు చేయిస్తు న్నారు. కట్ట లోపల చెట్ల తొలగింపు కార్యక్రమం 10 రోజులలో పూర్తవుతుందని, నెలన్నర వ్యవధిలో చెట్ల తొలగింపు ప్రక్రియ పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.



చెత్త సంపద తయారీ కేంద్ర నిర్మాణం

అర్ధంతరంగా ఆగిపోయిన పనులు

లింగసముద్రం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నెబోయినపల్లిలో ఏడేండ్ల నుండి చెత్త సంపద తయారీ కేంద్రం పిల్లర్ల దశలోనే ఆగిపోయింది. దీంతో ఈ గ్రామానికి పంపిణీ చేసిన చెత్తను తరలించే రిక్షాలు నిరుపయోగంగా మారాయి. ఎండావానకు తుప్పుపట్టి పోతున్నాయి. 2018లో సుమారు రూ.6 లక్షలతో ఈ చెత్త సంపద తయారీ కేంద్రం నిర్మాణ పనులు చేపట్టారు. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ కేంద్రాలను గురించి పట్టించుకోలేదు. రాష్ట్రప్రభుత్వం సుమారు 6 నెలల క్రితం పనులు పూర్తి చేసేందుకు సుమారు రూ. 9 లక్షలు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది. నిధులు మంజూరైతే నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.



హైవేపై ట్రాన్స్‌పోర్టు లారీ బోల్తా

● డ్రైవర్‌కి గాయాలు

కావలి రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి ఢిల్లీకి వెళ్తున్న వీఆర్‌ఎల్ ట్రాన్స్‌పోర్టు లారీ గురువారం తెల్లవారుజామున బోల్తా పడింది. కావలి పట్టణం వెంగయ్య గారిపాలెం క్రాస్ రోడ్డు సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై బ్రేక్‌డౌన్‌తో ఆగి ఉన్న లారీని వెనుక వైపు వీఆర్‌ఎల్ లారీ ఢీకొని అదుపుతప్పి వంతెన పైనుంచి కింద ఉన్న సర్వీస్ రోడ్డులోకి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆ లారీకి డ్రైవర్‌గా పనిచేస్తున్న రాజస్థాన్‌కు చెందిన షౌకత్ అలీకి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

న్యూస్ బాక్స్

జమ్మలపాలెంలో రీసర్వేపై గ్రామసభ



రీసర్వే వివరాలు వెల్లడిస్తున్న మండల సర్వేయర్ శోభన్

జలదంకి, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలపాలెంలో గురువారం సర్పంచ్ బుర్రి శ్రీవేణి అధ్యక్షతన గ్రామ సచివాలయంలో రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ఈసభలో ముసాయిదా భూమి రిజిష్టర్ (డిఎల్‌ఆర్)ను ప్రదర్శించారు. ముసాయిదా వివరాలను సర్వేయరు శోభన్ గ్రామసభకు హాజరైన రైతులకు వివరించారు. భూయజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను సచివాలయంలో అందుబాటులో ఉన్న రికార్డులను సరిచూసుకుని తప్పులు ఉంటే సవరించుకోవాలని డిటి జూలియాభాయ్ తెలిపారు. ఈ గ్రామసభలో భూయజమానులుతో పాటు వీఆర్వో మధు, గ్రామ సర్వేయరు క్రిష్టారెడ్డి, విఆర్ఎలు పాల్గొన్నారు.

రేపు మెగా లోక్ అదాలత్

అల్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కావలిలో శనివారం జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని లోక్ అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి గురువారం ఓ ప్రకటనలో కోరారు. పెండింగ్ కేసులు, అపరిష్కృత కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని కోరారు. కలిగిరి, కొండాపురం, జలదంకి, కావలి, బోగోలు మండలాలకు చెందిన కక్షిదారులు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● బంగారు, వెండి అపహరణ

కావలి రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కావలి మండలం ఆముదాలదిన్నె పంచాయతీ దూదేకులపాలెంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు బాధితుడు దాసరి పవన్‌కుమార్ గురువారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి వివరాల మేరకు... పవన్‌కుమార్ అలియాస్ పవన్‌స్వామి అన్నగారిపాలెం పంచాయతీ పూలదొరువులో శ్రీ నిలయం దేవస్థానం నిర్వహిస్తూ ఆముదాలదిన్నె పంచాయతీ దూదేకులపాలెంలో నివాసం ఉంటున్నాడు. గ్రామంలో అతనివద్ద గతం లో పనిచేసిన వారితో విభేదాలు ఉండటంతో గత 6 నెలలుగా పవన్‌కుమార్ దూదేకులపాలెంలోని ఇంటికి తాళం వేసి కావలిలో ఉన్న మరో ఇంట్లో, ఆశ్రమంలో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 9వ తేదీ రాత్రి ఇంటి గేటు తాళం పగలగొట్టి తలుపు తీసి ఉందని ఆముదాలదిన్నెకు చెందిన కొందరు తెలపటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంఘటనా స్థలానికి పోలీసులతో పాటు బాధితుడి భార్య రజని వెళ్లి పరిశీలించగా పూజ గదిలో ఉన్న అమ్మవారి బంగారు విగ్రహం, కబోర్డు లోని లాకర్‌లో ఉంచిన అమ్మవారి వెండి కవచాలు, బంగారు వస్తువులు దొంగిలించుకుపోయారు. వాటితో పాటు అతని వద్ద అప్పుతీసుకుని రాసిచ్చిన రూ. 47 లక్షలకు సంబంధించిన ప్రామిసరీ నోట్లు, చెక్కులు, డాక్యుమెంట్లు, టీవీ, వంట సామగ్రీ చోరీ చేసినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



స్థానికులను విచారిస్తున్న ఎస్ఐ తిరుమలరెడ్డి

కరేడు అభివృద్ధికి కట్టుబడి ఉన్నా... : ఎమ్మెల్యే ఇంటూరి

ఉలవపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కరేడు పంచాయతీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని కందుకూరు శాసనసభ్యుడు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. గురువారం కరేడు పంచాయతీ పరిధిలోని బట్టియసోమయ్యపాలెంలో రూ.10 లక్షలు, అలగాయపాలెంలోని రెడ్డిపాలెంలో రూ.15 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటికే రూ. 2 కోట్లతో తారు రోడ్డు, నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఎంపీ వేమిరెడ్డి కోటాలో కేటాయించిన నిధులతో ఇప్పటికే సిమెంట్ రోడ్లు పూర్తి చేశామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తున్నారని, సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాడని కొనియాడారు. ఎమ్మెల్యేకి గ్రామస్తులు ఘనస్వాగతం పలకగా, రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు, గ్రామపార్టీ అధ్యక్షుడు ఆదాం, నాయకులు పోలుపోయిన శ్రీనివాసులు, మెట్టా శ్రీనివాసులు రెడ్డి, జెట్టి సుబ్బరామిరెడ్డి, వాయల జాలమ్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో

32 కుటుంబాలు టీడీపీలో చేరిక

కందుకూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురం వడ్డెపాలెంకు చెందిన 32 కుటుంబాలవారు గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామ టీడీపీ నాయకులు బక్కమంతుల మాల్యాద్రి, చెంచు శ్రీనివాసులు, పంది లక్ష్మీనారాయణ, బత్తుల సైదులు తదితరుల ఆధ్వర్యంలో వడ్డెపాలెంవాసులు కందుకూరు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిశారు. వారందరినీ ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బత్తుల రమణయ్య, రాము, బండారు సీతారాములు, బండారు బ్రహ్మయ్య, బత్తుల వెంకటరత్నం, తమ్మిశెట్టి మాలకొండయ్య, బండారు శ్రీను, శేషగిరి, వెంకటేశ్వర్లు, వెంకటరామయ్య, ప్రసాద్, కొండయ్య, చినరాములు, సూర్యనారాయణ, కుంచాల శ్రీను, అంకమ్మరావు, బండారు చినవెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి రమణయ్య తదితర 32 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ప్రజలు విసిగిపోయారని, అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని నమ్ముతున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజాసంక్షేమానికి తాను ఎల్లప్పుడూ కట్టుబడిఉంటానన్నారు. పార్టీలో కొత్తగా చేరిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై, ఆయన నాయకత్వంపై నమ్మకంతో తెలుగుదేశం పార్టీలో చేరామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు ప్రగడ తిరుపాలు, ప్రగడ అనంతయ్య, పంది మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిన అంకభూపాలపురం వడ్డెపాలెం వాసులు

9,314 గృహాలు ప్రవేశాలకు సిద్ధం

● పూర్తికావస్తున్న ఇళ్లనిర్మాణాలు ● నెరవేరనున్న పేదల కల

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిరుపేదల సొంతింటి కల నెరవేరనుంది. వైసీపీ హయాంలో కేవలం ఆర్భాటాలకే పరిమితమై, నిర్లక్ష్యానికి గురైన గృహ నిర్మాణం గత ఏడాదిన్నర కాలంగా వేగం పుంజుకుంది. దీంతో ప్రభుత్వం ఎప్పుడు ముహూర్తం ఖరారుచేస్తే అప్పుడు లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 82,422 గృహాలను గత ప్రభుత్వంలో మంజూరవగా, 26వేలకుపైగా గృహాలను అప్పట్లో పూర్తిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత పాలనలో జరిగిన పక్కాగృహాలలో అవినీతి, అక్రమాలను వెలికి తీయడంతోపాటు మంజూరైన గృహాలను త్వరితగతిన పూర్తిచేసి పేదలకు అందించేందుకు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి జిల్లాలో పర్యటించి పక్కాగృహాల నిర్మాణాలపై అధికారులతో సమీక్షించారు. నాణ్యంగా ఇళ్లను నిర్మించి పేదలకు అందించాలని సూచించారు. రానున్న దసరాకు లేదా జనవరిలో తొలివిడత గృహప్రవేశాలు చేపట్టాలని జిల్లా అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించారు. మంత్రి ఆదేశాలతో అధికారుల్లో కదలిక మొదలై గృహ నిర్మాణాల్లో వేగం పెంచారు. శ్లాబ్‌లను పూర్తిచేసుకుని 9,314 ఇళ్లకు అన్ని పనులు పూర్తికావస్తున్నాయి. దీంతో ప్రభుత్వం ఎప్పుడు మహూర్తం నిర్ణయించినా లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.



వెంకటాచలంలో పూర్తయిన పక్కాగృహాలు

నియోజకవర్గం	ఇళ్లు
కావలి	1,599
సర్వేపల్లి	1,538
ఉదయగిరి	1509
ఆత్మకూరు	1,327
కోవూరు	1,086
కందుకూరు	908
నెల్లూరు రూరల్	409
నెల్లూరు సిటీ	270
వెంకటగిరి	668
మొత్తం	9,314

చీకటి జీవో రద్దు చేయాలి : పీడీఎస్‌యూ

కావలి (టౌన్) సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) చీకటి జీవో రద్దు చేయాలని పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు సునీల్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణం జనతాపేటలో చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రిక ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం 12వ తేదీన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టామని, విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వమొచ్చి 15నెలలు అయినప్పటికీ విద్యారంగ సమస్యలు పరిష్కారం కాలేదని, విద్యాశాఖా మంత్రి లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు వెంటనే అమలుచేసి మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇంతవరకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ ఒక్క రూపాయి విడుదల చేయలేదని, కళాశాల యాజమాన్యాలు ఫీజులు కడితేనే పరీక్షల ఫీజు కట్టించుకుంటామని విద్యార్థులను వేధిస్తున్నారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు కావలి ఇన్‌చార్జ్ శ్రావణ్, శ్రీను, హర్షిత్, వంశీ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ అధ్యక్షుడు సునీల్ తదితరులు

బాలికపై అత్యాచారం

● సచివాలయ ఉద్యోగిపై కేసు నమోదు

ఉలవపాడు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో పిల్లల ఆలనాపాలన చూస్తున్న మైనర్ బాలికపై కామవాంఛ తీర్చుకున్న ఓ సచివాలయ ఉద్యోగిపై పోక్సోతోపాటు పలు సెక్షన్ల కింద గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు. ఇందుకూరుపేట మండలం, మైపాడు సమీపంలోని కోడూరుకు చెందిన తొమ్మిదేళ్ల బాలికను తల్లిదండ్రులు కావలి సమీపంలోని ఏనుగుల బావి గ్రామానికి చెందిన కొండయ్యకు నాలుగేళ్ల క్రితం కూలి పనులు చేయడానికి అప్పగించారు. అప్పటి నుంచి బాలిక తల్లిదండ్రులు కొండయ్య వద్ద నుంచి ప్రతిఏటా కొంత డబ్బు తీసుకునేవారు. బాలికతో బాతుల సంరక్షణతో పాటు ఇంట్లో పనులు చేయిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో ఉలవపాడులో కాపురం ఉంటున్న తన కూతురు ఇంటికి పిల్లల ఆలనాపాలన చూసేందుకు కొండయ్య గత ఏడాది ఆ బాలికను పంపించాడు. ప్రస్తుతం ఆ బాలికకు 13 ఏళ్లు. కొండయ్య అల్లుడు పొట్టిరాజు (రామకృష్ణ) సింగరాయకొండ సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. అయితే పొట్టిరాజు సదరు బాలికపై గత 20 రోజుల వ్యవధిలో 3 సార్లు అత్యాచారం చేశాడు. దీంతో భయభ్రాంతులకు గురైన బాలిక ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. చాగొల్లు పరిసర ప్రాంతంలో తిరుగుతుండగా కోటేశ్వరమ్మ అనే మహిళ గమనించి బాలిక వివరాలు కనుక్కుని పోలీసులకు అప్పగించింది. జరిగిన ఘటనను బాలిక విచారణాధికారులకు వివరించింది. బాలిక ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కొండయ్య, అతని భార్య, పొట్టిరాజు, అతని భార్య, బాలిక తల్లిదండ్రులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బాలికను కొడవలూరు మండలం నార్తురాజుపాలెంలోని విశ్వజనని బాలికల ఆశ్రమానికి పంపించారు.

● కందుకూరు సబ్ కలెక్టరుతో ఉప్పరపాలెం దళితులు

మా భూములు ఇవ్వం..

మా గ్రామాన్ని ఖాళీచేయం

కందుకూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : 'కరేడులో ఇండోసోల్ సోలార్ కంపెనీకి భూములు ఇవ్వము. గ్రామాన్ని ఖాళీ చేయబోమని కరేడు ఉప్పరపాలెం దళితులు కందుకూరు సబ్ కలెక్టరు దామెర హిమవంశీకి స్పష్టంచేశారు. కాలనీవాసులు, మహిళలు గురువారం కందుకూరులో సబ్ కలెక్టరును కలిసి తమ గోడు వినిపించారు. జూలై 4న కరేడులో జరిగిన గ్రామసభలో చేసిన తీర్మానాన్ని అమలు చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి ప్రతి ఇల్లు తిరిగి వివరాలు సేకరిస్తూ బలవంతంగా సంతకాలు తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. అలాగే, 30 పోలీసుయాక్టును ఎత్తివేయాలని, తమకు మద్దతుగా ఆందోళనలు చేసిన ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ అందరి ఆమోదంతోనే ఇళ్లు, భూములను తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పరపాలెంకు చెందిన గంజి చినకోటేశ్వరరావు, ప్రసాద్, అహిషేక్, శ్రీను, కొట్టే మాల కొండయ్య, రామకృష్ణాపురం గిరిజనులు కత్తి కొండమ్మ, యేసురాణి, సురేంద్ర, శిరీష, అర్చన, ప్రజాసంఘాల నాయకులు జీవీబీ కుమార్, వెంకటేశ్వర్లు, వీసం విజయ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఉప్పరపాలెం దళితులు

టెన్నిస్ టోర్నమెంట్

విజేతలకు బహుమతులు



ట్రోఫీ అందుకుంటున్న విద్యుత్ శాఖ ఏఈ పీసీ జడరాయ

బిట్రగుంట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): టెన్నిస్ టోర్నమెంట్‌లో బోగోలు మండల విద్యుత్ శాఖ ఏఈ పీసీ జడరాయ, కొండాపురం లైన్‌మెన్ ఎన్ శ్రీనివాసులురెడ్డి విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు. ఏపీ ఎలక్ట్రిసిటి కార్పొరేషన్ గుంటూరులో ఈనెల 9వ తేదీ నుంచి 11 వరకు టెన్నిస్, బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. నెల్లూరు సర్కిల్ టెన్నిస్ జట్టు నుంచి జడరాయ, శ్రీనివాసులు పోటీలో ప్రత్యర్థులతో తలపడి ద్వితీయ స్థానం సాధించారు. అలాగే ఓపెన్ సింగిల్ కేటగిరిలో నెల్లూరు నుంచి పీసీ.జడరాయ, గుంటూరు నుంచి మహేష్ జాయింట్ విన్నర్స్‌గా నిలిచారు. విజేతలు సీపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పీ.పుల్లారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల్లో 'శ్రీగాయత్రి' ప్రతిభ

కందుకూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల్లో శ్రీగాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు చక్కటి ఫలితాలు సాధించారని కాలేజీ కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ(ఏఐ)లో వల్లెపు నాగలక్ష్మి 94 శాతంతో కాలేజీఫస్ట్‌గా నిలవగా బీసీఏ (కంప్యూటర్ సైన్స్)లో యుఎస్‌వీపీ సువర్షిణి 92 శాతం మార్కులతో కాలేజీ ఫస్ట్ సాధించిందని తెలిపారు. విద్యార్థినీవిద్యార్థులను కళాశాల డైరెక్టర్ భరద్వాజ్, ప్రిన్సిపాల్ పీ గీతా శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.

ఎన్‌సీసీ కేడెట్లకు సర్టిఫికెట్ల ప్రదానం

కావలి(టౌన్), సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాతూరులో మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం ఎన్సీసీ కేడెట్లకు ఎ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని శారద, ఎన్‌సీసీ అధికారి మస్తాన్‌వలి, హవల్దార్ లక్ష్మణ్‌లు కేడెట్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందించారు. ప్రధానోపాధ్యాయిని సుజాత మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు దేశభక్తి, జాతీయవాదం, క్రమశిక్షణ ఎంతైనా అవసరమని, ఎన్సీసీతో సాధ్యమన్నారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ ఎ సర్టిఫికెట్లతో ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందేందుకు, ఉన్నత విద్య, ఉద్యోగాలు పొందేందుకు అవకాశముందన్నారు.



ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్లు సాధించిన కేడెట్లు, పక్కన ప్రధోపాధ్యాయిని ఉపాధ్యాయులు

సమస్యలు పరిష్కరించకపోతే నిరసన

● ఎంపీడీవోకు సచివాలయ సిబ్బంది వినతి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని సచివాలయ సిబ్బంది తెలిపారు. వలేటివారిపాలెం ఎంపీడీఓ నరేంద్రదేవ్‌కు గురువారం మండల సచివాలయ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఇంటింటి సర్వేల నుండి విముక్తి కలిగించాలని తెలిపారు. సమయపాలనకు సంబంధించి నిబంధనలు సడలించాలని కోరారు. సెలవులు, పండుగలతో పాటు, ఆదివారం కూడా విధులు నిర్వర్తించాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని సచివాలయ సిబ్బంది కోరుతున్నారు.



ఎంపీడీవో నరేంద్రదేవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ సిబ్బంది



చెరువును తలపిస్తున్న ఇంద్రలోక్ అవెన్యూ ప్రాంతం

ఇంద్రలోక అవె'న్యూసెన్స్'!

ఇది చెరువు కాదు... ఏకంగా ఇంద్రుడిలోకం పేరుతో ఏర్పాటు చేసుకున్న కాలనీ. కోవూరు పంచాయతీ పరిధిలో బహుళ అంతస్థుల భవనాలతో కనిపించే 'ఇంద్రలోక అవెన్యూ'. ఈ కాలనీ మధ్యభాగంలో చెరువు తలపించే విధంగా గుంతలు ఏర్పాడ్డాయి. అడవిని తలపించేలా పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో కాలనీ పరిస్థితి 'పేరు గొప్ప - ఊరు దిబ్బ ' అన్న చందంగా మారింది. ఇంద్రలోక అవెన్యూలో దోమలు విలయతాండవం చేస్తున్నాయి. చిన్నారులు చాలా మంది జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)

సంగం బ్యారేజీ నుంచి నీటి విడుదల

- పెన్నాలోకి 3800 క్యూసెక్కుల నీరు

సంగం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సంగం బ్యారేజీ నుంచి పెన్నా నదికి గురువారం నీటిని విడుదల చేశారు. సోమశిల జలాశయం నుంచి ఈ బ్యారేజీకి 1600 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది. దీంతోపాటు ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షం వల్ల వాగులు, వంకలు ప్రవహించడంతో బ్యారేజీకి 2200 క్యూసెక్కుల నీరు వస్తోంది. మొత్తం 3800 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో బ్యారేజి వద్ద నీటిమట్టం 11.3 అడుగుల నుంచి 11.8 అడుగులకు పెరిగింది. ఈ నీటిని బెజవాడ పాపిరెడ్డి (కావలి) కాలువకు 740 క్యూసెక్కులు, కనుపూరు కాలువకు 250, నెల్లూరు చెరువు కాలువకు 50, నెల్లూరు తాగునీటి పథకానికి 40 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. మిగిలిన నీటిని బ్యారేజి దిగువ పెన్నానదికి 2800 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఈ నీటివిడుదల ఇంకా పెరిగే అవకాశం ఉంది.

● ఎవరూ నదిలోకి వెళ్లొద్దు!

సంగం బ్యారేజీ నుంచి పెన్నానదికి (నెల్లూరు బ్యారేజీ) నీరు విడుదల చేస్తుండటంతో పెన్నా పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రధానంగా సంగం మండలంలోని పల్లిపాళెం, కోలగట్ల, వీర్లగుడిపాడు, పడమటిపాళెం, మక్తాపురం, అన్నారెడ్డిపాళెం పల్లిపాళెం గ్రామస్థులు, పశువుల కాపరులు నదిలోకి పశువులను మేతకు తీసుకపోవద్దని తహసీల్దారు సోమ్లానాయక్, సంగం ఇరిగేషన్ సెక్షన్ ఏఈ వినయ్ కుమార్ తెలిపారు.



సంగం బ్యారేజీలో నీరు

● సోమశిలలో 71.430 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం 18,967 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. దీంతో డ్యాంలో 71.430 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, దిగువ డెల్టాకు 1,850, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 9,250 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● అధికారుల సమావేశం

సోమశిలలో నీటిమట్టం 74 టీఎంసీలకు చేరుకున్నాక నీరు విడుదల చేసే అవకాశం ఉందని, తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనంతసాగరం తహసీల్దారు జయవర్ధన్ ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని పెన్నాతీర గ్రామాల ప్రజలు జాగ్రత్తలు తీసుకొనే విధంగా రెవెన్యూ సిబ్బందితో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.


ఆయనో తెలుగు మాస్టారు. కవి, కళాకారుడు, చిత్రకారుడు కూడా. ఓ పక్క పిల్లలకు తెలుగు పాఠాలు, పద్యాలు, వ్యాకరణం బోధిస్తూనే, మరోవైపు కళాకారు డిగా రాణిస్తున్నారు. ఆయనకు రావి ఆకు అంటే ఎంతో ఇష్టం. దానిపై ఎన్నో కళారూపాలను ఆవిష్కరించారు. ఒక్క రావి ఆకే కాదు.. చాక్‌పీస్‌లు, పెన్సిళ్లు, బల్బులు, అట్టముక్కలు, పండ్లు, తినే పదార్థాలు... పడేసే వ్యర్థాలు... ఇలా అన్నింటితో సూక్ష్మరూపాలు సృష్టిస్తారు. అంతటితో ఆగిపోకుండా తాను ప్రావీణ్యం సంపాదించిన కళను పాఠశాల విద్యార్థులకు నేర్పుతున్నారు. ప్రతి పండుగ, ప్రముఖుల జయంతి, వర్ధంతులకు 'కళా'త్మకంగా జరపడం వారి ప్రత్యేకత. ఆయనే మనుబోలు మండలం వీరంపల్లి ఉన్నత పాఠశాల తెలుగు పండిట్ సోమా పద్మారత్నం.



రావి ఆకులపై ఎన్ని సిత్రాలో..

సూక్ష్మచిత్ర రత్నం

- కళాకారుడిగా రాణిస్తున్న తెలుగు పండిట్
- ఆకులపై వందల రూపాలు
- వ్యర్థాలతోనూ కళాఖండాలు
- ప్రముఖుల ప్రశంసలు.. పురస్కారాలు



మనుబోలు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సూక్ష్మకళాకారుడు పద్మారత్న అసలు పేరు సోమా వెంకటరత్నం. తల్లిదండ్రులు సోమా శ్రీరాములు, కాంతమ్మ. స్వస్థలం ముత్తుకూరు మండలంలోని సుబ్బారెడ్డిపాళెం. ఎంఏ. బీఈడీ, తెలుగు పండిట్ చదివారు. భార్య పేరు పద్మారాణి. రత్నం కళ ప్రతిభను ఆమె ప్రోత్సహిస్తూ సూచనలు, సలహాలు ఇస్తుంటారు. దీంతో వెంకటరత్నం. తన కళానామాన్ని పద్మారత్నంగా మార్చుకున్నారు. ఆయన చదువుకునే రోజుల్లోనే డ్రాయింగ్ వేసేవాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు అయ్యాక అటు ఉత్తమ టీచరుగా, ఇటు సృజనాత్మక కళాకారుడిగా రాణిస్తున్నారు.



సత్కారం అందుకుంటున్న పద్మారత్నం (ఫైల్)

9 ఏళ్లు.. 1500 చిత్రాలు

2016లో వివిధ పత్రికల్లో ప్రచురించిన సూక్ష్మ కళాచిత్రాలను చూసిన పద్మారత్నం, వాటిపై ఆసక్తి పెంచుకున్నారు. తొలుత బాదం ఆకుపై టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రాన్ని గీశారు. దానిని ఓ పత్రికలో అచ్చువేయడంతో పలు వురు పద్మారత్నాన్ని అభినందించారు. ఆ తర్వాత ఎన్నో చిత్రాలు గీశారు. కళా రూపాలకు ప్రాణం పోశారు. ఇప్పటివరకు 1500 చిత్రాలు గీసి, వందకుపైగా కవిత లు రాసి ప్రముఖుల ప్రశంసలు, సత్కారాలు, అవార్డులు అందుకున్నారు. 2017లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా, 2018లో ఉత్తమ చిత్రకళాకారుడిగా, 2020లో సృజనాత్మక చిత్రకారుడిగా, 2021లో రచయతగా, తెలుగుబుక్ ఆఫ్ రికార్డు చిత్రకారుడిగా అవార్డులు అందుకున్నారు. రావి ఆకుపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని గీసి ఆయనకు బహూకరించాలనేది తన ఆశ అని పద్మారత్నం తెలిపారు.

పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

● జిల్లా పర్యాటక అధికారి ఉషశ్రీ

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పర్యాటక అభివృద్ధికి వనరులున్నాయని, వాటిని అభివృద్ధి చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా పర్యాటక అధికారి ఉషశ్రీ కోరారు. గురువారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పర్యాటకాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం-2025 సందర్భంగా ఫొటోగ్రఫీ రీల్స్ వీడియోల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, సాంస్కృతిక వారసత్వ కోటలు, జలపాతాలు, ఏకో-టూరిజం, స్థానిక వంటకాలు వంటి అంశాలను ప్రోత్సహిస్తూ విద్యార్థులు, ఫొటోగ్రాఫర్లు, సృజనాత్మక ప్రతిభ కలిగినవారు ఈ పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. వారు తీసే ఫొటోలు హై రిజల్యూషన్ కలిగి జిల్లాలో తీసినవి అయి ఉండాలన్నారు. జేపీజీ ఫార్మాట్‌లో అందించాలన్నారు. ఫొటోగ్రఫీ పోటీల్లో పాల్గొనేవారు ఈనెల20లోపు అందజేయాలని కోరారు. రీల్స్ వీడియోల పోటీలో పాల్గొనేవారు తమ రీల్స్‌ను 30 -90 సెకన్లు (ఇన్‌స్టాగ్రామ్), వీడియో వ్యవధి గరిష్ఠంగా 3నిమిషాలు ఉండేలా రూపొందించాలన్నారు. విజేతలకు ఈనెల 27న కలెక్టర్ బహుమతులు అందజేస్తారన్నారు. ఫొటోలు, వీడియోలు, రీల్స్‌ను ఈనెల 20సాయంత్రం ఐదు గంటల్లోగా జిల్లా పర్యాటక శాఖాధికారి కార్యాలయం, 2వ అంతస్తు, బోట్ షికారు క్యాంపస్, బారాషహీద్ దర్గా దగ్గర, దర్గామిట్ట, నెల్లూరులో అందించాలని ఆమె తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు తమ వివరాలను 94936 68022, 7780749802 నంబర్లలో నమోదు చేయించుకోవాలన్నారు.



రేపు జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కబడ్డీ అసోసియేషన్ ఆఫ్ నెల్లూరు జిల్లా ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా జట్ల ఎంపికలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలుర విభాగంలో 75 కేజీలు, బాలికల విభాగంలో 65 కేజీల విభాగంలో జరిగే ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 1-1-2006 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపికైనవారు విజయవాడలోని గొల్లపూడిలో ఈనెల 22 నుంచి 25 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు శనివారం సాయంత్రం 3 గంటలకు స్టేడియంలో హాజరు కావాలని తెలిపారు.

అమరవీరులు మనందరికీ స్ఫూర్తి : డీఎఫ్‌వో

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీ అమరవీరులు మనందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్‌బాషా పేర్కొన్నారు. జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా గురువారం నగరంలోని అటవీశాఖ కార్యాలయంలోని అమరవీరుల స్థూపానికి ఆయన నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ అటవీ సంపదను రక్షించడంలో ప్రాణాలను కోల్పోయిన వారి జీవితాలు అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రేంజర్ మాల్యాద్రి, కార్యాలయ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అటవీ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న డీఎఫ్‌వో మహబూబ్‌బాషా,ఉద్యోగులు

సీజనల్ హాస్టళ్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సమగ్రశిక్ష పరిధిలో నిర్వహిస్తున్న సీజనల్ హాస్టళ్ల నిర్వహణకు ఎన్‌జీవోలు, ఎస్‌హెచ్‌జీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీసీ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 15 సాయంత్రం 5 గంటలలోపు సమగ్రశిక్ష కార్యాలయంలో ఏపీసీకి దరఖాస్తులు అందచేయాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో నలుగురికి తీవ్ర గాయాలు

జలదంకి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జమ్మల పాలెంలోని కెవిఆర్ కన్వెన్షన్ వద్ద గురువారం విద్యుదాఘాతానికి గురై నలుగురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. కన్వెన్షన్ ఆర్చి మరమ్మతు పనులు చేస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. కూలీలు ట్రాలీ నిచ్చెనను పక్కకు జరుపుతుండగా అక్కడే ఉన్న 11 కెవి విద్యుత్ వైర్లను ట్రాలీ తగలడంతో నలుగురు కూలీలు విద్యు దాఘాతానికి గురై గాయపడ్డారు. వారిని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

● కందుకూరులో యువకుడి మృతి



మృతిచెందిన వెంకటచైతన్య

కందుకూరు : బుడం గుంటకాలనీకి చెందిన తలపల వెంకట చైతన్య (23) విద్యుదాఘా తంతో మృతి చెందాడు. కార్పెంటర్ సహాయకునిగా పనిచేస్తున్న ఈ యువకుడు పట్టణంలోని పడమర వడ్డె పాలెంలో నూతనంగా నిర్మి స్తున్న ఓ ఇంట్లో ఉడ్ ఎలక్ట్రిక్ డ్రిల్లింగ్ మిషన్‌తో పనిచేస్తుండగా ప్రమాదవ శాత్తు విద్యుత్ షాకుతో బుధ వారం రాత్రి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు తమకు న్యాయం చేయా లని గురువారం ఆందోళన చేపట్టారు. పట్టణ ఎస్ఐ శివనాగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌జీఎఫ్ కార్యదర్శుల నియామకం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిర్వహించే పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) కార్యదర్శులను నియమిస్తూ పాఠశాల విద్య డైరెక్టర్ విజయ్‌రామరాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో అండర్-17, అండర్-19 విభాగాలకు మాత్రమే కార్యదర్శులను నియమిస్తూ రెండేళ్ల కాలపరిమితితో నియామకాలు చేపట్టేవారు. ఈ ఏడాది మాత్రం సంవత్సరం కాలపరిమితితో అండర్-14, 17, 19 విభాగాలకు ముగ్గురు కార్యదర్శులను నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. అండర్-14 ,17 విభాగాలకు సంగం జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన పీఈటీ బీ వెంకటరామయ్యను నిర్వాహక కార్యదర్శిగా, పొదలకూరు డీఎన్ఆర్ జడ్పీబాలికోన్నత పాఠశాల పీఈటీ ఎం దేవికను అడ్మిన్ కార్యదర్శిగా నియమించారు. అండర్-19 విభాగానికి కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల పీడీ పీ.వేణుగోపాల్‌రెడ్డిని నియమించారు. అండర్-14, 17 విభాగాలను డీఈవో, అండర్-19 విభాగాన్ని డీవీఈవోలు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్పోర్ట్స్ క్యాలెండర్‌ను అనుసరించి జిల్లాలో క్రీడల ఎంపికలు, నిర్వహణ నిబద్ధతతో చేపట్టాలన్నారు. అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పీఈటీలు, పీడీలతో సమన్వయం చేసుకుంటూ ఎంపికలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు పూర్తి వివరాలను లీప్ యాప్, ఎస్‌జీఎఫ్ఐ పోర్టల్ ద్వారా నమోదు చేయాలన్నారు. అన్నీ రికార్డులు పక్కాగా నమోదు చేస్తూ ప్రతినెలా ఐదున తమకు అందచేయాలన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు, ఆరోపణలు లేకుండా ఎస్‌జీఎఫ్ నడుచుకోవాలని, ఫిర్యాదులు, ఆరోపణలు వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించారు.

2003 - డీఎస్సీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు మెమో 57 అమలు చేసి న్యాయం చేయాలని ఫ్యాప్టో నేతలు డిమాండ్ చేశారు. నగరంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్లు మాస ప్రసాద్, జీ.భాస్కర్ మాట్లాడుతూ 2003 నవంబర్‌లో నోటిఫికేషన్ విడుదలై, 2004 సెప్టెంబర్ 1 తరువాత నియమితులై సీపీఎస్ విధానంలోకి బలవంతంగా నెట్టబడ్డారన్నారు. ఈ విషయమై కేంద్రం సవరించిన మెమో 57ను అమలు చేసి రాష్ట్రంలోని 11వేల మందికి పైగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో 2003 ఉపాధ్యాయులు ఫోరమ్ నాయకులు చంద్రశేఖర్, శ్రీకాంత్, వెంగయ్య, ఇందిర, ఫ్యాప్టో నేతలు చలపతిశర్మ, హజరత్, దశరథరాములు, పిచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు



కండలేరు కాలువ పటిష్టతకు చర్యలు

కండలేరు కాలువ మట్టికట్టకు కార్మికులతో ఇసుక బస్తాలు వేయిస్తున్న అధికారులు

కలువాయి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సోమశిల కండలేరు వరద కాలువ పటిష్టతకు అధికారులు చర్యలు చేపట్టారు. (ఎస్‌కేఎఫ్ఎఫ్) 12కి.మీ ఉయ్యాలపల్లి సమీపంలో మట్టికట్టకు గత రెండు రోజులుగా ఇసుక బస్తాలు వేసి దెబ్బ తినకుండా పనులు చేస్తున్నారు. ఈప్రాంతంలో కండలేరు కాలువను విస్తరించి దానిపై జాతీయ రహదారి 565 కోసం వంతెన నిర్మించారు. దీంతో అప్పట్లో తాత్కాలికంగా పాత కాలువ, కొత్త వంతెన దగ్గర విస్తరించిన కాలువకు మధ్య మట్టికట్ట నిర్మించారు. అయితే ప్రస్తుతం కండలేరు కాలువకు 9వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. దీంతో కాలువలో నీటి ప్రవాహం ఈ మట్టికట్టను తాకుతుండంతో మట్టికట్ట దెబ్బతింటోంది. దీంతో ఇటీవల కాలువను పరిశీలించిన తెలుగుగంగ ఉన్నతాధికారులు ఇక్కడ ఇసుక బస్తాలు నింపి కాలువకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో అధికారులు రెండు రోజులుగా ఇసుక బస్తాలతో నింపే పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తయిన తరువాత కాలువకు నీటి విడుదలను 9వేల క్యూసెక్కుల నుంచి 10వేలకు పెంచుతామని అధికారులు తెలిపారు.

మనసు మార్చుకుని చంద్రబాబు కాళ్లు పట్టుకో!

● జగన్‌కు నుడా చైర్మన్ కోటంరెడ్డి హితవు



నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వీధి రౌడీలా మాట్లాడుతున్నారని, ఆయన తన మనసు మార్చుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కాళ్లు పట్టుకోమని లేదంటే చరిత్ర హీనుడిగా మారిపోతావని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి హితవు పలికారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో కోటంరెడ్డి విలేకరులతో మాట్లాడారు. పీపీపీ పద్ధతిలో వైద్య కళాశాలలకు ప్రభుత్వం అనుమతులు ఇస్తే తాను అధికారంలోకి వస్తే వాటిని రద్దు చేస్తామని జగన్ మాట్లాడటం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. పవన్, చంద్రబాబు బావిలో దూకాలంటూ జగన్ చేసిన వాఖ్యలపై మండిపడ్డారు. జగన్ చేసిన పాపాలకు వందల బావుల్లో దూకాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప జిల్లా బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడిగా గతంలో జగన్ పనిచేశాడని ఈ నేపథ్యంలో వైసీపీని మూసేసి టీడీపీలో చేరాలని హితవు పలికారు. వైసీపీ నేతలంతా జైలులో ఉన్నారని త్వరలో వైసీపీని మూసేసి ఆయన కూడా జైలుకు వెళ్లటం ఖాయమన్నారు. సూపర్ సిక్స్‌లో లేని హామీలు కూడా కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని అన్నారు. అంగన్వాడీలకు కూడా ప్రభుత్వం ఎంతో లబ్ధి చేకూర్చిందన్నారు. సూపర్ సిక్స్ సూపర్‌హిట్ మహాసభకు లక్షలాది మంది జనం తరలి వస్తే అసలు జనమే లేరంటూ కళ్లు లేని కబోదిలా జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ పూర్తిగా రౌడీల పార్టీ అని తాను టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్నప్పుడు తనను చంపాలని వైసీపీ గుండాలు చూశారని దుయ్యబట్టారు.

సూపర్ సిక్స్.. సూపర్ సక్సెస్!

● ప్రజాదరణ ఓర్వలేకనే జగన్, కాకాణి విమర్శలు : సోమిరెడ్డి



నెల్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : 'వైసీపీ ప్రభుత్వం అవినీతి, అరాచకాలకు పరిమితమైతే మా కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా నిలుస్తోంది. అనంతపురంలో నిర్వహించిన సూపర్ సిక్స్- సూపర్ హిట్ కార్యక్రమం సూపర్ సక్సెస్ కావడంతో వైసీపీ నేతలు ఓర్చులేకపోతున్నారు. ప్రభుత్వానికి వస్తున్న ప్రజాధరణను చూసి ఓర్వలేక వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు' అంటూ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. గురువారం నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిత్యం తనను, తమ పార్టీ నాయకులను తిట్టనిదే కాకాణికి తిన్నది అరగడం లేదని సోమిరెడ్డి ఎద్దేవా చేశారు. తాను ఫ్యాన్ వేస్తే ఎగిరిపోతానేమోగానీ కాకాణిలా మాత్రం ఊళ్లోవాళ్ల ఆస్తులు తిని అడ్డంగా బలవలేదని విరుచుకుపడ్డారు. సాగరమాల హైవేకు గ్రావెల్‌ను తోలుకుంటుంటే అదేదో తాము దోచుకుంటున్నట్లు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సాగరమాల పనులు చేస్తున్న ఏఎంఆర్, వీడీబీ సంస్థలు ఇప్పటి వరకూ గ్రావెల్ సీనరైజ్ కింద రూ.2.56 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాయని ఆధారాలతో సహా సోమిరెడ్డి వెల్లడించారు. సాగరమాల పనులు చేస్తున్న మేకపాటి అభిషేక్‌రెడ్డికి ఫోన్ చేసి అడిగితే కాకాణికి వాస్తవాలు తెలుస్తాయని హితవుపలికారు. వైసీపీ ప్రభుత్వంలో సర్వేపల్లిలో ఏవిధంగా గ్రావెల్ తవ్వకాలు జరిపి ప్రజాధనాన్ని కొల్లగొట్టారో అందరికీ తెలుసన్నారు. ఎస్ఈజెడ్‌లో సిలికా మైనింగ్ అంటూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడారని, ఆ ఎస్ఈజెడ్ అనేది తమకు చెందిన సీవీ రావుదని గుర్తు చేశారు. పచ్చి అబద్ధాలతో అధికారులను బెదిరించేలా కాకాణి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ఒక ప్రజాప్రతినిధిగా ఉండి 2016లో నకలి డాక్యుమెంట్ల కేసు సమయంలో 60 రోజులు కనిపించకుండా పోయారని, రుస్తుం మైన్స్ కేసులో 57 రోజులు అరణ్యవాసం గడిపి, ఆ తర్వాత జైలులో 87 రోజులు అజ్ఞాత వాసం గడిపారని ఎద్దేవా చేశారు. 204 రోజులు కనిపించకుండా పోయిన కాకాణికి మరో పీహెచ్‌డీ ఇవ్వాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

బిట్రగుంటలో పలు రైళ్లకు స్టాపింగ్

బిట్రగుంట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లకు అధికారికంగా స్టాపింగ్ ఇస్తూ రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి-కాకినాడ టౌన్ మధ్య నడిచే రైలు (17249) తెల్లవారుజాము 1.50 గంటలకు బిట్రగుంటకు వస్తుంది. కాకినాడ నుంచి తిరుపతి వెళ్లే రైలు (17250) రాత్రి 11 గంటలకు వస్తుంది. చెన్నైసెంట్రల్ నుంచి శ్రీవైష్ణవి దేవీమాత కాట్రా అండమాన్ ఎక్స్‌ప్రెస్ (16031) ఉదయం 8.15 గంటలకు వస్తుంది. ఈ రైలు బుధ గురు, ఆదివారాల్లో ఉంటుంది. శ్రీవైష్ణవిదేవిమాత కాట్రా నుంచి చెన్నై (16032) తెల్లవారుజాము 2.13 గంటలకు వస్తుండగా, సోమ, మంగళ, శుక్రవారాల్లో నడుస్తుంది. చెన్నైసెంట్రల్ నుంచి లఖ్‌నవ్ వెళ్లే (16093) ఉదయం 8.15 గంటలకు మంగళ, శనివారాల్లో ఉంటుంది. లఖ్‌నవ్ నుంచి చెన్నై సెంట్రల్ వెళ్లే (16094) తెల్లవారుజాము 2.13 గంటలకు ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు.